

అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



ట్రంప్ వాణిజ్య యుద్ధం : నేటి సామ్రాజ్యవాదం

జాతీయ యవనికపై మరోసారి తెలంగాణ

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 154 | ఆదివారం | 04-05-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


రంగనాయకసాగర్‌లో

## నీటమునిగి ఇద్దరు మృతి

మరో ఇద్దరిని కాపాడిన స్థానికులు



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్

సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం చంద్లాపూర్ గ్రామ పరిధిలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ వద్ద శనివారం విషాదం చోటుచేసుకుంది. దంచికొడుతున్న ఎండలకు సేద తీరేందుకు వచ్చిన వారిలో నలుగురు రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో నీట మునిగి నలుగురు గల్లంతయ్యారు. వారిలో ఇద్దరిని స్థానికులు కాపాడగా,ఇద్దరు చనిపోయారు. చనిపోయిన బాలుడు,బాలికల తరువాయి 2లో



## ఆలయంలో తొక్కిసలాట

ఆరుగురు మృతి, మరో 70కిపైగా మందికి భక్తులకు గాయాలు

05

పాకిస్థాన్ నుంచి వచ్చే

# దిగుమతులపై నిషేధం

- తక్షణం అమలులోకి తెస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- జాతీయ భద్రత, ప్రభుత్వ విధానానికి అనుగుణంగా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- నిలిచిపోనున్న ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులు
- పాకిస్థాన్ నౌకలపైనా నిషేధం
- తపాల సేవలూ రద్దు




**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ నుండి భారతదేశంలోకి వచ్చే అన్ని దిగుమతులపై తక్షణ నిషేధాన్ని భారత ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వువల్ల పాకిస్థాన్ నుండి వచ్చే అన్ని దిగుమతులు తక్షణ ప్రాతిపదికపై నిలిచిపోతాయి. జాతీయ భద్రత, ప్రభుత్వ విధానానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం శనివారం నాడు ఉత్తర్వులో స్పష్టం చేసింది. 2019లో పాకిస్థాన్ నుండి దిగుమతయ్యే వస్తువులపై 200 శాతం మేరకు సుంకాలు అమలు చేసినప్పటికీ పుల్వామాలా జరిగిన ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడి తర్వాత ప్రత్యక్ష దిగుమతులను నిలిపివేశారు. తాజా నిర్ణయం ప్రకారం పాకిస్థాన్ సరుకులను మరో దేశం ద్వారా భారత్‌లోకి ప్రవేశించకూడా ఇప్పుడు తక్షణం రానివ్వకుండా ఉత్తర్వు జారీ చేశారు. 2024 –25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జనవరి నెలలమధ్య భారత్ నుండి పాకిస్థాన్‌కు 447.65 మిలియన్ డాలర్లు ఎగుమతులు జరిగాయి. కానీ దిగుమతులు మాత్రం చాలా తక్కువగా 0.42 మిలియన్ డాలర్ల మేరకే జరిగాయి. అంజీర, తులసి, దవళము వంటి హెర్బల్ ఉత్పత్తులను వరుసగా 78,000 డాలర్లు, 18,856 డాలర్లు మేరకు దిగుమతి చేసుకున్నాం, హిమాలయ పింక్ సాల్ట్ కూడా 2023–24 ఆర్థిక సంవత్సరంలో 2.88 మిలియన్ డాలర్ల మేరకు ఉత్పత్తి చేసుకున్నాం. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకూ ఒక విదేశఋ వాణిజ్య విధానం కింద ప్రత్యక్ష, పరోక్ష వాణిజ్య ఉత్పత్తుల రవాణా పాకిస్థాన్ నుండి జరగడానికి వీల్లేదని తాజా ఉత్తర్వు సారాంశం. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి) మే రెండో నాడు ఈ మేరకు ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. దీంట్లో ఎలాంటి మినహాయింపులైనా అవసరం అయితే ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా ఉండాల్సిందేనని ఉత్తర్వు పేర్కొంది. పహల్గామ్‌లో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు దాడి చేసిన తర్వాత పరిణామాల్లో భాగంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వుల ద్వారా పాకిస్థాన్ నుండి ఏ ఇతర వాణిజ్య మార్గాల నుండైనా వచ్చే ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులు యుద్ధ ప్రాతిపదికపై నిలిచిపోతాయి. పహల్గామ్‌లో దాడి తర్వాత భారత ప్రభుత్వం అనేక వరుస తరువాయి 2లో

ఉగ్రవాదులను అణచివేసేందుకు

## అంగోలాకు 200 బి.డాలర్లు సాయం

**న్యూఢిల్లీ:** ఉగ్రవాదులను అణచివేసేందుకు ఆంగోలా దేశానికి భారతదేశం ఆర్థిక సహాయం ప్రకటించింది. దక్షిణాఫ్రికాలో పశ్చిమ మధ్య తీరప్రాంత దేశం ఆంగోలా సాయుధ బలగాలకు 200 బిలియన్ డాలర్లు రక్షణ పరపతి సహాయాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శనివారంనాడు ప్రకటించారు.ఉగ్రవాదులకు వ్యతిరేకంగా కృతనిశ్చయంతో నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని, ఉగ్రవాదుల వెనుక సూత్రధారులను వదిలిపెట్టకూదని ఆయన కోరారు. భారత్‌లో పర్యటించిన ఆంగోలా దేశాధ్యక్షుడు జకావో మాన్యువల్ గోన్కాల్వ్స్ లారెన్కోతో మోదీ విస్తారంగా సంభాషణలు చేశారు. ఆ తర్వాత మోదీ పైవిధంగా వ్యాఖ్యానించారు.రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక సంబంధాలను విస్తరించుకోవడం, ప్రభుత్వ మౌలిక సదుపాయాలలో డిజిటల్ సేవలను ప్రవేశపెట్టే విషయంపై కూడా నాయకులు దృష్టి సారించారు. ప్రధానమంత్రి మోదీ మీడియాకు తరువాయి 2లో



నాలుగు రోజులు

## తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

- బంగాళాఖాతంలో ఉత్తర, దక్షిణ ద్రోణి ప్రభావంతో అకాల వానలు
- గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఈ వేసవికాలంలో భిన్నమైన వాతావరణం నెలకొంది. పగటిపూట వేడి గాలులు, ఎండవేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు సాయంత్రం కాగానే వర్షాలతో చల్లటి వాతావరణం ఉపశమనాన్ని కలిగిస్తోంది. పగటిపూట ఎండలు దచ్చికొడుతుండగా సాయంత్రం తరువాయి 2లో



## కులగణనకు వ్యతిరేకం కాదు

- 5న అంబర్‌పేట్ ఫ్లై ఓవర్ ప్రారంభం
- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

కులగణన చేయని తెలంగాణ ఎలా రోల్ మోడల్ అవుతుందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణనకు తాము వ్యతిరేకం కదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయలేదని, కులాల సర్వే మాత్రమే చేసిందని ఆరోపించారు. అది కూడా తూతూమంత్రంగా ముగించిందని విమర్శించారు. మత ప్రతిపాదికన ముస్లింలను బిసిల్లో చేర్చిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో మొదటి సారి కుల గణన జరుగుతోందని, ఆది మోదీ గొప్పతనమన్నారు. కులగణన అంటే రాజ్యాంగం ప్రకారం, చట్టప్రకారం చేయాలన్నారు. భారత ప్రభుత్వం కులగణన చట్టం ఆధారంగా జనాభా లెక్కలతో పాటు పక్కాగా దేశంలో కులగణనను చేపట్టనుందన్నారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రతి ఒక్క వ్యక్తి దగ్గరికి, ప్రతి ఇంటికి వెళ్లి పారదర్శకంగా జనాభా లెక్కలతో తరువాయి 2లో

## ఆస్ట్రేలియా ఎన్నికల్లో లేబర్‌పార్టీ ఘన విజయం

- రెండోసారి అధికారాన్ని చేజిక్కించుకున్న ఆంథోనీ ఆల్బెనీస్
- 21 ఏళ్లలో వరుసగా ప్రభుత్వం తిరిగి ఎన్నిక కావడం ఇదే ప్రథమం
- 70 సీట్లలో సెంట్రల్ లెఫ్ట్ లేబర్ పార్టీ విజయం
- ప్రతిపక్ష జాతీయ కూటమి 24 సీట్లలో గెలుపు




**సిడ్నీ :** ఆస్ట్రేలియా పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ప్రధానమంత్రి, సెంటర్ లెఫ్ట్ లేబర్‌పార్టీ నాయకుడు ఆంథోనీ ఆల్బెనీస్ రెండోసారి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. మరో మూడేళ్ళపాటు ఆయన అధికారంలో ఉంటారు. గడచిన 21 సంవత్సరాలలో ఇలా వరుసగా ప్రభుత్వం తిరిగి ఎన్నిక కావడం ఇదే ప్రథమం. సెంటర్ లెఫ్ట్ లేబర్‌పార్టీ 70 సీట్లు గెలుచుకోగా, ప్రతిపక్ష జాతీయ కూటమి 24 సీట్లు మాత్రమే గెలుచుకుంది. దిగువసభ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో మొత్తం 150 స్థానాలు ఉన్నాయి. ఇతర చిన్నపార్టీలు, ఇండిపెండ ఎంట్లు కలిసి మరో 13 స్థానాలు గెలుచుకునే అవకాశాలున్నాయి. తాను తన అధికార బృందం ఆదివారం నుండి తిరిగి ప్రభుత్వ విధులు చేపడతామని విజేత ఆల్బెనీస్ తక్షణ ప్రకటన చేశారు. సరికొత్త కృతనిశ్చయం, సరికొత్త విశ్వాసం, సరికొత్త ఆశలతో తమన పనివిధానాన్ని పునః ప్రారంభిస్తామన్నారు. ఆస్ట్రేలియా తరువాయి 2లో

## ఫ్యూచర్ సిటీలో 'ఇ-సిటీ'

- 2500 మంది యువతకు ఉపాధి
- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా 'ఎలెక్ట్రానిక్ సిటీ(ఇ–సిటీ)ని అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రంలో సయుక్తంగా రూ.300 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన టెలికాం ఉత్పత్తుల సంస్థలు సిరా నెట్ వర్క్స్(తైవాన్), ఎల్ సిజిసి రెజల్యూట్ గ్రూప్(తెలంగాణ) ప్రతినిధులతో ఆయన శనివారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఎలెక్ట్రానిక్ పరిశ్రమల తరువాయి 2లో

## 70.13 లక్షల మెట్రిక్ టన్నులు

యాసంగిలో ధాన్యం సేకరణ లక్ష్యం

- ఇప్పటి వరకు దాదాపు 30 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు సేకరణ పూర్తి
- కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- 8,329 సెంటర్ల ఏర్పాటు


ప్రజాపక్షం/హైదరాబాద్



వరి ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ఏడాది యాసంగి సీజన్‌లో సైతం రికార్డు స్థాయిలో వరి ధాన్యం ఉత్పత్తికావడంతో 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసిన ప్రభుత్వం గడిచిన 45 రోజుల్లో దాదాపు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించి 8,329 సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం కోతలు పూర్తిగా ఊపు అందుకోవడంతో పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు వస్తున్నారు. అన్ని కొనుగోలు సెంటర్లలో రైతులకు ఇబ్బందులు కలగకుండా కనీస సౌకర్యాల కల్పించడంతో పాటు అకాల వర్షాలతో ధాన్యం అరబోసుకునేందుకు అన్ని ఏర్పాట్లను చేయడంతో పాటు తడిసిపోకుండా ఉండేందుకు తార్పర్లను అందుబాటులో ఉంచారు. మార్చి 15 నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభం అయినప్పటికీ సన్న బియ్యం ఇప్పుడిప్పుడే కొనుగోలు సెంటర్లకు పూర్తి స్థాయిలో తరలి వస్తుండడంతో అధికారులు ఏర్పాట్లును మరింత ముమ్మరం చేశారు. అదేవిధంగా అకాల వర్షాలతో కొనుగోలు సెంటర్లలో ధాన్యం తడిసిపోకుండా కేంద్రాల వారికి ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులను తెలియజేస్తూ అప్రమత్తం చేస్తున్నారు. దీంతో వర్షాలు వచ్చే సూచనలు అందిన వెంటనే రైతులు తమ ధాన్యం తడిసిపోకుండా రక్షణ చర్యలు తరువాయి 12లో



మే డే సందర్భంగా శ్రీలంకలో అధికార జనతా విముక్తి పెరమున(జెవిపి) ఆధ్వర్యంలో రాజధాని కొలంబోలో గురువారం జరిగిన భారీ బహిరంగసభకు సిపిఐ తరుపున జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎంపి బినొయ్ విశ్వం హాజరై ప్రసంగించారు. సాగరతీరంలో అశేషజనవాహిని ఉద్దేశించి శ్రీలంక అధ్యక్షుడు అనురకుమార దిస్సనాయకే చేసిన ప్రసంగానికి భారీ స్పందన లభించింది. అంతకుముందు శ్రీలంక అధ్యక్షుడి అనురకుమారతో బినొయ్ విశ్వం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.



# ప్రపంచం
WORLD NEWS

## భారత్‌తో రక్షణ ఒప్పందాన్ని పార్లమెంట్ ముందుంచుతాం : దిస్సనాయకే

**కొలంబో :** భారత్–శ్రీలంక మధ్య జరిగిన రక్షణ ఒప్పందాన్ని పార్లమెంట్ ముందుంచుతామని ఆ దేశ ప్రధానమంత్రి అనుర కుమార దిస్సనాయకే ప్రకటించారు. ఏప్రిల్ 4, 5 తేదీలలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీలంకలో పర్యటించినప్పుడు ఆ దేశంతో రహస్య సైనిక ఒప్పందం చేసుకున్నారంటూ శ్రీలంక ప్రతిపక్షాలు ప్రధానమంత్రిపై విరుచుకుపడ్డాయి. దీంతో ప్రధానమంత్రి దిస్సనాయకే శనివారంనాడు పైవిధంగా వివరణ ఇచ్చారు. ఎన్‌పిపి ప్రభుత్వం నరేంద్రమోదీతో రహస్య సైనిక ఒప్పందం చేసుకుందని ప్రతిపక్షాలు విమర్శించడంతో ఆ ఎంఒయును పార్లమెంటు ముందుంచుతామని దిస్సనాయకే ప్రకటించారు. ''వారు తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారు, ఊహాగానాలు చేస్తున్నారు, నిజాలు వారికి తెలియదు, రెండు దేశాలమధ్య అధికారికంగా ఒప్పందాలు జరిగాయి, అవి బాహాటంగానే ఉన్నాయి, మనదేశ భద్రతకు భరోసా కల్పించేందుకే ఈ ఒప్పందాన్ని భారత్‌తో చేసుకున్నాం, ఇది ఒప్పందంలో స్పష్టంగా ఉంది'' అని దిస్సనాయకే శుక్రవారంనాడు ప్రభుత్వటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

## ట్రంప్ 2026 బడ్జెట్‌లో చదువుసహా జనానికి కోత – రక్షణవ్యయం మోత



**వాషింగ్టన్ :** కొత్త సంవత్సరంలో ట్రంప్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 163 బిలియన్ డాలర్లు మేరకు జనం ఖర్చుల్లో కోత పెట్టారు. రక్షణ వ్యయాన్ని అతిభారీగా పెంచారు. చదువు ఖర్చుల్లో భారీగా కోత పెట్టారు. అమెరికా ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు ఫెడరల్ గవర్నమెంట్ ప్లాన్‌ను 15.3 శాతం మేరకు తగ్గించారు. విద్యార్థులకు పార్ట్‌టైమ్ జాబ్ వర్క్ స్టడీ కింద గత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన 1.2 బిలియన్ డాలర్లు నుండి 980 డాలర్లు కోత పెట్టారు. జాతీయ రక్షణకు 892.6 బిలియన్ డాలర్లను ప్రతిపాదించారు. పేద దేశాలకు సహాయం చేయడానికి వీలుగా వలర్డ్‌బ్యాంక్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్‌కు మూడు సంవత్సరాలపాటు 3.2 బిలియన్ డాలర్లు కేటాయించారు. సిఐఎ, ఇతర గూఢచారి సంస్థ నిర్వహణ ఖర్చుల్లో కోత విధించారు.
రక్షణశాఖకు గతంకంటే 133.3 బిలియన్ డాలర్లు కేటాయింపులు పెంచారు. హోమ్‌లాండ్ సెక్యూరిటీకి 42.3 బిలియన్ డాలర్లు అంటే 65 శాతం మేరకు ప్రోత్సాహం ఇచ్చారు. రక్షణ వ్యయానికే ఆయన ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. హౌసింగ్ ఖర్చుల్లో, మెడికల్ రీసెర్చ్ ఖర్చులను కూడా తగ్గించేశారు. రక్షణ వ్యయానికి, ఈ సరిహద్దు భద్రతకే ఆయన అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. హోమ్‌లాండ్ సెక్యూరిటీ ఖర్చులను 65 శాతం మేరకు భారీగా పెంచారు. అక్రమ వలస ప్రజలు దేశంలోకి రాకుండా, వారు దేశంలో నేరాలు చేయకుండా ఉండాలనేదే తన ప్రధాన ఉద్దేశమని ట్రంప్ చెబుతున్నారు. సరిహద్దులు దాటి అక్రమంగా వచ్చేవారంతా క్రిమినల్ గ్యాంగులుగా తయారై దేశాన్ని నేరమయం చేస్తున్నారని, డ్రగ్స్ వ్యాపార గ్యాంగులను సృష్టిస్తున్నారని ట్రంప్ మొదటి నుండీ వాదిస్తున్నారు. మెడికేర్, సోషల్ సెక్యూరిటీ, ఇంటర్నల్ పేమెంట్స్, వడ్డీ చెల్లింపులు వంటివాటికి కేటాయింపులను 2017 నాటి స్థాయికి గణనీయంగా కోత విధించారని వైట్‌హౌస్ అఫీషియల్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ అధికారి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ట్రంప్ బడ్జెట్ విధానాలను కాంగ్రెస్‌లో డెమోక్రటిక్ పార్టీ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇంటర్నల్ రెవెన్యూ సర్వీసెస్‌కు రెండు బిలియన్ డాలర్లు, హెల్త్, డిజీస్ కంట్రోల్ ప్రివెన్షన్ నేషనల్ ఇనిస్టిట్యూట్‌కు 40 శాతం మేరకు కోత పెట్టడాన్ని డెమోక్రాట్లు వ్యతిరేకించారు. చంద్రుడిపై పరిశోధనలు చేసేందుకు నాసాకు ప్రతిపాదించిన మొత్తం నుండి ఆరు బిలియన్ డాలర్లు కోత విధించి అంగారకుడిపై పరిశోధనలకు కేటాయింపులు పెంచారు. ఈ విషయంలో స్పేస్ ఎక్స్ అధిపతి ఎలాన్‌మస్క్ ప్రభావం చాలావరకూ ట్రంప్ మీద ఉంది. విదేశీ సహాయాన్ని 49 బిలియన్ డాలర్లు తగ్గించారు. ఇంటీరియర్ డిపార్‌టెమెంట్‌కు 30.5 ల్యాండ్ మేనేజ్‌మెంట్ బ్యూరోకు 198 మిలియన్ డాలర్లు కోత విధించారు.

## పోప్ ఫ్రాన్సిస్ మరణాన్ని ఎగతాళి చేసిన ట్రంప్!

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆగడాలు మితిమీరుతున్నాయా? ఆయన పోప్ ఫ్రాన్సిస్ మరణాన్ని ఎగతాళి చేశారా? అని ప్రశ్నించినప్పుడు ఔననే సమాధానం వస్తోంది. పోప్ దుస్తుల్లో ఉన్న ట్రంప్ తన అవతారాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కొంతమంది ఆయన పోప్ అవతారాన్ని చూసి నవ్వుకుంటుండగా మరికొంతమంది మాత్రం చాలా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోప్ ఫ్రాన్సిస్ మరణాన్ని ట్రంప్ ఎగతాళి చేస్తున్నారని మండిపడుతున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ట్రంప్ చిత్రాన్ని జనరేట్ చేశారు. ఏప్రిల్ 21వ తేదీన పోప్ ఫ్రాన్సిస్ తన 88వ ఏట మరణించారు. ట్రంప్ సహా అనేకమంది ప్రపంచ



నాయకులు ఆయన అంత్యక్రియలకు హాజరై నివాళులు అర్పించారు.

## సింగపూర్ పార్లమెంటుకు పోలింగ్

**సింగపూర్ :** సింగపూర్ 14వ పార్లమెంటుకు శనివారంనాడు పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. 3.70 మిలియన్లమంది అర్హులైన ఓటర్లు దేశంలో ఉన్నారు. పార్లమెంటులో మొత్తం 97 స్థానాలు ఉండగా, 92 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ప్రజల జీవన వ్యయాల పెరుగుదల, ఇళ్ల మస్య, జిఎస్‌టి వసూళ్ళు వంటి ప్రధానాంశాలకు పరిష్కారాలు చూపించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన 1,240 పోలింగ్ కేంద్రాలలో రాత్రి ఎనిమిది గంటలవరకూ ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. 34,000 మంది సిబ్బంది ఈ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు.

## దక్షిణకొరియా అధికారపార్టీ అధ్యక్ష అభ్యర్థిగా కిమ్ మూన్ సూ



**సియోల్ :** దక్షిణకొరియా అధికార పీపుల్స్ పవర్ పార్టీ తరపున ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థిగా కిమ్ మూన్ సూ ఎన్నికయ్యారు. ఆయన ప్రభుత్వంలో నిన్నమొన్నటి దాకా కార్మికశాఖ మంత్రిగా, ఎప్లాయ్‌మెంట్‌శాఖ మంత్రిగా పనిచేశారు. జూన్ 3వ తేదీన దక్షిణ కొరియాలో ఎన్నికలు జరుగుతాయి. కన్జర్వేటివ్ పార్టీ తరపున అధ్యక్ష పదవికి జరిగిన రేసులో కిమ్ మూన్ సూ పోటీకి అర్హుడిగా ఎంపికయ్యారు. తాత్కాలిక అధ్యక్షుడు హాన్ డక్ సూ కూడా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంతో ఉత్సాహం చూపించారు. కానీ ఆయనకు ఆ అర్హత లభించలేదు. 75 ఏళ్ళ వయసుగల కిమ్ మూన్ సూ పార్టీలో, ప్రభుత్వంలో అనేక పదవులు నిర్వహించారు. ఇతర ప్రజాస్వామ్యశక్తులతో అనుసంధానమై వారిని కలుపుకుని ముందుకు వెళ్ళగల సామర్థ్యం కిమల మూన్‌కు ఉందని పార్టీ ఉన్నతస్థాయి వర్గాలు భావించాయి. పార్టీలో అంతర్గతంగా జరిగిన ఓటింగ్‌లో కిమ్ మూన్‌కు 56.5 శాతం ఓట్లు రావడంతో అధ్యక్ష అభ్యర్థిగా ఆయన అర్హత సంపాదించారు. అధ్యక్షుడు యూన్ సుఖ్ యోల్‌ను పార్లమెంటు అభిశంసన తీర్మానం ద్వారా పదవీచ్యుతుణ్ణి చేయడానికి కార్మిక మంత్రి, ప్రస్తుత అధ్యక్ష అభ్యర్థి కిమ్ మూన్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన అంతపెద్ద తప్పేమీ చేయలేదని సమర్థించారు. కానీ చివరకు యోల్ కోర్టు కేసును ఎదుర్కోవలసి వచ్చింది.

## డిజిటల్ సవాళ్ళ మధ్య 'వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ డే'

**న్యూఢిల్లీ :** ప్రపంచవ్యాప్తంగా శనివారం (మే 3వ తేదీ) వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ డే పాటిస్తున్నారు. విధినిర్వహణలో ప్రాణాలు త్యాగం చేసిన జర్నలిస్టులకు ఈ సందర్భంగా పలుచోట్ల పాత్రికేయ సంఘాలు నివాళులు అర్పించాయి. సమకాలీన ప్రపంచంలో వాస్తవాన్వేషణ చేసే జర్నలిస్టులపై దాడులు, హింసాకాండ, వేధింపులు విపరీతంగా పెరిగిపోయాయి. స్వేచ్ఛ, సమానత్వాన్ని కోరిన జర్నలిస్టులు జైళ్ళపాలవుతున్నారు. ఇజ్రాయెల్, ఉక్రేన్‌లలో జరుగుతున్న యుద్ధాలలో కూడా డజన్ల సంఖ్యలో జర్నలిస్టులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. అనేకమంది జర్నలిస్టులు తప్పుడు కేసులు ఎదుర్కొంటూ కటకటాల్లో వేధింపులు ఎదుర్కొంటున్నారు. ప్రపంచంలో అనేక దేశాలలో మితవాద ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టులకు సవాళ్ళు అనుహ్యంగా పెరిగాయి. 1991 యునెస్కో జనరల్ కాన్ఫరెన్స్ 26వ సెషన్ చేసిన సిఫార్సులకు అనుగుణంగా 1993లో ఐక్యరాజ్యసమితి ఏటా మే 3వ తేదీని ''వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ డే''ను ప్రకటించింది. ఆఫ్రికన్ న్యూస్ పేపర్స్ జర్నలిస్టులు యునెస్కో 1991 సదస్సులో ప్రెస్ ఫ్రీడమ్ సూత్రాలను సమర్పించడంతో వాటిని యునెస్కో జనరల్ అసెంబ్లీకి రిఫర్ చేసింది. ఈ ఏడాది ఇజ్రాయెల్ దాడుల్లో అనేకమంది జర్నలిస్టులు విధి నిర్వహణలో మరణించారు. ఆరుగురుపైగా అల్‌జజీరా జర్నలిస్టులు ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో మరణించారు. బంగ్లాదేశ్ పత్రికల నివేదిక ప్రకారం 266 మంది జర్నలిస్టులు ఆ




దేశంలో అనేక కేసులు ఎదుర్కొంటున్నారు. తాత్కాలిక ప్రభుత్వానికి ఇటీవల ఒక కమిటీ ఇచ్చిన తన నివేదికలో జర్నలిస్టుల జీవితాలు మెరుగుపడటానికి వీలుగా అనేక సిఫార్సులు చేసింది. గత ఏడాది జులై, ఆగస్టు నెలల్లో బంగ్లాదేశ్‌లో జరిగిన విద్యార్థుల ఉద్యమాల సందర్భంగా అనేక మంది జర్నలిస్టులను క్రిమినల్స్‌గా చిత్రీకరించారు. 266 మంది కేసులు ఎదుర్కొంటున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజన్స్, సోషల్ మీడియా ఫ్లాట్‌ఫామ్స్, ఇతర సాంకేతిక మార్గాలద్వారా సమాచారం ప్రజల్లోకి శరవేగంగా వ్యాప్తించెందుతూ ఉండటంతో తప్పుడు వార్తలు, తప్పుడు కథనాలు, వందతుల వ్యాప్తివల్ల కూడా సాంఘిక కల్లోలం చెలరేగుతూ ఉండటం ప్రభుత్వాలను కలవరపరుస్తున్నాయి. తప్పుడు సమాచార వ్యాప్తి నుండి ప్రెస్ ఫ్రీడమ్‌ను రక్షించుకోవాల్సిన అవసరంపై ఇప్పుడు అందరూ దృష్టి కేంద్రీకరించారు.

## అమ్మ డయానాలా.. నేనూ చనిపోతానేమో?

### బ్రిటన్ రాజకుటుంబంలో విభేదాలు బట్టబయలు

**లండన్ :** బ్రిటన్ రాజకుటుంబంలో విభేదాలు బట్టబయలయ్యాయి. రాజు ఛార్లెస్ రెండో కుమారుడు హ్యారీ ఇంటి నుండి వేరుపడి విడిగా జీవించడం ప్రారంభించిన తర్వాత ఆయనకు భద్రతను తగ్గించారు. ఈ విషయంలో ఆయన కోర్టుకు వెళ్ళారు. కానీ కోర్టు కేసులో ఓడిపోయారు. దీంతో హ్యారీలో తీవ్ర మనోవేదన ప్రారంభమైంది. ఆయన డిప్రెషన్‌కు గురయ్యారు. తన తల్లి డయానా కారు ప్రమాదంలో మరణించినవిధంగానే తాను, తన భార్య మేఘన, పిల్లలు ప్రిన్స్ ఆర్చీ, ప్రిన్సెస్ లిలీబెట్ కూడా మరణించే పరిస్థితి వస్తుందన్నారు. కొంతమంది ఇదే కోరుకుంటున్నారన్నారు. తన తండ్రి చార్లెస్ తనతో సరిగ్గా మాట్లాడటంలేదని, చావులు, పెళ్ళిళ్ళకు తప్ప ఇంకెప్పుడూ తన కుటుంబంతో కలవడానికి, వెళ్ళి ఆనందంగా గడపడానికి తనకు అవకాశం లేకపోయిందని ఆయన అన్నారు. హ్యారిస్–మేఘనల వివాహం రాజకుటుంబానికి మొదటి నుండీ ఇష్టం లేదు. కానీ రాజకుటుంబాన్ని ఎదిరించి హ్యారిస్ వారికి ఇష్టంలేకపోయినాగానీ మేఘనను వివాహం చేసుకుని



విడిగా బ్రతుకుతున్నారు. తన సొంత సోదరుడితో కూడా తొలుత ఆయన ఘర్షణలుపడ్డారు. హ్యారిస్‌కు తల్లి డయానా అంటే ఎనలేని ప్రేమ. తన తల్లి డయానా 1997లో పారిస్‌లో తెల్లవారుజామున తన ప్రియుడితో కలిసి మెర్సిడెజ్ బెంజ్ కారులో వెళుతుండగా జర్నలిస్టులు వెంటపడ్డారు. వారిని తప్పించుకోవడానికి వారి కారు మహావేగంగా వెళ్ళి సొరంగంలో ఢీకుని ప్రమాదానికి గురైవారు మరణించారు. చరిత్ర పునరావృతం కావాలనితాను కోరుకోవడంలేదని, కానీ కొంతమందిమాత్రం కోరుకుటున్నారని ఆయన నిరాశానిస్పృహలకు గురయ్యారు.

## అంగోలాకు 200 బి.డాలర్ల సాయం
(మొదటి పేజీ తరువాయి)

ఒక ప్రకటన విడుదల చేస్తూ, రెండు దేశాలమధ్యా సంబంధాలకు ఇదొక కొత్త మార్గదర్శకంగా నిలుస్తుందని, దాంతోపాటే భారత్–ఆఫ్రికా దేశాల మధ్య భాగస్వామ్యం మరింత పటిష్టవంతం అవుతుందని పేర్కొన్నారు.
''భారతదేశం 200 మిలియన్ డాలర్ల రక్షణ పరపతిని అంగోళా రక్షణ దళాల ఆధునీకరణకు అందజేస్తున్నాం, అదేవిధంగా అంగోళా రక్షణ వ్యవస్థలకు మరమ్మతులు, ఆధునీకరణ, ఇతర రక్షణ సేవల సరఫరాలు చేస్తాం, ప్రజాజీవనంలో భారతదేశ డిజిటల్ మౌలిక సేవలను విస్తరిస్తాం, అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంలో కూడా వారి సామర్థ్యాలను వినియోగించుకుంటాం, రెండు దేశాల సంబంధాలను తదుపరి మరింతగా పటిష్టవంతం చేసుకుంటాం, ఎరువులు, కీలక ఖనిజవనరులు, వజ్రాలను సానపట్టడం వంటి అనేక విభాగాలలో రెండు దేశాల సంబంధాలు విస్తరిస్తాయి'' అని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు రెండు దేశాలు నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తాయన్నారు. ఆంగోలాకు భారత్ మద్దతుగా ఉంటుందన్నారు. అంగోలా, భారత్ రెండు గ్లోబల్ సౌత్‌లో కీలకస్థంభాలుగా ఉన్నాయని, భాగస్వాములుగా రెండు దేశాలు ముందుకు పయనిస్తాయన్నారు. నాలుగు రోజులు భారతదేశ పర్యటన నిమిత్తం లారెన్కో గురువారంనాడు ఢిల్లీకి వచ్చారు. ఆదివారంనాటితో ఆయన పర్యటన పూర్తి అవుతుంది.

## వ్యతిరేకం కాదు
(మొదటి పేజీ తరువాయి)

పాటు కులగణన చేయనుందన్నారు.
**భూ సేకరణకు అడ్డుపడుతున్నారు..**
అంబర్‌పేట్ ఫ్లైఓవర్‌ను ఈనెల 5న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభిస్తారని కిషన్ రెడ్డి తెలిపారు. ఇంటి స్థలం సేకరించిన తర్వాత ఒక రాజకీయ పార్టీ అడ్డుపడే ప్రయత్నం చేసిందన్నారు. కొంత మంది ఫ్లై ఓవర్‌ను ఆపే పని చేశారని, ఇంకా 6 చోట్ల భూ సేకరణ పూర్తి కాలేదన్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, జిహెచ్‌ఎంసికి లేఖ రాసినట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ హయాంలోనే అంబర్‌పేట్ ఫ్లై ఓవర్కు శంకుస్థాపన జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా 90 శాతం జిల్లాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రోడ్ల నిర్మాణం లేకుండా ఏ దేశమైనా అభివృద్ధి సాధించడం సాధ్యపడదన్నారు. పక్కా రోడ్లతో ఇంధన వినియోగ వ్యయం తగ్గుతుందని, ప్రమాదాలు తగ్గుతాయని, రవాణా వేగవంతమవుతుందని, గమ్యస్థానానికి తక్కువ సమయంలో చేరుకోవచ్చు అన్నారు. 2014లో తెలంగాణలో 2500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారులు ఉండగా, ఇప్పుడు అవి సుమారు 5200 కిలోమీటర్లకు పెరిగాయని, గత పదేళ్లలో రూ.1,25,485 కోట్లు జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. త్వరలోనే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి పలు జాతీయ రహదారులకు శంకుస్థాపన చేయనున్నారని కిషన్ రెడ్డి తెలిపారు.

## నీటమునిగి ఇద్దరు మృతి
(మొదటి పేజీ తరువాయి)

మృతదేహాలను గజ ఈతగాళ్ల సహాయంతో వెలికితీశారు. వరంగల్ జిల్లా ఖాజీపేటకు చెందిన ఎజాజ్‌అలీ,యాకుబ్‌బాబాలు తమ కుటుంబ సభ్యులు 13మందితో కలిసి ఇన్నోవా వాహనాలలో హైదరాబాద్ వెళుతూ మార్గ మధ్యలో రంగనాయకసాగర్ చూసేందుకు వచ్చారు. వీరిలో ఒక బాలిక సహా నలుగురు పిల్లలు ఈత కోసం నీటిలోకి దిగారు. వీరిలో ఈత కొట్టేందుకు దిగిన బాలిక గల్లంతయ్యింది. దీంతో బాలికను కాపాడే ప్రయత్నంలో మిగతా ముగ్గురు గల్లంతయ్యారు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి నలుగురిలో ఇద్దరిని కాపాడారు. మెహరాజ్(13), అర్ఫాజ్(15)లు మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చిన్నకోడూర్ పోలీసులు,జిల్లా ఫైర్ అధికారి ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. సంఘటన స్థలాన్ని సిద్దిపేట ఎసిపి మధు మృతదేహాలను పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిన్నకోడూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## లేబర్‌పార్టీ ఘన విజయం
(మొదటి పేజీ తరువాయి)

బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ విశ్లేషకుడు ఆంటోనీ గ్రీన్ అంచనా ప్రకారం, సెంటర్ లెఫ్ట్ లేబర్‌పార్టీకి 76 స్థానాలు, జాతీయ కూటమికి 36 స్థానాలు, స్వతంత్రులు, ఇతర పార్టీలకు 13 సీట్లు వస్తాయని అంచనావేశారు. ప్రతిపక్ష జాతీయ కూటమి ట్రంప్‌ను అనుకరించిందని, ఈ కూటమి అధికారంలోకి వస్తే పొదుపు చర్యల పేరిత ప్రజలను ఇబ్బందులు పెడుతుందని, ప్రభుత్వ సేవల్లో కోతలు విధించి సమస్యలు సృష్టిస్తుందని సెంటర్ లెఫ్ట్ లేబర్ పార్టీ భారీ ఎత్తున చేసిన ప్రచారం ఫలించింది. ప్రతిపక్ష నాయకుడు పీటర్ డట్టెన్ సారథ్యానగల ఉదారవాద జాతీయ కూటమిని ప్రజలు తిరస్కరించారు. పైగా ప్రతిపక్షనేత డట్టెన్ కాన్‌బెర్రా శివారుప్రాంతంలోని తన సొంత నియోజకవర్గం డిక్సన్‌లో ఓటమి చెందారు.
2007 నుడి ఇప్పటివరకూ ఏనాడూ ఇలా జరగలేదు. లోకల్ నెట్‌వర్క్ ఈ విషయం వెల్లడించింది. ఐతే ఆస్ట్రేలియా ఎన్నికల సంఘం ఈ ఫలితాలను అధికారికంగా వెల్లడించడానికి కొంత సమయం పడుతుంది. పీటర్ డట్టెన్ ఎన్నికల్లో తన ఓటమిని అంగీకరించారు. మేం సరిగ్గా ఎన్నికల ప్రచారం చేయలేకపోయామని ఆయన అంగీకరించారు. ప్రధానమంత్రి చారిత్రక విజయం సాధించారనీ, ఈ రాత్రే ఆయనను కలిసి అభినందనలు తెలియజేస్తాననీ డట్టెన్ చెప్పారు. ఆర్థిక సంక్షోభం, జీవన వ్యయాల పెరుగుదల,హెల్త్‌కేర్,అమెరికా సుంకాలు వంటి ప్రజా సమస్యలమధ్య ఆస్ట్రేలియాలో శనివారంనాడు పార్లమెంటు ఎన్నికలకు పోలింగ్ జరిగింది. సెంటర్ లెఫ్ట్–లేబర్‌పార్టీలు రెండూ అధికారంకోసం ప్రధానంగా పోటీపడ్డాయి. ట్రంప్ విజయం ఆస్ట్రేలియాకు తీరని నష్టం కలిగిస్తుందని గతనెలలో సిడ్నీ మోర్నింగ్ హెరాల్డ్ వార్తాపత్రిక నివేదికలో 60 శాతం ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయం ఎన్నికలపై గణనీయంగా పనిచేసింది. అది ఆల్బెనీస్ మళ్ళీ విజయం సాధించడానికి ఉపయోగపడింది. దేశంలో మొత్తం కోటీ 80 లక్షలమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. శనివారం పోలింగ్ జరిగిన తర్వాత సాయంత్రానికి ఫలితాలు వెలువడ్డాయి. సెంటర్ లెఫ్ట్ పార్టీ రాబోయే మూడు సంవత్సరాలు మళ్ళీ పరిపాలన సాగించడానికి వ్విళ్ళూరుతూ రెండోసారికూడా బరిలోకి దిగింది. ప్రస్తుత ప్రధానమంత్రి ఆంథోనీ ఆల్బెనీస్, ప్రతిపక్ష నాయకుడు పీటర్ డట్టెన్ మధ్య హోరాహోరీ ఎన్నికల పోరాటం జరిగింది. ఆంథోనీ ఆల్బెనీస్ లేబర్‌పార్టీకి నాయకత్వం వహిస్తున్నారు. ఎంతో పాపులారిటీ ఉన్న నాయకుడుగా అధికారంలోకి వచ్చిన ఆల్బెనీస్ ఇటీవలికాలంలో మత సమస్యలు, దేశీయ వ్యవహార సమస్యలు, ముస్లిం వ్యతిరేక సమస్యలను ఎదుర్కొంటున్నారు.
కాగా లిబరల్ నేషనల్ కూటమికి నాయకత్వం వహిస్తున్న బలమైన కన్జర్వేటివ్ నాయకుడు డట్టెన్‌కు గతంలో రక్షణ, హోం వంటి మంత్రిత్వశాఖలు నిర్వహించిన అనుభవం ఉన్నప్పటికీ సామాజికాంశాలలో ఆయన వివాదాస్పదుడు. ఇక వామపక్ష భావజాలంగల గ్రీన్స్ పార్టీ దేశంలో తృతీయ ప్రత్నామ్నాయంగా ఉంది. ఒకవేళ దేశంలో ఏపార్టీకి మెజారిటీ రాకుండా హంగ్ పార్లమెంటు ఏర్పడితే ప్రభుత్వ ఏర్పాటుకు తీవ్ర జాప్యం జరుగుతుంది. 2010లో ఇదేవిధంగా హంగ్ పార్లమెంటు ఏర్పడినప్పుడు సంప్రదింపులు పూర్తయి కొత్త ప్రభుత్వం ఏర్పడటానికి 17 రోజులుపైగా సమయం పట్టింది.

## దిగుమతులపై నిషేధం
(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకుంది. సింధుజలాల ఒప్పందం రద్దు, భారత్‌లో ఉన్న పాకిస్థాన్ పౌరులను తక్షణం పంపేయడం, పాకిస్థాన్ దౌత్యవేత్తల సంఖ్యను కుదించడం, సరుకుల దిగుమతులు నిలిపివేయడం, సరిహద్దులు మూసివేయడం వంటి చర్యలు తీసుకుంది. దీనికి ప్రతీకారంగా పాకిస్థాన్ కూడా భారత దౌత్యవేత్తలను బహిష్కరించింది. పాకిస్థాన్‌లో పర్యటిస్తున్న భారతీయులను తక్షణం వెనక్కు పంపింది. సరిహద్దును మూసివేసింది. భారత్‌తో అన్ని రకాల వాణిజ్యాన్ని పాకిస్థాన్ రద్దుచేసుకుంది.
**పాకిస్థాన్ నౌకలపై నిషేధం : తపాల సేవల రద్దు**
పాకిస్థాన్ నుండి వచ్చే అన్ని తపాల సేవలను భారతదేశం శనివారంనాడు రద్దుచేసింది. అదేవిధంగా పాకిస్థాన్ నౌకలకు భారతదేశ ఓడరేవులలో ప్రవేశాన్ని రద్దుచేసింది. పహల్గామ్ దాడి నేపథ్యంలో ప్రభుత్వం ఈ తాజా నిర్ణయం తీసుకుంది. రెండు దేశాలమధ్య పది రోజుల తర్వాత కూడా క్రమంగా ఉద్రిక్తతలు పెరుగుతూ ఉండటం, సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపు చర్యలు కొనసాగించడంతో ప్రభుత్వం కొత్త చర్యలకు పాల్పడింది. అదేవిధంగా పాకిస్థాన్ ఓడరేవులకు కూడా భారత నౌకలను వెళ్ళకుండా నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటికే పాకిస్థాన్ భారత విమానాలను ఆ దేశ గగనతలం నుండి వెళ్ళకుండా నిషేధించింది. భారత్ కూడా ఆదేవిధమైన చర్యలు తీసుకుంది. అన్ని రకాల మెయిల్స్, పార్శిల్స్ పాకిస్థాన్ నుండి రాకుండా జాగ్రత్తలు తీసుకుంది. సెక్షన్ 411 మర్చంట్ షిప్పింగ్ చట్టం కింద భారత ఓడరేవులలోకి పాకిస్థాన్ నౌకలకు ప్రవేశాన్ని నిషేధించింది. పాకిస్థాన్ జెండా తగిలించుకున్న ఏ నౌకా కూడా భారత్ ఓడరేవుల్లోకి ప్రవేశిచడానికి వీలులేదు.. భారత జెండా ఉన్న నౌకలు పాకిస్థాన్ రేవులకు వెళ్ళకూడదు. భారతదేశ రక్షణ చర్యల్లో భాగంగా ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయి. ఈనెల 22వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ త్రివిధ దళాలతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. త్రివిధ దళాలకు పూర్తిస్వేచ్ఛ ఇచ్చారు. ఎప్పుడు ఎక్కడ, ఎలా, ఏ సమయంలో పాకిస్థాన్‌పై దాడి చేయాలనే విషయంపై త్రివిధ దళాలే తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రధానమంత్రి వారికి స్వేచ్ఛ ఇచ్చారు. ఐతే అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్ సహా అనేక దేశాలు భారత్–పాకిస్థాన్‌లు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశాయి. ఐతే ఈ ఉగ్రవాద దాడికి వెనక సూత్రధారులను వదిలిపెట్టేదిలేదని భారతదేశం ప్రతిజ్ఞ చేసింది.

## 'ఇ సిటీ'
(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి వారికి వివరించారు. ఈ తరహా పరిశ్రమలు ఏర్పాటులో పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేస్తామన్నారు. టైర్ 2, టైర్ 3 నగరాలు, పట్టణాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో వారి అవసరాలకు అనుగుణంగా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యయ్యేందుకు ముందుకొచ్చిన సిరా నెట్ వర్క్స్, ఎల్ సీజీసీ రెజల్యూట్ గ్రూప్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తరపున అన్నిరకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుమారు 10 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే ఈ పరిశ్రమ ద్వారా 2500 మంది యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇక్కడ 5జీ నెట్ వర్క్స్ , మల్టీ లేయర్ నెట్వర్కింగ్ సొల్యూషన్స్, సర్వర్స్ తదితర టెలికాం ఉత్పత్తులను తయారు చేస్తారన్నారు. ఈ పెట్టుబడితో ఇండో తైవాన్ మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.
సమావేశంలో టిజిఐసిసి సిఇఒ మధుసూదన్, టి ఫైబర్ ఎండి వేణుప్రసాద్, సిరా నెట్వర్క్స్ ప్రతినిధులు చయాన్, జాయ్ భట్టాచార్య, డౌగియాస్, ఎల్ సిజిసి రెజల్యూట్ గ్రూప్ నుంచి రణ్వీందర్ సింగ్, గీతాంజలి సభర్వాల్ పాల్గొన్నారు.
**త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ**
రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి అన్ని క్రీడల అభివృద్ధికి జిల్లాల వారిగా ప్రత్యేక అకాడమీలు నెలకొల్పుతామని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. క్రీడల్లో గ్రామీణ ప్రాంత యువత శిక్షణకు ప్రాధాన్యతనిచ్చేలా తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. చదువుతో పాటు ప్రతి ఒక్కరూ క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలని ఆయన కోరారు. శనివారం నాడు మినిష్టర్స్ క్వార్టర్స్‌లో తనను కలిసిన తెలంగాణా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన సలహాదారు కోసరాజు లక్ష్మణ్, మీడియా కోఆర్డినేటర్ వెంకట రమణారెడ్డిలను ఆయన అభినందించారు. వారికి నియామక పత్రాలు అందజేసారు. బ్యాడ్మింటన్ క్రీడ మరింత విస్తరించేందుకు పాటుపడాలని తెలంగాణా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కూడా అయిన శ్రీధర్ బాబు వారికి దిశానిర్దేశం చేసారు. మంత్రిని కలిసిన వారిలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఈవెంట్స్ అండ్ ప్రోటోకాల్ ప్రతినిధి యువిఎన్ బాబు తదితరులు ఉన్నారు.

## కుల సర్వేను తప్పుపట్టడమంటే.. తెలంగాణ ప్రజలను అవమానించడమే

### బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో జరిగిన కుల సర్వేను తప్పుపట్టడం పట్ల తెలంగాణ బిసి కమిషన్ తీవ్రమైన అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. సెన్సెస్ జరపటం అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందనే విషయం నిస్సందేహం అయినా తెలంగాణలో జరిగిన కుల సర్వే, కులగణనను ఏమాత్రం తీసిపోకుండా అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని, రాష్ట్ర ప్రజలల్లో ఏ కులానికి చెందినవారు, ఎంత సంఖ్యలో ఉన్నారో వారి రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ పరిస్థితులను సమగ్రంగా ఇంటింటికి వెళ్ళి విచారించడం జరిగిందని తెలంగాణ బిసి కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. తెలంగాణలో సర్వేను అభాసుపాలు చేసే ప్రయత్నంకన్నా, కేంద్ర ప్రభుత్వంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు అసెంబ్లీలో ఆమోదించి పంపిన బిల్లులకు చట్టబద్ధత కలిగించే విధంగా ప్రయత్నిస్తే తెలంగాణ ప్రజలు హర్షిస్తారని అన్నారు. సర్వే జరిగిన 2 దశలలో 1,12,36,849 కుటుంబాలను (97.10శాతం) కవర్ చేయడం జరిగిందన్నారు. ఇంత పకడ్బందీగా 94,261 ఎన్యూమరేషన్ల బ్లాక్‌లను ఏర్పాటు చేసి, 1,03,889 ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించి, సమాచారాన్ని సేకరించడం జరిగిందన్నారు. ఇంత పకడ్బందీగా చేసిన సర్వేను తప్పుల తడకగా పేర్కొనడం తెలంగాణ ప్రజలను అవమానించడమే అవుతుందన్నారు. ఈ సర్వే సమాచారం ఆధారంగా అసెంబ్లీలో దీనిపై పూర్తిస్థాయిలో చర్చ జరిగి, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 2 బిల్లులను కూడా ఆమోదించడం జరిగిందన్నారు.

## మోస్తరు వర్షాలు
(మొదటి పేజీ తరువాయి)

వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతో ప్రజలకు ఊరట కలిగిస్తోంది. దీంతో రాష్ట్రంలో భిన్న వాతావరణం నెలకొని ఉంది. రాబోయే రెండురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పులు ఉండవని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయన్నారు. రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. బంగాళాఖాతంలో ఉత్తర, దక్షిణ ద్రోణి ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఉదయం పూట ఎండలు దంచికొట్టినప్పటికీ సాయంత్రం వేళల్లో వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని చెప్పారు. ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్, మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని వివరించారు. మంచిర్యాల, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజిగిరి, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే సూచనలున్నాయని చెప్పారు. ఈనెల 5న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వివరించారు. మంగళవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనూ వర్షాలు కరుస్తాయని, పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామని తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సిఎస్ రామకృష్ణారావుకు సిపిఐ నాయకుల అభినందనలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన రామకృష్ణారావుకు సిపిఐ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి అభినందనలు తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో సిఎస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పల్లా వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యంలు ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# దేవాదుల ప్రాజెక్టును అన్ని దశల్లో పూర్తి చేస్తాం



సాగునీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

దేవాదుల పంపుహౌజ్ స్టేషన్‌ను సందర్శించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : దేవాదుల ప్రాజెక్ట్‌కు సంబంధించిన అన్ని దశలను పూర్తిస్థాయిలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాగునీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట శివారులోని దేవాదుల పంపు హౌజ్ స్టేషన్‌ను రాష్ట్ర సాగునీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ, పాలకుర్తి, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కే ఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిడబ్ల్యుఎంసి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ నుండి నేరుగా దేవన్నపేటలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద మంత్రులు దిగగా ఎమ్మెల్యేలు, కలెక్టర్, తదితరులు పుష్పగుచ్చాలను అందజేశారు. దేవాదుల పంపు హౌజ్ స్టేషన్ చేరుకున్న మంత్రు లు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి టన్నెల్ ను పరిశీలించారు. అనంతరం దేవాదుల పంపు హౌజ్ పనుల పురోగతి, ఇతర అంశాలపై సాగునీటిపారుదల శాఖ అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్ట్ అన్ని దశలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే దేవాదుల పంప్ హౌస్ ను సందర్శించి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి సాగునీరు, ధాన్యం కొనుగోలు, తదితర అంశాలపై సమీక్షించేందుకు జిల్లాకు వచ్చినట్లు పేర్కొన్నారు. దేవాదుల మూడు పైపు లైన్ల పంపులను ఆన్ చేసి సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేవాదుల పంప్ హౌస్ నుండి ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద ఉన్న దేవాదుల పైపులను మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా సాగునీటిపారుదల శాఖ ఈఎన్సి అనిల్ కుమార్, సీఈ అశోక్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నాలుగు లక్షల మందితో తుది జాబితా

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్/రంగారెడ్డి: ఇందిరమ్మ ఇంటి కోసం కొద్దిరోజుల్లోనే నాలుగు లక్షల మందితో తుది జాబితాను రూపొందించబోతున్నామని, విధుల్లో చేరిన వెంటనే అసిస్టెంట్ ఇంజనీర్లు ఈ జాబితాలపై దృష్టి సారించాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఎటువంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు గురికాకుండా, అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు లభించేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. భారతదేశంలో పేదలకు ఇంత పెద్ద ఎత్తున రూ.5 లక్షలతో సంవత్సరానికి నాలుగున్నర లక్షల ఇండ్లు నిర్మిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు.

హౌసింగ్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్‌లో నియామకమైన 350 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో ఆరు రోజుల పాటు శిక్షణ పొందారు. న్యాక్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శిక్షణ పూర్తి చేసుకున్న ఇంజనీర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న సంకల్పంతో సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అవినీతికి ఆస్కారం లేకుండా నిజాయితీ, నిబద్ధతతో పని చేసి, పేదవాడి చిరకాల కోరిక నెరవేరుస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగస్వాములు కావాలని అసిస్టెంట్ ఇంజనీర్లకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల చెల్లింపుల్లో ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ఉండేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామని తెలిపారు. వివిధ దశల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ప్రతి సోమవారం చెల్లింపుల ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినప్పటికీ మెరిట్ పద్ధతిలోనే ఎంపిక చేసినట్టు వివరించారు. ఈ ఏడాది రూ 22 వేల కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని, ఇందుకు సంబంధించి మరికొద్దిరోజుల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని, ఇప్పటికే పైలట్ గ్రామాల్లో ఇండ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని వివరించారు.

దేశంలో ఏరాష్ట్రంలో కూడా ఏ సంక్షేమ పథకం కింద ఒక్క లబ్ధిదారునికి రూ 5 లక్షలు ఇస్తున్న పథకం లేదన్నారు. ఇండ్ల పథకాల్లో కూడా కేంద్రం ఇస్తున్న నిధులతోనే అన్ని రాష్ట్రాలు సరిపెడుతున్నాయని, కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇందిరమ్మ ప్రభుత్వం రూ.5 లక్షలతో 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఇండ్లను లబ్ధిదారుడే నిర్మించుకునేలా పథకాన్ని రూపొందించిందని తెలిపారు. నిర్మాణ రంగంలో తనకు ఉన్న అనుభవంతో తక్కువ ఖర్చు, నాణ్యతతో ఇండ్లను నిర్మించేందుకు అధికారులకు పలు సూచనలు చేశామన్నారు. యువ ఇంజనీర్లు ఈ అంశాలపై ప్రధానంగా దృష్టి సారించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపికైన 350 మంది ఇంజనీర్లలో 45 శాతం మహిళలే ఉండడం సంతోషమన్నారు.

**పదోన్నతులు పొందిన 21 మందికి సర్టిఫికెట్లు**

స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో 21 మందికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. గ్రేడ్ 2లో పని చేస్తున్న10 మంది సబ్ రిజిస్ట్రార్లను గ్రేడ్ 1లో సీనియర్ సహాయకులుగా పని చేస్తున్న 11 మందికి, గ్రేడ్2గా పదోన్నతులు కల్పించారు. వీరికి పదోన్నతి పొందినట్టు మంత్రి పొంగులేటి సర్టిఫికెట్లను అందజేశారు.

# ప్రజాస్వామ్యం, లౌకికవాదం రక్షణ కోసం యువత పోరాడాలి



ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి /హైదరాబాద్: మతోన్మాదులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య రక్షణ, కోసం లౌకికవాదం రక్షణ కోసం యువత పోరాడాలని ఏఐవైఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ పిలుపునిచ్చారు. వరంగల్‌లోని శివనగర్ లోని తమ్మెర భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 66వ ఆవిర్భావ దినోత్సవం ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి యువజన సమాఖ్య ఏర్పడి యువకుల హక్కుల కోసం ప్రతి సమస్యను పరిష్కరించడంలో ముందుందన్నారు. ఓటు హక్కు 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకులకు కల్పించాలని, ఎన్నో పోరాటాలు చేసి ఓటు హక్కును సాధించిన ఘనత ఏఐవైఎఫ్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, హసీనా, విజయ్, కిరణ్, రాజు పాల్గొన్నారు.

**యువతకు విద్య, వైద్య, ఉపాధి హక్కులను కల్పించడంలో పాలకులు విఫలం : ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర**

పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ యువత పోరాడాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద ఎఐవైఎఫ్ పతాకాన్ని ధర్మేంద్ర ఎగురవేశారు. అనంతరం తీవ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమాధికారాన్ని కాపాడుకుందామని




ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ దేశ భవిష్యత్ తీర్చిదిద్దడంలో యువతదే ప్రధాన పాత్ర అని, ఆలాంటి యువతకు విద్య, వైద్య, ఉపాధి హక్కులను కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఎఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మధు, శివకుమార్, ఉపాధ్యక్షుడు మాజీద్ అలీ ఖాన్, సభ్యులు కళ్యాణ్, భరత్, సిపిఐ నాయకులు చెట్టుకింది శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నిర్భయ నాయకుడు అతుల్‌కుమార్

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



న్యూఢిల్లీ : సిపిఐ జాతీయ నాయకుడు కామ్రేడ్ అతుల్ కుమార్ అంజాన్ ఒక అద్భుతమైన వక్త, నిర్భయ నాయకుడు, భారతదేశ రైతుల పక్షాన పోరాడే యోధుడు అని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా శ్లాఘించారు. అతుల్‌కుమార్ అంజాన్ మరణించి శనివారం ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయనను స్మరిస్తూ డి.రాజా 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'కామ్రేడ్ అతుల్ కుమార్ అంజాన్ లేకుండా అప్పుడే ఒక సంవత్సరం గడిచిపోయింది. ఆయన ఒక అద్భుతమైన వక్త, నిర్భయ నాయకుడు, భారత దేశ రైతుల పక్షాన పోరాడే యోధుడు. ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడిగా, అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శిగా ఆయన ప్రయాణం అనేక సవాళ్లు, విజయాలతో కూడుకున్నవి'' అని రాజా అన్నారు. ''స్వామినాథన్ కమిషన్‌లో ఆయన ఒక్కరే రైతు ప్రతినిధి, అక్కడ ఆయన గొంతు చరిత్రను మలచింది. ఆయన అవిశ్రాంతంగా చేసిన వాదనల ఫలితంగానే నేడు రైతుల డిమాండ్లలో ముఖ్యమైన అంశమైన సి2+50% కనీస మద్దతు ధర సూత్రం వచ్చింది. ఆయన స్థిరమైన నిబద్ధతను, ఆయన శక్తివంతమైన మాటలను, న్యాయం, సమానత్వం పట్ల ఆయనకు ఉన్న తిరుగులేని విశ్వాసాన్ని మేము గుర్తు చేసుకుంటున్నాము. రైతుల ఉద్యమాన్ని బలోపేతం చేయడం, కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీని సాధించటం కామ్రేడ్ అతుల్ అంజన్‌కు మనం ఇచ్చే గొప్ప నివాళి అవుతుంద'ని పేర్కొన్నారు.

# విదేశీ పోలీసుల మాదిరిగా.. మిత్రులుగా భావించే స్థాయిలో పని చేయాలి

డిజిపి డాక్టర్ జితేందర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : అమెరికాతో పాటు మరి కొన్ని దేశాల్లోని ప్రజలు పోలీసులను మిత్రులుగా భావిస్తారని ఆ స్థాయిలో ప్రజలకు న్యాయం చేసి వారి అభిమానం పొందాలని తెలంగాణ డిజిపి డాక్టర్ జితేందర్ ఎస్‌హెచ్‌ఒలకు సూచించారు. డిజిపి కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని యూనిట్ల నుంచి వచ్చిన స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఒ)లతో డిజిపి శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిజిపి డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్లకు ప్రజలు వచ్చినప్పుడు వారికి న్యాయం జరిగేలా చూడాలని తద్వారా వారికి మిత్రులుగా మారాలని సూచించారు. అమెరికాతో పాటు ఇతర కొన్ని దేశాల్లోనీ ప్రజలు పోలీసులను మిత్రులుగా పరిగణిస్తారన్నారు. అమెరికాలో ఉన్న తన స్నేహితుడు ఒకరు తనతో ఫోన్లో మాట్లాడుతున్నప్పుడు ఆయన పిల్లలను నియంత్రిస్తూ తాను ఇండియాలో ఉన్న పోలీస్ అంకుల్‌తో మాట్లాడుతున్నానని భయపెట్టే ప్రయత్నం చేశాడు అన్నారు. కానీ అమెరికాలో పెరుగుతున్న ఆయన పిల్ల వాడు పోలీస్ అంటే తన మిత్రుడు అని తనకు భయమేమీ లేదని అనడంతో అక్కడ పరిస్థితి ఆసక్తి కలిగించిందన్నారు. అమెరికాలోని ప్రజలు పోలీసులను మిత్రులుగా భావిస్తారని తెలిసిందన్నారు. ప్రజలకు న్యాయం చేసినప్పుడు పోలీస్ అధికారులు మంచి పేరు తెచ్చుకోవడంతోపాటు ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని అది సర్వీస్‌లో ఎప్పటికీ గుర్తుంటుందని అభిప్రాయపడ్డారు. ఏదో కారణంతో, పోలీస్ అధికారులు పక్షపాతంతో వ్యవహరిస్తే చెడ్డ పేరు కూడా వస్తుందని, తమకు న్యాయం చేయలేదని ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారన్నారు. అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్ పోటీలకు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు తమ తమ ప్రాంతాలలో పకడ్బందీగా ఏర్పా ట్లు చేయాలని ఆదేశించారు. సాధించింది కొంత మాత్రమేనని కృషి చేయాల్సింది ఎంతో ఉందని గుర్తుపెట్టుకోవాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ర్యాంకులో కింది స్థాయికి పడిపోతామని వివరించారు. శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ.... ప్రస్తుతం రాష్ట్రంలో మిస్ వరల్డ్ పోటీల కార్యక్రమాలకు భద్రత కల్పించడం ప్రధానమని అన్నారు. కొన్ని మహిళా సంస్థలు ఈ పోటీలను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటనలు ఇస్తున్నాయని వాటిని గమనించి కంటెస్టెంట్లకు భద్రత కల్పించాలని సూచించారు. అదేవిధంగా, మరొక మాసంలో వ్యవసాయ పనులు ప్రారంభం కానుండడంతో నకిలీ విత్తనాలు, పురుగు మందులు పుట్టుకొస్తాయని అప్రమత్తతతో ఉండాలన్నారు. శాంతి భద్రతల ఏఐజి రమణ కుమార్, డివిస్పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యలో
# సంస్కరణలు అనివార్యం



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ సమాజంలో మారుతున్న పరిస్థితులకనుగుణంగా నాణ్యమైన విద్యాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాల విద్యలో పలు సంస్కరణలు అనివార్యమని ఎస్‌టియు టియస్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎం.పర్వత్‌రెడ్డి, జి.సదానందం గౌడ్ అన్నారు. 'పాఠశాల విద్యలో 'నమోదు, నాణ్యత, నవ్యత' పేరుతో ఎస్‌టియు టిఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి, క్షేత్రస్థాయి ఉపాధ్యాయుల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన 'సంస్కరణలు, ప్రతిపాదనల సంపుటి'ని ఎస్‌టియు ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావుకు శనివారం అందజేసింది. ఈ కార్యక్రమంలో పర్వత రెడ్డి సదానందం గౌడ్‌తో పాటు ప్రతినిధులు ఎల్.ఎం ప్రసాద్, దాసరి శ్రీధర్, పోల్‌రెడ్డి, ఇఫ్తేకారుద్దీన్, రామ సుబ్బారావు, సాబేర్ ఆలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా సిఎస్‌గా బాధ్యతలను చేపట్టిన రామకృష్ణారావుకు వారు పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎం.పర్వత్‌రెడ్డి, జి.సదానందం గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సబ్జెక్టు నిపుణులు, మండల, జిల్లా, రాష్ట్ర ప్రధాన బాధ్యులతో పలుసార్లు వర్క్‌షాప్‌లు నిర్వహించి ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు. విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి ప్రభుత్వానికి సమర్పించిన రిపోర్టును దృష్టిలో పెట్టుకొని, వాటిలో సాధ్యాసాధ్యాలను లోతుగా చర్చించి, ఈ ప్రతిపాదనలను రూపొందించినట్లు వారు తెలిపారు. ప్రీ ప్రైమరీ, ఉన్నత విద్య వరకు మెరుగైన సౌకర్యాల కల్పన వంటి మెజారిటీ అంశాల్లో సంఘం పక్షాన ఏకీభవిస్తున్నామని, సబ్జెక్టుల వారీగా సిలబస్, పరీక్షలు, ఎన్‌రోల్‌మెంట్, రవాణా సౌకర్యం, పాఠశాలల నిర్వహణ తదితర అంశాలు, క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు, పరిష్కార మార్గాలను లోతుగా అధ్యయనం చేసి నివేదిక సమర్పించామని వారు సిఎస్‌కు వివరించారు. తరగతి గదిలో బోధనాభ్యసన ప్రక్రియ మరింత బలోపేతానికి తమ నివేదికలోని అంశాలు ఎంతో ఉపయోగపడతాయని వారు తెలిపారు.



## కుల గణన నిర్ణయం స్వాగతిస్తున్నాం


సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

తిరుపతి: కులగణనపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సీపీఐ స్వాగతిస్తున్నట్లు సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ స్పష్టం చేశారు. తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడ సిపిఐ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రకరకాల పద్ధతిలో పెండింగ్‌లో ఉన్న కులగణన అంశాన్ని ఇప్పటికైనా కేంద్రం దృష్టి సారించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ విషయంగా ప్రజా సంఘాలు, బీసీ నేతలు, రాజకీయపరమైన ఒత్తిళ్లు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం కులగణనకు అంగీకరించడం శుభపరిణామం అని అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై సోషల్ మీడియా కేంద్రంగా పలు రకాల అపోహలు, అనుమానాలు, విమర్శలు గుప్పిస్తున్నారని, అయితే విషయంగా కొంత వేచి చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగానైనా, లోపాలున్నా ఆ విషయంగా పోరాటాలు చేద్దామని అప్పటి వరకు అసంబద్ధమైన సందేహాలను లేవనెత్తడం సరికాదన్నారు. కుల గణన అంశాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించి, సానుకూలంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

## సిపిఐ రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించిన సుద్దాల అశోక్ తేజ



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రముఖ సినీ గేయ రచయిత, కవి, ప్రజా గాయకులు సుద్దాల అశోక్ తేజ శనివారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుం భవన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అశోక్ తేజ ఇటీవల నూతనంగా ఎన్నికైన ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంను అభినందించారు. అనంతరం సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకటరెడ్డి అశోక్ తేజను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.



ప్రజాపక్షం అసిస్టెంట్ ఎడిటర్ బిట్రగుంట లక్ష్మి నారాయణ కుమారుడు శ్రీహరి విశ్వమిత్ర – ఐశ్వర్య గౌరి వివాహ మహోత్సవం శనివారం హైదరాబాద్‌లో జరిగిన సందర్భంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షుడు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, నవచేతన విజ్ఞాన సమితి కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు, ప్రజాపక్షం ఎడిటర్ మక్కిన సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్‌కుమార్, జిఎం (యాడ్స్) వి.మదన్ తదితరులు

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
చందానగర్ సర్కిల్-21, ఎస్ఎల్‌పి జోన్.
NIT No.03/EE/GHMC/DIV-21/2025-26 టెండర్ నోటీసు ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా) తేది: 02.05.2025
(03) పనుల కొరకు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా నెం. 03/EE/GHMC/DIV-21/2025-26 (ఐటం నెం. 01 నుండి 03 వరకు), తేది: 02.05.2025 ప్రకారం టెండర్లను పిలవడమైనది. **అంచనా విలువ:** రూ.63.80లక్షలు, 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్‌లో బిడ్ల విక్రయం 03.05.2025న మ.12.00గం.ల నుండి అందుబాటులో ఉండును. **బిడ్ల దాఖలుకు ఆఖరి తేది:** 06.05.2025న మ.12.00గం.ల వరకు. బిడ్ల విక్రయం దాఖలు సమయానికి ఒక గంట ముందు ముగుస్తుంది. మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చందానగర్ సర్కిల్-21, ఎస్ఎల్‌పి జోన్ : జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 1284-PP/CL/ADVT/1/2025-26, Date: 03-05-2025

**బహిరంగ కలప వేలం ప్రకటన**
Rc No:1252/2019/S3, తేది: 01.05.2025
ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా ఈక్రింద తెలుపబడిన అటవి జాతుల కలపను ఈ క్రింద తెలుపబడిన తేదిలలో బహిరంగ వేలం నిర్వహించబడును. తేది:12.05.2025, 22.05.2025, 31.05.2025, ఉదయం గం.10:00 లకు ఏటూరునాగారం ప్రభుత్వ కలప డిపో (Govt.Timber Depot) నందు బహిరంగ వేలం నిర్వహిచబడును.
ఈ క్రింది తెలుపబడిన రకముల కలప:
1)యెగిస, 2) నల్లమద్ది, 3) బండారు, 4) బట్టగనం, 5) జిట్రేగి, 6) టేకు, 7) నారేప.
పూర్తివివరములకు అటవి క్షేత్రాధికారి, ఏటూరునాగారం నార్త్ రేంజ్ గారిని (ఫోన్ నంబర్: 9177720923) నందు సంప్రదించగలరు.
నోట్:- ఒక వేల సమయం సరిపోకపోతే మరుసటి రోజుకూడా సేల్స్ నిర్వహించబడును.
సం/- (ఎస్. రమేష్), డివిజనల్ అటవి శాఖ అధికారి వన్యప్రాణి విభాగం ఏటూరునాగారం. జిల్లా ములుగు.
DIPR R.O. No. : 1275-PP/CL/ADVT/1/2025-26, Date: 03-05-2025

# నవ్వండి – నవ్వించండి

ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా

ప్రపంచ నవ్వుల దినోత్సవం ప్రతి సంవత్సరం మే నెల మొదటి ఆదివారం నిర్వహించబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా నవ్వు యోగ ఉద్యమాన్ని ప్రారంభించిన డాక్టర్ మదన్ కటారియా ఈ దినోత్సవం మొదలు పెట్టారు. వ్యక్తులు తమను తాము మార్చుకోవడానికి ప్రపంచాన్ని శాంతియుతంగా సానుకూలంగా మార్చడానికి అవసరమైన శక్తివంతమైన భావోద్వేగం నవ్వు మాత్రమే!

మానవుడు ఎక్కడ పుట్టినా, ఎక్కడ పెరిగిన అర్థమయ్యే భాష నవ్వు మాత్రమే. నవ్వుకు ప్రాంతం, మతం, కులం అనే భేదభావం లేదు. ప్రతి ఒక్కరు భాషతో సంబంధం లేకుండా చిరునవ్వుతో ప్రపంచాన్ని పలకరించే అందమైన ఆయుధం ఒక నవ్వు మాత్రమే. మనుషులు వేర్వేరు భాషలు, ప్రాంతాలకు చెందిన వారైనా అందరికీ అర్థమయ్యే, అందరికీ నచ్చే, సార్వత్రిక భాష నవ్వు మాత్ర మే! ఇది నేర్చుకునే అవసరం లేని భాష. శత్రువునైన ఆకట్టుకునేది ఒక చిరునవ్వు మాత్రమే.



చిరునవ్వు ముఖంమీద పరుచుకోవడం ఒక క్షణమే అయినా దానికి జీవితాన్ని మార్చగల శక్తి ఉంది. ఈ సృష్టిలో ఉచితంగా లభించేది నవ్వు మాత్రమే.. వదనాలకు నవ్వును మించిన ఆభరణం లేనే లేదు. ప్రతి మనిషి తనలో సహజంగా ఉండే నవ్వును ఉపయోగించడం మరిచిపోతున్నాడు. ఉరుకుల పరుగుల జీవితాల్లో నుంచి చిరునవ్వు అనేది అడ్రస్ లేకుండా పోతున్నది.

ఒకప్పుడు కుటుంబ సభ్యులు అంతా ఒక్కచోట చేరినా, నలుగురు స్నేహితులు కలిసినా కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకునేవారు. నేటికాలంలో ఎవరి ఫోన్‌లలో వారే బిజీ లేదా ఇంట్లో అయితే టీవీల్లో బిజీ. గతంలో నాలుగు రోడ్ల కూడళ్ల వద్ద, పాన్ షాప్‌ల వద్ద, టీ షాపుల వద్ద చేరి ముచ్చట్లు పెడుతూ నవ్వుకునేవారు. యువత అయితే క్రికెట్ కబుర్లు , సినిమా కబుర్లు కొరత లేకుండా మాట్లాడుకుంటూ నవ్వుతూ వుండేవారు. కానీ నేడు ఏ ప్రదేశంలో చూసిన కబుర్లు మానేసి సెల్ ఫోన్‌లకు కళ్ళు అప్పగిస్తున్నారు.



రోజులో కొన్నిసార్లు ఒక్కసారి కూడా నవ్వని సందర్భాలు ఉంటున్నాయి. గతంలో రోజుకు కనీసం తక్కువలో తక్కువగా ఇరవై నిమిషాలకు పైగా నవ్వేవారట. ఇప్పుడు కనీసం రెండు నిమిషాలు కూడా నవ్వడం గగనమైపోతున్నది. నవ్వు అనునది చాలా చిన్నదే అయినా పరిచయస్తుల్ని కానీ, ప్రతిరోజు చూసే వాళ్ళను కానీ చూడగానే మనం చిరునవ్వులను చిందించే వాళ్ళం. ప్రస్తుత యాంత్రిక జీవనంలో పరిచయస్తులు కనబడినా చూసీచూడనట్టు వెళ్ళిపోతున్నం.

పైసా ఖర్చు పెట్టకుండా నవ్వుతో ఎన్నో లాభాలను పొందవచ్చు. 'నవ్వు ఆకర్షణీయమైనదో, ఆనందకరమైనదో మాత్రమే కాదు ఆరోగ్యప్రదమైనది'' అని అంటున్నారు శాస్త్రజ్ఞులు. చిరునవ్వులు చిందించే వారిలో బిపి వచ్చే అవకాశాలు తక్కువ. నవ్వు శరీరంలో ఆక్సిజన్ శాతం పెంచుతుంది. నవ్వు జ్ఞాపక శక్తిని పెంచుతుంది. గుండెజబ్బుల నివారణలో కూడా నవ్వు దివ్య ఔషధంగా పనిచేస్తుంది. నవ్వుతూ ఉండే వారిలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతుంది. నవ్వు ఒత్తిడిని తగ్గిస్తుం ది. నవ్వుతూ నవ్విస్తూ ఉండేవారు అసలు వయసు కన్నా తక్కువ వయసు కలవారుగా కనిపిస్తారు. నవ్వు కండరాలను రిలాక్స్ చేసి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. నవ్వు శరీరానికి మనసుకు మంచి వ్యాయామం లాంటిది. ముఖంలో చిరునవ్వుతో ఉండే ఉద్యోగుల వల్ల ఇరవై శాతానికి పైగా ఉత్పాదకత పెరుగుతుందని అధ్యయనాలు తెలుపుతున్నాయి. మార్కెటింగ్ లాంటి విభాగాల్లో సిబ్బంది చిరునవ్వుతో అమ్మకాలు చేస్తే ఏకంగా నలభై శాతానికి పైగా అమ్మకాలు పెరుగుతాయని నిపుణులు తెలుపుతున్నారు. నవ్వుతూ నవ్విస్తూ ఉండేవారు పనులన్నీ సకాలంలో సమర్థవంతంగా చేయగలుగుతారు.

కుటుంబ సభ్యులతో, సమాజంలోని తోటి మనుషులతో నవ్వుతూ మాట్లాడే వారి శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటుందని ప్రకృతి చికిత్స నిపుణులు పేర్కొంటున్నారు. ప్రతి మనిషి తనలో సహజంగా ఉండే నవ్వును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలి. అందంగా అలంకరించుకొనే వారికన్నా ఏ అలంకరణ లేకపోయినా చిరునవ్వులు చిందించే వారే ఎక్కువ ఆకర్షణీయంగా ఉంటారని, వారిని చాలామంది ఇష్టపడతారని పలు అధ్యయనాలు తెలుపుతున్నాయి.

నవ్వు అనునది మన ముఖంలో కనిపించే తొలిభావం. పుట్టిన పసికందులో కూడా మనం నవ్వును చూస్తాం. పసిపిల్లలు ప్రతిదానికి కిలకిలా నవ్వుతారు. పిల్లలు రోజుకు కనీసం వంద సార్లు నవ్వుతారు. నవ్వు అనేది నేడు బాల్యానికి పరిమితం అవుతున్నది. పెరిగినకొద్దీ నవ్వు దూరమైపోతున్నది. అలాంటి నవ్వును దూరం చేసుకోవద్దు. నవ్వే వారు నవ్విం చే వారు ఇద్దరు లాభం పొందేది ఒక నవ్వు లో మాత్రమే. నవ్వుకు జీవితాలను మార్చే శక్తి ఉంది. అంతటి శక్తివంతమైన నవ్వుకు దూరం కాకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. నవ్వించే వారితో రోజుల్లో కాసేపైన గడిపితే ఆ రోజంతా ఆనందంగా గడిచి పోతుందనుటలో ఎలాంటి అతియోశక్తి లేదు. ఆనందంగా ఉండే సమయంలో చక్కటి నిర్ణయాలు తీసుకునే శక్తి ఉంటుంది కాబట్టి రోజులో కొద్ది సమయమైనా కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపితే ఆ ఇంట్లో ఆనందకరమైన వాతావరణం ఏర్పడి చక్కటి కుటుంబ అనుబంధాలు బలపడతాయి. అనుబంధాలను పెంచే నవ్వును దూరం చేసుకోకుండా రోజులో కొద్దిసేపుఅయినా మనసారా 'నవ్వండి నవ్వించండి'.




పుల్లూరు వేణుగోపాల్
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ
పాలకవర్గ సభ్యులు
9701047002


# కులగణన దుమారం

ప్రజాపక్షం
04-05-2025, ఆదివారం

భారతీయ సమాజంలో అత్యధిక మెజారిటీగా ఉన్న షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలతో పాటు అత్యంత వెనుకబడిన తరగతులకు సామాజిక న్యాయం చేకూర్చేందుకు వారి గణాంకాలు అవసరమన్న భావనను వ్యతిరేకిస్తూ వచ్చిన భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలకోసమే కావచ్చు – జనాభా లెక్కలతోపాటు కులగణన చేబట్టాలని నిర్ణయించటాన్ని యావత్ రాజకీయ పార్టీలు, ప్రగతిశీల సముదాయాలు స్వాగతించాయి. ఎవరు ఒద్దన్నా, ఎవరికి ఇష్టమున్నా లేకున్నా దీన్ని సాధించిన ఖ్యాతి కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి దక్కుతుంది. కులగణనను శాస్త్రీయం గా నిర్వహించి, తొలి చర్యగా వెనుకబడిన తరగతులకు విద్య, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల రాజకీయ పదవుల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టంచేసి కేంద్రప్రభుత్వ ఆమోదానికి పంపిన తెలంగాణా కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి నాయకత్వం నిస్సందేహంగా కులగణన విషయంలో దేశానికి రోల్ మోడల్. దీన్నే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఉద్ఘాటించింది. జాతీయ కులగణనకు దాన్ని నమూనాగా తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. అదే సమయంలో కులగణనకు కాలావధిని నిర్ణయించాలని డిమాండ్ చేసింది. ఎందుకంటే 2021లో కోవిడ్ మహమ్మారివల్ల వాయిదాపడిన చట్టబద్ధ దశవర్ష జనాభా లెక్కల సేకరణను ఎప్పుడు చేబడతారో ఇప్పటికి స్పష్టత లేదు. దాంతోపాటు చేబట్టే కులగణన – దాని విశ్లేషణ, రాష్ట్రాలవారీ వర్గీకరణ పూర్తి చేయటానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో సెన్సెస్ నిపుణులు కూడా చెప్పలేరు. అందువల్ల కులగణన నిర్ణయాన్ని రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకుంటూ ఏళ్లూపూళ్లూ గడిపితే ప్రజలు కీలెరిగి వాతపెడతారని గ్రహించాలి. ఈ పర్యాయం జనగణన సమాచారమంతా డిజిటల్‌గా సేకరిస్తారని, రెండు మాసాల్లోనే పూర్తవుతుందని కొన్ని గాలివార్తలు వినిపించటం మినహా అధికారికంగా స్పష్టత ఇచ్చినవారు లేరు. ఈసారి జనగణనతో అనేకం ముడిపడి ఉన్నాయి. జనగణన సేకరణ – జనాభా పొందికల్లో సంభవించిన మార్పుల నేపథ్యంలో లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. దీనిపై ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరాలు చెబుతున్నాయి. డీలిమిటేషన్‌పై పార్లమెంటు విధించిన నిషేధం 2026లో తొలగిపోతుంది. ఈ జనాభా లెక్కల తదుపరి మహిళా రిజర్వేషన్ చట్టం అమలులోకి రావాలి. ఇదంతా పూర్తికావటానికి బహుశా వచ్చే సార్వత్రిక ఎన్నికల పుణ్యకాలం గడిచిపోయినా ఆశ్చర్యం లేదు.

ఇక కులగణన అనే వర్తమానంలోకి వద్దాం. బ్రిటిష్‌రాజ్యం నిర్వహించిన కులగణన(1931) కులవ్యవస్థను పటిష్టీకరించేదిగా ఉన్నదన్న అభిప్రాయంతో స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సహా రాజకీయ మేధావులు దాన్ని విమర్శించారు. అంతేగాక 1901 లెక్కల్లో 1646 కులాలు నమోదుకాగా, 1931కి అవి 4147కు పెరిగాయి. మన జాతీయోద్యమ నాయకుల ఒత్తిడితో 1941 జనాభా లెక్కల్లో బ్రిటీష్ ప్రభుత్వం కులగణనను మినహాయించింది. 1951 సెన్సెస్‌లో నెహ్రూ ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి జనాభా లెక్కలను మాత్రమే అనుమతించింది. 1961 నాటికి ఒబిసిలు కోరితే వారి జనాభా లెక్కలు తీసేందుకు అనుమతించింది. అదొక జాతీయ సర్వే తప్ప చట్టబద్ధ కులగణన కాదు. 1990లో మండల్ కమిషన్ సిఫారసుల అమలుతో ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్‌లు వచ్చాయి. సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితాన్ని ఆ నివేదిక ప్రభావితం చేసింది. కుల జనగణన డిమాండ్‌ను, కేంద్రం ముందుకు రానందున బిహార్‌లో మహాగట్బంధన్ (నితీశ్) ప్రభుత్వం, కర్నాటక, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాలు కులగణన నిర్వహించటాన్ని మండల్ కమిషన్ నివేదికకు కొనసాగింపుగానే చూడాలి. ఆ నివేదికలోని రిజర్వేషన్‌ల ను అమలు జరుపుతున్నారుగాని, సామాజిక న్యాయంకోసం ఉద్దేశించిన అనేకానేక చర్యల చిట్టా విప్పలేదు.

కేంద్రప్రభుత్వ తాజా నిర్ణయం తర్వాత దాని ఖ్యాతిని దక్కించుకునే విషయమై ముఖ్యంగా బిజెపి, కాంగ్రెస్ మధ్య వాదోపవాదాలు జరుగుతున్నాయి. స్వాతంత్ర్యం అనంతరం అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో కులవ్యవస్థను పటిష్టం చేసే కులగణనను జనగణనలో చేర్చలేదు. అప్పటి నుంచి అది కొనసాగుతోంది. ఆనాటి నిర్ణయాల్లో, అంతకుముందు జాతీయోద్యమంలో ఏ పాత్ర లేని జనసంఘ్ వారసురాలైన బిజెపి నేటి హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ గతంలో కులగణనను వ్యతిరేకించిందన్నారు. మొన్నటిదాకా తామెందుకు వ్యతిరేకించారో మాత్రం చెప్పలేదు. తెలంగాణ కులగణనలో ముస్లిం బిసిలను చేర్చినందున దాన్ని వ్యతిరేకిస్తున్నామని, ముస్లిం కేటగిరీని తొలగిస్తే చట్టానికి కేంద్రం ఆమోదం తెస్తామని ఇంతకుముందు అడ్డగోలు వాదన చేశారు బిజెపి తెలంగాణ కేంద్రమంత్రులు. ఇప్పుడేమో కులగణనను ఆమోదించాక, తెలంగాణ రోల్ మోడల్ అనే కాంగ్రెస్ క్లెయింలు కర్ణకఠోరంగా ఉన్నందున కావచ్చు – అది జనగణన కాదు, సర్వే, తప్పుల తడక అని ఆరోపిస్తున్నాడు కేంద్ర మంత్రి, తెలంగాణ బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి. జాతీయ గణనలో ముస్లిం పేదలను కూడా చేర్చుతారని వార్తలొస్తున్నాయి. అదే నిజమైతే వీళ్లెలా మింగుతారో, అప్పుడేమి తర్కవాదన చేస్తారో ఆసక్తిదాయకం.

కులగణనను సాధించుకున్నది భారత ప్రజలు. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి మాడు పగిలింది కాబట్టి భవిష్యత్‌కోసం సానుకూల చర్యగా ఈ నిర్ణయం చేశారని చెప్పవచ్చు. అయితే ఎవరు కోరినా, ఒత్తిడి తెచ్చినా ఈ మంచి ప్రయత్నాన్ని అందరూ స్వాగతించాలి. అయితే ఈ సువిశాల దేశంలో కులాలు, వాటి స్థితిగతులు అన్ని రాష్ట్రాల్లో ఏకరీతిన లేవు. రాష్ట్రం రాష్ట్రానికీ కులాల్లో మార్పు ఉంది. కులవ్యవస్థ హిందువుల్లోనే కాదు ఇతర మత గ్రూపుల్లో కూడా ఉంది. ఎందుకంటే హిందువులు ఏ మతంలోకి మారినా వారి వెంట తమ కులాలను తీసుకెళ్లారు. అందువల్లనే దళితులు, ఆదివాసీలు, ఒబిసిలు తమ మతంతో నిమిత్తం లేకుండా రిజర్వేషన్‌లు కోరుతున్నారు. క్రైస్తవుల్లో 300 రికార్డు అయిన కులాలు, ముస్లింల్లో 500 కులాలు ఉన్నాయి. అందువల్ల మతాలకు అతీతంగా, రాజకీయ జోక్యం లేకుండా పేదలందరికీ న్యాయం జరిగేలా ఈ కులగణన ప్రక్రియను చాకచక్యంగా నెరవేర్చాలి.

# ట్రంప్ వాణిజ్య యుద్ధం : నేటి సామ్రాజ్యవాదం




డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి


వ్లాదిమిర్ ఇల్యీచ్ లెనిన్ 1917 అక్టోబర్ విప్లవానికి అద్భుతమైన వ్యూహకర్తనే కాకుండా, 20వ శతాబ్దపు అత్యుత్తమ మార్క్సిస్ట్ సిద్ధాంతకర్తలలో ఒకరు. ఆయన దోహదాలు విప్లవాత్మక ఆలోచన ఆయుధాలను శక్తిమంతం చేయటంతో పాటు, వాటి పదును పెంచడంలో గణనీయమైన పాత్ర వహించాయి. పెట్టుబడిదారీ విధానంపై విమర్శకు మార్క్స్, ఏంగెల్స్ పునాది వేయగా, గుత్తాధిపత్యం, ద్రవ్యపెట్టుబడి శకంగా పెట్టుబడిదారీ విధానం రూపాంతరాలు చెందడాన్ని లెనిన్ ఆకళింపు చేసుకున్నారు. ఆయన 'సామ్రాజ్యవాదం : పెట్టుబడిదారీ విధాన అత్యున్నత దశ' (1916) అనే ప్రభావశీల రచన చేశారు. భూస్వామ్య విధానంతో పోల్చినప్పుడు పెట్టుబడిదారీ విధానం ఏ విధంగా తన అభ్యుదయ స్వభావాన్ని కోల్పోయి, అనివార్యంగా సామ్రాజ్యవాదంగా రూపాంతరం చెందిందీ, ద్రవ్య పెట్టుబడి ప్రపంచ ఆధిపత్యం, మార్కెట్‌ల కోసం పోటీ, పెట్టుబడి ఎగుమతి, హింసాత్మక విభజన, ప్రపంచ పునర్విభజనగా ఏ విధంగా మార్పులకు లోనవుతుందనే విషయాలపై లెనిన్ అందులో లోతైన, భౌతిక విశ్లేషణ అందించారు. "సామ్రాజ్యవాదమనేది పెట్టుబడిదారీ విధానంలో గుత్తాధిపత్యం, ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం స్థిరంగా అభివృద్ధి చెందే దశ; అందులో పెట్టుబడి ఎగుమతికి స్పష్టమైన ప్రాధాన్యత దక్కుతుంది'' అని ఆయన విడమరిచి చెబుతూ, 21వ శతాబ్దపు ఉధృత వాణిజ్య యుద్ధాలు సహా ఆధునిక అంతర్–సామ్రాజ్యవాద సంఘర్షణలను అర్థం చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం సామ్రాజ్యవాద తర్కం ఎంత మొరటుగా, దురహంకార పద్ధతిలో పనిచేస్తుందో ఒక ఉదాహరణ. 'మేక్ అమెరికా గ్రేట్ అగెయిన్ (అమెరికాను తిరిగి గొప్పగా మార్చుదాం)' అనే పేరుతో ట్రంప్ ఆచరిస్తున్న దుందుడుకు జాతీయవాద ఆర్థిక విధానాలు పెట్టుబడిదారీ విధానం నుండి తెగతెంపులకుగాక దాన్ని మరింత ఉధృతం చేయటాన్ని ప్రతిబింబిస్తున్నది. ఆయన ప్రయోగిస్తున్న సుంకాలు, బెదిరింపులు, ఏకపక్ష ఆర్థిక నిర్బంధాలు, ఆయన చెబుతున్నట్లుగా అమెరికా శ్రామికులను రక్షించేవి కావు. అవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా పెట్టుబడి, కార్పొరేట్ గుత్తాధిపత్యాలను క్షీణత నుంచి పరిరక్షించేవి. జనరంజక వాక్పటిమ ముసుగులో తీసుకుంటున్న ఈ చర్యలు అంతర్జాతీయ పోటీలో కోల్పోతున్న సర్వాధికారాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు యత్నిస్తున్న పాలక వర్గ ప్రయోజనాల కోసం తీసుకొంటున్నవే.

ట్రంప్ ఆరంభించిన సుంకాల యుద్ధం, దాని ఆర్థిక అసంబద్ధతలోనే కాకుండా, ప్రత్యేకించి దాని దుస్సాహసం, మిలిటరీ స్వభావం రీత్యా ప్రమాదకరమైనది. ట్రంప్, ఇతరులు ఆరంభించిన వాణిజ్య యుద్ధం ఆర్థిక వ్యవస్థల పాలిట విపత్తుగా మారి, కరెన్సీ యుద్ధం ఫలితంగా 2008లో తలెత్తిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం కంటే భారీ పరిమాణంలో ఉండబోతుంది. బహిరంగంగా బహుళ పక్ష ఒప్పందాల తిరస్కరణ, ఆంక్షల బెదిరింపులు, డాలర్ ఆయుధీకరణకు, భౌగోళిక రాజకీయ బెదిరింపులకు వాణిజ్య విధానం పరికరంగా మారింది. లెనిన్ అభివర్ణించినట్లుగా "యుద్ధాలు, విప్లవాల శకం" పరిస్థితులకు ప్రపంచాన్ని ట్రంప్ వేగంగా నెట్టి వేస్తున్నాడు. అంతర్జాతీయ సంబంధాల విషయంలో సైనికీకరణ, జాత్యహంకారం, దురహంకార పూరిత పద్ధతులతో కూడిన ట్రంప్ విధానాలు సామ్రాజ్యవాద విశేషాధికారాన్ని పెత్తందారితనంతో పట్టుకువేలాడేందుకు నిస్పృహతో చేస్తున్న ప్రయత్నాలను సూచిస్తున్నాయి.

అంతకుమించి, ట్రంప్ ఆర్థిక జాతీయవాదం విదేశీయుల పట్ల తీవ్ర విముఖత, జాత్యాహంకారంతో కూడుకున్నది. పన్ను విరామాలు, నియంత్రణల తొలగింపుల ద్వారా పెట్టుబడికి అదుపాజ్ఞలు లేని చలనాన్ని కల్పిస్తూ, ప్రజా సంచారాన్ని – ముఖ్యంగా కార్మికు లు, వలసదారులను హింసాయుతంగా అడ్డుకుంటున్నారు. వలసల నిషేధ ం, సరిహద్దుల్లో గోడలు, నిర్బంధ శిబిరాలు, జాత్యాహంకార నిఘా అమలుతో అమెరికన్ల ఉద్యోగాలను రక్షిస్తున్నామనే పేరుతో సమర్థించుకుంటున్నారు. కార్పొరేషన్‌లలో ఔట్ సోర్సింగ్ ఉపాధి, యూనియన్‌లను విస్మరించడం వంటి చర్యల మధ్యే ఇది కొనసాగుతుంది. సామ్రాజ్యవాదం నిజ స్వరూపంలో పెట్టుబడి స్వేచ్ఛా చలనం, బలవంతంగా కార్మిక గమనాన్ని నిరోధించటం అనే వైరుధ్యాల మధ్య దోపిడికి వీలుగా ఇష్టానుసారం కార్మికుల కుదింపును అనుమతిస్తూ, కార్మికవర్గ విభజనకు తీవ్ర జాతీయవాదం అనే విషాన్ని ప్రయోగిస్తున్నారు.

ఇవి విధానాలు దారితప్పడం కాదని, క్షీణిస్తున్న ప్రపంచ వ్యవస్థకు వ్యక్తీకరణ అని అర్థం చేసుకునేందుకు లెనిన్ విశ్లేషణ మనకు ఉపయోగపడుతుంది. గుత్త పెట్టుబడిదారీ విధానంలో వైరుధ్యాలకు ఆ వ్యవస్థ పరిధిలో పరిష్కారాలు లభించవు. అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచబ్యాంకు వంటి బ్రెట్టన్‌ఉడ్స్ సంస్థలు ఏర్పడినప్పటి నుంచి, అవి బలవంతంగా ఒత్తిడి చేయడం ద్వారా ప్రత్యేకించి దక్షిణ ప్రపంచ దేశాలు సంపద కేంద్రీకరణ విధానాలను అనుసరించేలా చేస్తున్నాయి. అగ్రదేశాల మధ్య అనారోగ్య పోటీ అనివార్యంగా ఘర్షణలకు దారితీస్తుంది. సామ్రాజ్యవాద దేశాల కార్మిక వర్గం, అణిచివేతకు గురవుతున్న దేశాల కార్మిక వర్గానికి వ్యతిరేకంగా మారుతుంది. సంపద పేరుతో దోపిడీకి పాల్పడుతున్నట్లుగానే శాంతి పేరుతో యుద్ధానికి సన్నద్ధం చేస్తారు. లెనిన్ రాసినట్లుగా "పెట్టుబడిదారీ విధానం ఎంత అభివృద్ధి చెందితే, కార్మికవర్గం అంతే బలంగా ఐక్య సామ్రాజ్యవాద బూర్జువాజీ కాడిని కింద పడేస్తుంది.''

అలాంటప్పుడు ఎలా ముందడుగు పడాలి? ఇలాంటి విధ్వంసకర, జాత్యాహంకార, సైనిక విధానాల సంకెళ్ళ నుండి మనం ఎలా తప్పించుకోవాలి? దీనికి జవాబు మార్క్సిజం– లెనినిజంలోనే ఉంది. కార్మిక వర్గ అంతర్జాతీయతవాదాన్ని పునర్వ్యవస్థీకరించుకొని, బలోపేతం చేసుకొని, సామ్రాజ్యవాదం నిజ స్వభావం ముసుగు తొలగించాలి. సొంత ఆర్థిక వ్యవస్థ రక్షణవాదం, ప్రజారంజక వాగ్దానాలను మనం తిరస్కరించాలి. బదులుగా సోషలిజం కోసం పోరాటాలను ముందుకు తీసుకెళ్ళాలి. కార్మికవర్గం తమ విముక్తి ఐక్యమత్యంలోనే ఉందని, యుద్ధం, వెలివేతలలో లేదని, సంఘీభావం, ఉమ్మడి పోరాటాల ద్వారానే అది సాధ్యమని గుర్తించాలి.

విప్లవ సాధకులు నేడు మరింత ధైర్యంగా లెనిన్ అంతర్జాతీయవాదాన్ని పునురుద్ఘాటించాలి. ఆయన ప్రకటించినట్లుగా "వలసవాద, ఆర్థిక బానిసత్వాన్ని నిష్కర్షగా బహిర్గతం చేయటం, కార్మిక సమూహాల్లో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఏహ్యతను ప్రేరేపిస్తూ, దానికి వ్యతిరేకంగా పోరాటానికి వారిని దృఢసంకల్ప చిత్తులను చేయనిదే విజయంపై ఆశ ఉండదు.'' దాని అర్థం ఆర్థిక బెదిరింపులు, జాత్యాహంకార రూపాలన్నిటినీ వ్యతిరేకించటం, ఐక్యతను నిర్మించటం, కార్మికునికి వ్యతిరేకంగా కార్మికుణ్ణి ఎదురు నిలబెట్టే సైద్ధాంతిక ఆయుధాలను ధ్వంసం చేయటం.

ట్రంప్ వాణిజ్య యుద్ధం అమెరికా కార్మికవర్గాన్ని ఏమాత్రం రక్షించకపోగా సామ్రాజ్యవాద అంతర్జాతీయ క్షీణతను, న్యాయమైన లేదా శాంతియుత ప్రపంచ వ్యవస్థను అందించలేని దాని అసమర్థతను బట్టబయలు చేస్తుంది. అసమానతలను, సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని పెంపొందించిన సంప్రదాయ నయా సరళీకరణవాదం దిశగా తిరిగి వెళ్ళడం ప్రత్యామ్నాయం కాబోదు; సోషలిజం దిశగా సంఘటిత ప్రయత్నమే ప్రత్యామ్నాయం. దాని మూలాలు మార్క్స్, లెనిన్, వారు స్ఫూర్తినిచ్చిన విప్లవ ఉద్యమాల వారసత్వంలో ఉన్నాయి. అప్పుడే మనం దోపిడీ, విభజన ప్రపంచం నుంచి సమానత్వం, సహకారంతో కూడిన ప్రపంచంలోకి వెళ్లగలం. ఆ ప్రపంచంలో శాంతి అనేది యుద్ధాల మధ్య బలహీనమైన విరామంగా ఉండదు; పెట్టుబడిదారీ విధానం ఆవల నిర్మితమయ్యే ప్రపంచంలో మన్నికగల ఫలితంగా ఉంటుంది.

# జాతీయ యవనికపై మరోసారి తెలంగాణ

భారతదేశ జాతీయ రాజకీయ యవనికపై మరోసారి తెలంగాణ రాష్ట్రం, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్లు చర్చనీయాంశంగా మారాయి. 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా 'అబ్ కీ బార్, చార్ సౌ పార్' అంటూ బిజెపి వేగంగా ప్రచారరంగంలో ఏకపక్షంగా దూసుకుపోతున్నప్పుడు మొదటిసారి ఆ విధంగా జరిగింది. బిజెపికి 400 లోక్‌సభ స్థానాలు వస్తే ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల రిజర్వేషన్‌లను ఎత్తేస్తుందని, రాజ్యాంగాన్ని మార్చేందుకే అన్ని సీట్లు కావాలంటోందని నాటి తెలంగాణ పిసిసి అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి బలమైన కౌంటర్ ప్రచారంతో కాషాయ పార్టీని డిఫెన్స్‌లో పడేశారు. జాతీయ కాంగ్రెస్ కూడా ఆ తరువాత ప్రచారంలో ఇదే మాటను ఎత్తుకుంది. తాజాగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోజరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిపిఎ) జనగణనతో పాటు కులగణన చేపట్టాలని నిర్ణయంతో రెండవసారి తెలంగాణ, రేవంత్‌రెడ్డిలపై దేశం దృష్టి పడింది. తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే కుల గణన సర్వే చేసి, శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందడమే కాకుండా, అందుకు అనుగుణంగా రిజర్వేషన్‌లకు సంబంధించిన బిల్లులను పకబడ్బందీగా రూపొందించి శాసనసభల్లో ఆమోదింపజేసింది. దీంతో కులగణనలో తెలంగాణ మోడల్‌ను అనుసరించాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి అయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సిడబ్ల్యుసి) శుక్రవారం సమావేశమై భారత జనగణనలో కులగణనకు తెలంగాణ నమూనాను స్వీకరించాలని తీర్మానించడం, అటు తెలంగాణకు, ఇటు సిఎం రేవంత్‌రెడ్డికి క్రెడిట్. అంతకుముందు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఎఐసిసి సమావేశంలో కూడా ఈ విషయంలో తెలంగాణ మన్ననలు పొందింది.

ఇప్పటి వరకు మూడు రాష్ట్రాలలో కులగణన పూర్తయింది. అవి బిహార్,కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలు. నిజానికి కులగణన కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలి. కానీ, రాష్ట్రాలు సామాజిక, ఆర్థిక సర్వే పేరిట శాస్త్రీయంగా కులగణనే చేపట్టవచ్చు. కులగణన జరిగిన మూడు రాష్ట్రాలలో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉండడమో, లేదా అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పుడో కులగణన మొదలైంది. బిహార్‌లో రెండుసార్లు కులగణన చేపట్టాల్సి వచ్చింది. కర్నాటకలో ఆధిపత్య పోరుతో ఇంకా లెక్కలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీనిపై క్యాబినెట్ సమావేశం జరిగినప్పటికీ అసంపూర్ణంగానే ముగిసి, మరోసారి మే 9న సమావేశం కానుంది. ఈ రెండు చోట్ల బలహీనవర్గాల ముఖ్యమంత్రులు ఉన్నారు. తెలంగాణలో ఒసి వర్గానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేను ఒక విధంగా విజయవంతంగా పూర్తి చేయగలిగింది.

తెలంగాణలో కుల సర్వేను ప్రారంభించిన తరువాత అనేక అవరోధాలు ఎదురయ్యాయి. డెడికేటెడ్ కమిషన్ లేనందున చెల్లుబాటు కాదంటూ కొందరు కోర్టును ఆశ్రయించగా, ప్రభుత్వం ఏమాత్రం ఆటంకం ఏర్పడకుండా వెంటనే ఆ పని చేసేసింది. ఎట్టకేలకు సర్వే పూర్తి చేసి, సమాచారాన్ని విడుదల చేయగా, బిసిల జనాభా గతం కంటే తగ్గిందని, అన్ని ఇళ్ళకు సర్వే చేసే వారు వెళ్ళలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. వెంటనే ప్రభుత్వ అప్రమత్తమై బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో బిసి సంఘాలతో చర్చించి సూచనలు, సలహాలను స్వీకరించింది. శాసనసభలో సిఎం రేవంత్ రెడ్డి కుల సర్వే గురించి సవివరంగా చెబుతూ, ముస్లిం బిసి జనాభాను కూడా కలిపి చూపితే గతం కంటే చాలా అధికంగా ఉన్నట్లేనని సమాధానపరిచారు. అలాగే ఇంకా నమోదు చేసుకోని వారికి ఆన్‌లైన్‌ద్వారా, ఫోన్ ద్వారా, సమీప సంబంధిత కార్యాలయాలను సంప్రదించడం ద్వారా సర్వేలో పాల్గొనేందుకు ప్రభుత్వం మరికొంత గడువును ఇస్తున్నట్లు ప్రకటించారు. మొత్తానికి సుమారు 97 శాతం గృహాలు, 3.54 కోట్ల మందిని సర్వే చేసి, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొదటిసారిగా కులాల వారీగా సాధికార సమాచారాన్ని సేకరించడం ద్వారా ఒక ప్రాతిపదిక ఏర్పరచిన ఘనత తెలంగాణ ప్రభుత్వం సాధించింది. అందుకే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మూడింటిలో తెలంగాణ నమూనానే ముందుకు తీసుకువస్తున్నారు.

## జాతీయ ఎజెండా చేసిన రాహుల్‌గాంధీ

నిజానికి కులగణన అంశం ఎప్పటి నుంచో చర్చలో ఉన్నప్పటి నుంచి దానిని జాతీయ స్థాయి ఎజెండాగా బహుళ ప్రచారంలోకి తీసుకువచ్చింది రాహుల్‌గాంధీ అంటే అతిశయోక్తి కాదు. గత లోక్‌సభ సాధారణ ఎన్నికల సందర్భంగా ఈ అంశాన్ని జనంలోకి విస్తృతంగా తీసుకెళ్ళారు. తెలంగాణ గడ్డపై ప్రచారం సందర్భంగా ఆయన పదే పదే ఈ అంశాన్నే లేవనెత్తారు. 'జిస్‌కీ జిత్నీ హిస్సేదారి, ఉస్కీ ఉత్నే భాగీదారి (ఎవరి వాటా ఎంతో, అధికారంలో అంతే వాటా)' అన్న ఆయన నినాదం విశేష ప్రాచుర్యం పొందింది. తాము అధికారంలోకి రాగానే కులగణన చేస్తామని, రిజర్వేషన్‌లపై 50 శాతం పరిమితిని బద్ధలుకొడతామని, రాజ్యాంగంలోని 15(5) అధికరణ ప్రకారం ప్రైవేటు విద్యారంగంలో రిజర్వేషన్ కల్పిస్తామని వాగ్దానం చేశారాయన. ఆ దిశగానే తెలంగాణలో కాంగ్రెస్ అధికారం రాగానే కులగణన సర్వే పూర్తయ్యి, నివేదికపై చట్టసభల ముద్రపడింది.

రాజధాని సందడి
– బొమ్మగాని కిరణ్‌కుమార్

కొన్ని వర్గాలకు చెందిన, కొందరి చేతుల్లోనే అధికారం, సంపద కేంద్రీకృతమైందని, ఆ వివరాలన్నీ బైటపడేందుకు తొలి అడుగే సామాజిక, ఆర్థిక, రాజకీయ కులగణన అని, అది సామాజిక ఎక్స్‌రేలాంటిదని రాహుల్‌గాంధీ పదే పదే చెబుతూ వస్తున్నారు. ఇది నిరూపితమైందనేందుకు ఆయన తెలంగాణ సర్వేనే ఒక ఉదాహరణగా ఉటంకించారు. కులగణనపై కేంద్రం నిర్ణయం వెల్లడించిన రోజు ఢిల్లీ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రాహుల్‌గాంధీ చేసిన కొన్ని వ్యాఖ్యలలో కీలకాంశాలు ఉన్నాయి:– "తెలంగాణలోని కార్పొరేట్ స్ట్రక్చర్‌లో సిఇఒలు, మేనేజమెంట్ టీమ్, సీనియర్ మేనేజ్‌మెంట్, ఓనర్‌షిప్ స్ట్రక్చర్(యాజమాన్య వ్యవస్థ)లో ఒక్క దళితుడు, ఒక్క ఆదివాసీ, ఒక్క బలహీనవర్గానికి చెందిన వారు లేరు. నేను ఒక్క శాతం అనడం లేదు. ఆ వర్గాల నుంచి ఒక్కరు కూడా లేరు. అంటే ఆ స్థానాలలో 90 శాతం ఇండియాకు ప్రాతినిధ్యం లేదు. ఇక గిగ్ వర్కర్‌ల జాబితాలో చూస్తే కేవలం ఒబిసి, దళిత్, ఆదివాసీలే ఉంటారు. దీనిని నేను ఆధునిక బానిసత్వం అంటాను. ఇక్కడ రెండు ప్రవాహాలు ఏర్పడుతున్నాయి. ఒక ప్రవాహంలో కార్మికులు, పేదరికం, నిరుద్యోగం ఉంది. ఇందులో దళిత్, ఆదివాసీలు, వెనుబడినవారే ఎక్కువ. రెండవ ప్రవాహంలో ఉన్న ఇలైట్(ఉన్నతస్థానం వ్యక్తులు) మొత్తం వ్యవస్థను నియంత్రిస్తున్నారు. అందులో పైన అంబానీ, అదానీ కూర్చున్నారు. కుల గణన ఈ పద్ధతులను మార్చేందుకు మొదటి అడుగు'' అని ఆయన సాధికారికంగా చెప్పారు. మొత్తానికి రాహుల్‌గాంధీ ఆలోచనలకు తెలంగాణ రాష్ట్రం ఆచరణ రూపం చూపింది. అందుకే కులగణనకు కేంద్రం నిర్ణయం తీసుకోగానే , ప్రధాన ప్రతిపక్ష పార్టీ పదే పదే తెలంగాణ నమూనాను భారతప్రభుత్వం అనుసరించాలనే సిఫార్సు చేయడంతో దేశం దృష్టి తెలంగాణపై, సిఎం రేవంత్ రెడ్డిపై పడింది.

> కుల గణనపై కేంద్రం నిర్ణయం వెల్లడించిన రోజు ఢిల్లీ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రాహుల్‌గాంధీ చేసిన కొన్ని వ్యాఖ్యలలో కీలకాంశాలు ఉన్నాయి:– "తెలంగాణలోని కార్పొరేట్ స్ట్రక్చర్‌లో సిఇఒలు, మేనేజమెంట్ టీమ్, సీనియర్ మేనేజ్‌మెంట్, ఓనర్‌షిప్ స్ట్రక్చర్ (యాజమాన్య వ్యవస్థ)లో ఒక్క దళితుడు, ఒక్క ఆదివాసీ, ఒక్క బలహీన వర్గానికి చెందిన వారు లేరు. నేను ఒక్క శాతం అనడం లేదు. ఆ వర్గాల నుంచి ఒక్కరు కూడా లేరు. అంటే ఆ స్థానాలలో 90 శాతం ఇండియాకు ప్రాతినిధ్యం లేదు. ఇక గిగ్ వర్కర్‌ల జాబితాలో చూస్తే కేవలం ఒబిసి, దళిత్, ఆదివాసీలే ఉంటారు'' అని ఆయన అన్నారు.

## బిజెపికి ఒక అవకాశం

కారణాలేమైనప్పటికీ, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం కులగణనను చేపట్టాలని తీసుకున్న నిర్ణయం స్వాగతించదగిందే. కులగణన భాగంగా ఉండే దేశవ్యాప్త జనగణనను బహుశా 2026 జనవరి తరువాత చేపట్టవచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. అంటే సుమారు ఏడాది తరువాత జనగణన ప్రారంభమై, ఆ తరువాత వాటి వివరాలు వెల్లడయ్యేందుకు మరో ఏడాదికిపైగా పట్టొచ్చు. అంటే కులగణన వివరాలు వెల్లడయ్యేందుకు దగ్గర దగ్గర రెండు, రెండున్నర సంవత్సరాలు పట్టొచ్చేమో! తెలంగాణ కులగణన సర్వేలో బిసిల శాతం 56.33 శాతంగా తేలింది. బిసి రిజర్వేషన్‌ల బిల్లుల్లో రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు. పైగా ఆ బిల్లులు శాసనసభలో అన్ని పక్షాల సమ్మతంతోనే ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. రేపు జనగణనలో కులగణన వివరాలు వెల్లడైనప్పుడు తెలంగాణలో బిసి జనాభా ఇంతకంటే తక్కువకాదనేది సర్వాంగీకార సత్యమే. అప్పటిలోగా విద్య, ఉద్యోగం, స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్‌ల పెంపు కోసం తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపి పంపిన రెండు బిల్లుకు కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపినట్లయితే చిత్తశుద్ధి నిరూపించుకున్నట్లవుతుంది.

# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## కేదార్‌నాథ్‌కు పోటెత్తిన భక్తులు..

**రుద్రప్రయాగ్:** జ్యోతిర్లింగ క్షేత్రం కేదార్‌నాథ్ ఆలయానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 30వేల మందికిపైగా మంజునాథుడిని దర్శించుకున్నారు. చార్‌ధామ్ యాత్రలో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు వేద మంత్రోచ్చారణతో కేదార్‌నాథుని ఆలయ తలుపులు తెరచుకున్నాయి. సాయంత్రం 7గంటలవరకు అధికారిక గణాంకాల ప్రకారం 30 వేల మందికిపైగా భక్తులు దర్శించుకున్నారు. ఇందులో 19,196 మంది పురుషులు ఉండగా, 10,597 మంది మహిళలు, 361 మంది ఇతరులు ఉన్నారని అధికారులు వెల్లడించారు. పరమేశ్వరుడి పవిత్ర ఆలయాలైన 12 జ్యోతిర్లింగాల్లో కేదార్‌నాథ్ ఆలయం ఒకటి. చార్‌ధామ్ యాత్రలో కేదార్ నాథ్ దేవాలయం సందర్శన భాగంగా ఉంటుంది. ప్రతి ఏటా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది భక్తులు కేదార్‌నాథ్‌కు చేరుకుని పరమేశ్వరుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అయితే ఏటా శీతాకాలం ప్రారంభం కాగానే ఈ ఆలయాన్ని మూసివేస్తారు. శీతాకాలంలో ఆరునెలల పాటు ఈ ఆలయ తలుపులు మూసే ఉంటాయి. ఆలయం మొత్తం మంచుతో కప్పుకుపోయిఉంటుంది.తిరిగి వేసవిలో ఆలయ తలుపులు తెరుస్తారు. బద్రినాథ్ ఆలయం ఈ నెల 4న తెరచుకోనుంది.

# ఆలయంలో తొక్కిసలాట

## ఆరుగురు మృతి, మరో 70మందికి పైగా భక్తులకు గాయాలు





### గోవాలోని శ్రీ లైరాయ్ దేవాలయంలో ఘటన

**పనాజి :** గోవాలో తీవ్ర విషాదం జరిగింది. ఉత్తర గోవాలోని శిర్గావ్ గ్రామంలో ఉన్న శ్రీ లైరాయ్ దేవి ఆలయంలో శనివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో తొక్కిలాట జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సహా ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరో 70కిపైగా మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. ఘటన పట్ల ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ దర్యాప్తునకు ఆదేశించారు. వార్షిక జాతరకు వచ్చిసిన వేలాది మంది భక్తులు ఆలయానికి వెళ్లే ఇరుకైన దారిలోకి ఒక్కసారిగా రావడంతో తొక్కిసలాట జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ తొక్కిలాటలో ఆరుగురు మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారని, క్షతగాత్రులు రాష్ట్రంలోని పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని డిజిపి అలోక్ కుమార్ పిటిఐకి తెలిపారు. ఈ ఉత్సవానికి కనీసం 30,000 నుండి 40,000 మంది ప్రజలు తరలివచ్చారు. కొందరు ఒక వాలుపై నిలబడి ఉన్నారు. అయితే కొంతమంది వ్యక్తులు వాలుపై పడిపోవడంతో మరికొందరు ఒకరిపై ఒకరు పడిపోయారు అని ఆ అధికారి తెలిపారు. 40 నుండి 50 మంది వాలుపై పడిపోయారని దీంతో అక్కడ తొక్కిసలాట జరిగిందన్నారు. గోవా, మహారాష్ట్ర, కర్ణాటక నుండి వేలాది మంది భక్తులు ఆలయంలో జరిగే వార్షిక ఉత్సవానికి హాజరయ్యారు. ఈ విషాదం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విచారం వ్యక్తం చేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని, స్థానిక పరిపాలన విభాగం బాధితులకు సహాయం చేస్తోందని ప్రధాని ఎక్స్‌లో పోస్టు చేశారు. ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఉత్తర గోవా జిల్లా ఆసుపత్రిలో, తొక్కిసలాట జరిగిన ప్రదేశంలో క్షతగాత్రులను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఘటనపై వివరణాత్మక విచారణకు ఆదేశించానన్నారు. నివేదిక రాగానే బహిరంగంగా ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ఇతర ఆలయ ఉత్సవాల్లో ఇటువంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన అన్నారు. రాష్ట్ర ఆరోగ్య మంత్రి విశ్వజిత్ రాణే మాట్లాడుతూ, దాదాపు 80 మంది గాయపడ్డారని, ప్రస్తుతం గోవా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ (జిఎంసి)లో 13 మంది చికిత్స పొందుతున్నారని, వారిలో ఐదుగురు పరిస్థితి విషమంగా ఉందని, వెంటిలేటర్ సహాయంతో చికిత్స పొందుతున్నారని, మిగిలిన వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అత్యవసర వార్డులో ఉన్నారని చెప్పారు. అసిలో హాస్పిటల్ (మాపుసా), బిచోలిమ్, సంఖలిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సిహెచ్‌సి) మరియు జిఎంసితో సహా ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలలో 75 మంది రోగులకు చికిత్స అందించామని రాణే చెప్పారు. ప్రధానమంత్రి కార్యాలయం పరిస్థితిని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తోందని, కేంద్రం అన్ని సహాయం చేస్తామని హామీ ఇచ్చిందని బిజెపి గోవా యూనిట్ అధ్యక్షుడు దామోదర్ నాయక్ అన్నారు. ఈ సంఘటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ సంతాపం వ్యక్తం చేయగా, అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ (ఎఐటిసి) ప్రభుత్వం తొక్కిసలాటకు బాధ్యత వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. గోవా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌ఛార్జ్ అమర్‌నాథ్ పంజికర్ మాట్లాడుతూ వేడుకల సందర్భంగా మరిన్ని ప్రమాదాలు జరగకుండా తగిన భద్రత, జనసమూహ నిర్వహణ, అత్యవసర ప్రతిస్పందన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. గోవా ఫార్వర్డ్ పార్టీ (జిఎఫ్‌పి) ఈ ఘటనను పోలీసులు, స్థానిక పరిపాలన వైఫల్యంగా అభివర్ణించింది. మృతుల బంధువులకు రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేసింది.

## రిజర్వేషన్ విధానాలు సమగ్ర సమీక్షకు ఉపయోగపడేలా ఉండాలి

### జనగణన డేటాపై ఆర్‌జెడి నేత తేజస్వి ప్రధానికి లేఖ



**పాట్నా :** వచ్చే జనాభా లెక్కల్లోనే కులగణనను చేర్చుతామని కేంద్రం చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్లు రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) నేత తేజస్వీ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఇది మన దేశం సమానత్వం వైపు సాగే ప్రయాణంలో ఒక మార్పును తీసుకొచ్చే క్షణమని అందులో పేర్కొన్నారు. కులగణన కేవలం డేటా కాదని, అనేక మంది ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని రాసుకొచ్చారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈ సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. కులగణన ఎప్పటికీ ముగిసిపోదని.. ఇది సామాజిక న్యాయం వైపు చేసే సుదీర్ఘ ప్రయాణంలో మొదటి అడుగు మాత్రమేనని అభిప్రాయం వ్యక్తంచేశారు. కులగణన నిర్వహించిన అనంతరం ఆ డేటాను వ్యవస్థాగత సంస్కరణలు చేయడానికి ఉపయోగిస్తారా లేదా మునుపటి కమిషన్‌ల నివేదికల మాదిరిగానే ఉంచేస్తారా అని ప్రధానిని ప్రశ్నించారు. జనాభా లెక్కలు, కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వానికి బిహార్ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఎన్నోఏళ్లుగా ప్రతిపక్షాలు చేస్తున్న కులగణన డిమాండ్లను ఎన్‌డిఎ ప్రభుత్వం పట్టించుకోకుండా.. దేశ ప్రజల్లో విభజనలు చేయడం సరైన చర్య కాదని పేర్కొందన్నారు. బిహార్ కుల సర్వే చేపట్టినప్పుడు కూడా పదేపదే దానిని అడ్డుకుందని గుర్తు చేశారు. ఆలస్యంగా అయినా కేంద్రం సరైన నిర్ణయం తీసుకుందని అన్నారు. దీనివల్ల సమాజంలో చాలాకాలంగా అణచివేతకు గురవుతున్న ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. జనాభా గణన డేటా సామాజిక రక్షణ, రిజర్వేషన్ విధానాల సమగ్ర సమీక్షకు ఉపయోగపడేలా ఉండాలని తేజస్వీ అన్నారు. అదేవిధంగా రిజర్వేషన్లపై ఉన్న ఏకపక్ష పరిమితిని కూడా పునఃపరిశీలించాలని కేంద్రాన్ని కోరారు. జనాభా లెక్కల్లోనే దేశంలో కులగణనను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఇటీవల కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. కులగణన అంశం కేంద్రం పరిధిలోకి వస్తున్నప్పటికీ.. కొన్ని రాష్ట్రాలు మాత్రం సర్వేల పేరుతో వాటిని నిర్వహించాయన్నారు. ముఖ్యంగా విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజకీయ కారణాల వల్ల వాటిని చేపట్టారని విమర్శించారు. తదుపరి దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కల ప్రక్రియలో కులగణనను చేర్చి పారదర్శకంగా చేపట్టాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు.

## సూసైడ్ బాండు ఇవ్వండి.. పాక్‌పై యుద్ధానికి వెళ్తా..

### కర్ణాటక మంత్రి బిజె జమీర్ అహ్మద్‌ఖాన్

**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడితో పొరుగుదేశం పాకిస్థాన్‌పై భారతీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దాడికి ప్రతీకారం తీర్చుకోవాలంటూ కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకు చెందిన ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఆత్మాహుతికి బాంబు ఇస్తే పాక్‌పై పోరాటానికి తాను సిద్ధమేనని ఆయన వ్యాఖ్యానించారు. శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కర్ణాటక గృహ నిర్మాణ, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి బిజె జమీర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. పాకిస్థాన్ ఎప్పటికీ భారత్‌కు శత్రుదేశమే అని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తనకు అనుమతిస్తే పాక్‌తో యుద్ధానికి వెళ్లడానికి తాను సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు. 'మేం భారతీయులం, మేం హిందుస్థానీయులం. పాకిస్థాన్ మాతో ఎప్పుడూ సంబంధాలు పెట్టుకోలేదు. పాక్ ఎప్పటికీ భారత్‌కు శత్రుదేశమే. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే.. ఆ దేశంపై యుద్ధాన్ని ప్రారంభించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. ఆత్మాహుతికి నాకొక బాంబు ఇవ్వండి. దాన్ని నా శరీరానికి అమర్చుకుని పాక్‌వెళ్లి వారిపై దాడి చేస్తాను' అని మంత్రి అన్నారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.



## బేషరతుగా బాక్రా నీరు విడుదల చేయండి

### పంజాబ్‌కు హర్యానా అఖిలపక్షం విజ్ఞప్తి

**చండీగఢ్ :** పొరుగు రాష్ట్రానికి బేషరతుగా త్రాగు నీరు విడుదల చేయాలని పంజాబ్ లోని ఆమ్ ఆద్మీపార్టీ ప్రభుత్వానికి హర్యానా అఖిలపక్ష సమావేశం విజ్ఞప్తి చేసింది. హర్యానాలో శనివారంనాడు అఖిలపక్ష సమావేశం జరిగింది. భాక్రా డ్యామ్ నుండి బేషరతుగా నీరు విడుదల చేయాలని హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ అధ్యక్షతన జరిగిన సమావేశం కోరింది. భాక్రా బియాస్ నిర్వహణ బోర్డు మార్గదర్శకత్వాలను పంజాబ్ ప్రభుత్వం పాటించడంలేదనీ, ఆ మేరకు నీరు విడుదల చేయడం లేదనీ, ఈ విధమైన చర్యలు రాజ్యాంగ విరుద్ధం, అమానవీయమైనవనీ, సమాఖ్య రాజ్యాంగవ్యవస్థపై ఇది దాడి చేయడమేననీ అఖిలపక్ష సమావేశం పంజాబ్ ప్రభుత్వానికి తెలియజేసింది. సమావేశానంతరం ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ పాత్రికేయులతో మాట్లాడారు. వివిధ పార్టీ నాయకులు పాల్గొన్న ఈ సమావేశం మాన్ ప్రభుత్వం తక్షణం బేషరతుగా భాక్రా నీరు విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సమావేశం ఒక తీర్మానం ఆమోదించింది. ఏప్రిల్ 23 వ తేదీన, ఏప్రిల్ 30వ తేదీన రెండు సార్లు జరిగిన సమావేశాలలో భాక్రా బియాస్ మేనేజ్‌మెంట్ బోర్డు (బిబిఎంబి) టెక్నికల్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే పంజాబ్ ప్రభుత్వం అమలు చేయాలని తీర్మానం కోరింది. హర్యానా ప్రభుత్వ హక్కులను తాము కాపాడు కుంటామని నాయబ్ సింగ్ సైనీ ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. పొరుగురాష్ట్రంలో ప్రజల ఆవేదనను, రైతుల సమస్యలను అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. ''మేం జగడానికి సిద్ధంగా లేం, మా మార్గం అదికాదు, న్యాయబద్ధఃగా అడుగుతున్నాం, మాకు సహకరించండి, పొరుగు రాష్ట్రం బాధ అర్థం చేసుకోండి'' అని ఆయన కోరారు. నీటిని విడుదల చేయకుండా అనుసరిస్తున్న రాజ్యాంగ విరుద్ధమైన, అన్యాయపూరితమైన, అక్రమ, అసంబదధమైన నిషేధానికి స్వస్తిచెప్పాలని కోరారు.''వారు త్రాగునీటినికి రాకుండా చేశారు. అఖిలపక్షాలన్నీ బలంగా తమ ప్రతిస్పందన తెలియజేశాయి, హర్యానా రాష్ట్ర ప్రయోజనాలను ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా కృషి చేస్తాయి, కేవలం హర్యానాలోని రాజకీయపార్టీలు మాత్రమేకాదు, దేశంలో సమాఖ్య రాజ్యాంగ వ్యవస్థపట్ల విశ్వాసం ఉన్న అన్ని రాష్ట్రాలు సోదరభావంతో ఐక్యంగా నిరసన తెలియజేస్తాయి'' అని నాయబ్ సైనీ అన్నారు.

## మణిపూర్‌లో ప్రధాని శీతకన్ను

### ప్రపంచాన్ని చుట్టివస్తున్న మోదీకి జాతి కలహాలతో రగిలిపోతున్న రాష్ట్రంలో పర్యటించేందుకు తీరిక లేదా!?

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ మండిపాటు



**న్యూఢిల్లీ :**ప్రధాని నరేంద్ర మోడీ మణిపూర్ పట్ల శీతకన్ను వేశారని కాంగ్రెస్ మండిపడింది. 2023 నుండి జాతి కలహాల గుప్పిట్లో ఉన్న రాష్ట్రంలో పరిస్థితిని నిర్వహించడం లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా వైఫల్యం చెందారని ఆరోపించింది. 2022 ఫిబ్రవరిలో బిజెపి భారీ మెజారిటీతో మణిపూర్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం రాష్ట్రంలో మత హింస చెలరేగిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. మణిపూర్‌లో మే 3వ తేదీన జాతి కలహాలు ప్రారంభమయ్యాయని, డబుల్ ఇంజిన్ సర్కార్ చెప్పుకుని మూడు నెలల తరువాత రాష్ట్రంలో రాజ్యాంగ యంత్రాంగం పూర్తిగా విచ్ఛిన్నమైందని సుప్రీంకోర్టు ప్రకటించవలసి వచ్చిందని రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొన్న ముఖ్యమంత్రిని మోడీ ప్రభుత్వం రాజీనామా చేయమని బలవంతం చేయగా, చివరికి ఫిబ్రవరి 13, 2025న రాష్ట్రపతి పాలన విధించిందన్నారు. 'మణిపూర్‌లో వేదన, బాధలు కొనసాగుతున్నాయి. రాజకీయ క్రీడలు జరుగుతున్నాయి. విలువైన సయోధ్య ప్రక్రియ జరగడం లేదు. 60,000 మందికి పైగా అంతర్గతంగా నిర్వాసితులైన వ్యక్తులు తీవ్ర ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లో సహాయ శిబిరాల్లో నివసిస్తున్నారు' అని రమేష్ అన్నారు. ముఖ్యంగా, ప్రధానమంత్రి మణిపూర్‌ను సందర్శించకుండా తప్పించుకుంటూనే ఉన్నారు. రాష్ట్రంలో ఎవరినీ కలవలేదు. ప్రపంచవ్యాప్తంగా పర్యటించారు కానీ సమస్యాత్మక రాష్ట్రాన్ని సందర్శించి అక్కడి ప్రజలను చేరుకోవడానికి సమయం, ఆసక్తి లేదా సున్నితత్వం దొరకలేదు' అని రమేశ్ ఎద్దేవా చేశారు.

## ఇప్పుడైనా గౌతమ్ అదానీ మేనల్లుడిని ప్రాసిక్యూట్ చేస్తారా? నటిస్తారా ?

**న్యూఢిల్లీ :** అంతర్గత డేటాను పంచుకున్నాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న గౌతమ్ అదానీ మేనల్లుడిపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీ ఎక్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) ప్రాసిక్యూట్ చేస్తుందా? లేదా? అని ఆశ్చర్యం వ్యక్తంచేసింది. 24 సెక్యూరిటీ చట్టాలను అదానీ ఉల్లంఘించడంపై సెబీ విచారణను పూర్తి కోసం ప్రజలు ఇప్పటికీ నిరీక్షిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ పేర్కొన్నారు. 'మోదానీ అంశం బయటకు పోవడాన్ని సులభవంగా తిరస్కరణకు గురవుతోంది. పలు అదానీ గ్రూప్‌లలో డైరెక్టర్‌గా ఉన్నటువంటి గౌతమ్ అదానీ మేనల్లుడు ప్రచురించబడని వాటిని తన బావతో పంచుకోవడం ద్వారా ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడ్డాడు. దాని ఫలితంగా రూ.90లక్షల లాభం వచ్చింది' అని జైరామ్ రమేష్ శనివారం 'ఎక్స్'పోస్ట్‌లో వెల్లడించారు. మరోసారి సెబీ ప్రధానమంత్రి అభిమాన సమూహాన్ని చేతితో చెంపపై కొట్టి వదిలేస్తుందా? లేక చట్టాన్ని పూర్తి స్థాయిలో వర్తింపజేసి కేసును విచారణ జరుపుతుందా అని రమేష్ ప్రశ్నించారు. హిండర్‌బర్గ్ వెల్లడి మేరకు విచారణ పూర్తి అయిన తర్వాత సుప్రీంకోర్టు సెబీకి ఆదేశాలు జారీ చేసి 26 నెలలు గడిచాయని ఆయన చెప్పారు. అదే సమయంలో..సెబీకి యుఎస్ సమాన హోదా కలిగిన ది సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ 20202024 మధ్యకాలంలో గౌతమ్ అదానీ, ఆయన ఏడుగురు అసోసియేట్లు సోలార్ పవర్ కాంట్రాక్టును సాధించేందుకు భారతీయ అధికారులకు రూ.2,000కోట్లు లంచాలు ఇచ్చి, దానిపై రూ.16,000 కోట్ల మేరకు లాభాలు ఆర్జించారని జైరామ్ రమేష్ ఆరోపించారు.

# బంద్ పాటించిన మణిపూర్

### జాతి కలహాలకు రెండేళ్లు కావడంతో మార్కెట్లు, స్కూళ్లు, పాఠశాలలు మూసివేత

**ఇంఫాల్/చురుచందన్‌పూర్:** మణిపూర్‌లో జాతి కలహాలకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం వివిధ సంఘాలు ఇచ్చిన బంద్ మైతీ నియంత్రణలో ఉన్న ఇంఫాల్ లోయ, కుకీ ఆధిపత్య కొండ జిల్లాల్లో సాధారణ జీవితాలను ప్రభావితం చేసింది. మణిపూర్ సమగ్రతపై మైతీ గ్రూప్ సమన్వయ కమిటీ లోయ జిల్లాల్లో బంద్‌కు పిలుపునిచ్చింది. అదే విధంగా జోమి స్టూడెంట్స్ ఫెడరేషన్ (జెడ్ఎస్ఎఫ్), కుకీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (కెఎస్ఒ) కొండ జిల్లాల్లో బంద్ నిర్వహించాయి. 2023లో ఇదే రోజున మైతీ, కుకీల మధ్య జాతి ఘర్షణలు చెలరేగాయి. ఫలితంగా 260 మందికి పైగామరణించారు,1,500మంది గాయపడ్డారు. 70,000 మందికి పైగా నిరాశ్రయులయ్యారని అధికారులు తెలిపారు. ఈ కలహాలకు రెండేళ్ల అయిన సందర్భంగా శనివారం బంద్ పాటించారు. మార్కెట్లు మూసివేశారు. ప్రభుత్వ వాహనాలు రోడ్లపైకి రాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ కార్యాలయాలు మూసివేశారు. ఉదయం కొన్ని ప్రైవేట్ వాహనాలు రోడ్లపై కనిపించాయి. పాఠశాలలు,కళాశాలలు,ఇతరసంస్థలు కూడా మూసివేశారు. అవాంఛనీయ కార్యకలాపాలను నివారించడానికి కీలక ప్రదేశాలలో భద్రతా దళాలను కూడా మోహరించినట్లు అధికారులు తెలిపారు. ఇంఫాల్‌లోని ఖుమాన్‌లాంపక్ స్టేడియంలో మణిపూర్ సమగ్రతపై మైతీ గ్రూప్ సమన్వయ కమిటీ 'మణిపూర్ పీపుల్స్ కన్వెన్షన్' నిర్వహించనుంది. సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరింది. హింసలో మరణించిన వారికి నివాళులర్పించడానికి ఇంఫాల్‌లో సాయంత్రంకొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. చురాచంద్‌పూర్, కాంగ్‌పోక్పి జిల్లాల్లోని కొండ జిల్లాల్లోని కుకీ సామాజిక వర్గం ప్రత్యేక భూభాగం కోసం డిమాండ్ చేస్తూ 'విభజన దినోత్సవం' జరుపుకున్నది.



## ఉపరితలం నుండి ఉపరితలానికి.. పాకిస్థాన్ బాలిస్టిక్ క్షిపణుల పరీక్ష సన్నాహాలు 'రెచ్చగొట్టేచర్యే'

### కాల్పుల విరమణ ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నదని మండిపడ్డ భారత్



**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలపై భారత్ తీవ్ర స్థాయిలో మండిపడింది. పెరిగిపోతున్న ఉద్రిక్తతల నడుమ ఉపరితలం నుండి ఉపరితలానికి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడానికి పాకిస్తాన్ ప్రయోగాత్మక పరీక్షల సన్నాహక చర్యలు చేపట్టడం 'రెచ్చగొట్టే నిర్లక్ష్యపు చర్య', 'ప్రమాదాన్ని తీవ్రం' చేసే పరిస్థితిగా భారతదేశం చూస్తోందని శనివారం ఈ విషయం తెలిసిన పలువురు వ్యక్తులు తెలిపారు.ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తాజాగా పాకిస్థాన్‌చే పరీక్షించబడిన క్షిపణి పరీక్షలు 'కఠోరంగా రెచ్చగొట్టడం', భారతదేశంలో 'ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నానికి తక్కువేమీ కాదు' అని వారు చెప్పారు.కశ్మీర్‌లోయలోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు దాడిచేసి 26మంది ప్రజలను అత్యంత కిరాతకంగా కాల్చిచంపిన తర్వాత భారతదేశంపాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు రగుల్కొంటున్నాయి. ఇరుదేశాల సరిహద్దు సంబంధాలతో అనుసంధానమైన ఈ ఉగ్రదాడిలో భాగస్వాములైన నిందితులను కఠినంగా శిక్షిస్తామని భారత్ వాగ్దానం చేసింది. ఇరుదేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించడానికి అమెరికా సహా యురోపియన్ మరికొన్ని ప్రపంచ దేశాలు ఈ ఉగ్రదాడిని ముక్తకంఠంతో ఖండించాయి. 'ఈ వారంలో ఉపరితలం నుండి ఉపరితలానికి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడానికి పాకిస్థాన్ సన్నాహాలు చేస్తోంది' అని ఈ విషయం బాగాతెలిసిన వ్యక్తులు తెలియజేశారు.'ఇది రెచ్చగొట్టే నిర్లక్ష్యపు చర్య' అని, 'భారతదేశానికి వ్యతిరేకంగా ప్రమాద తీవ్రతను వ్యాప్తి చేస్తున్నామని సంకేతాలు ఇవ్వడమే' ఈ చర్యలు చేపట్టడంలోని ప్రధాన ఉద్దేశం' అని ఒక వ్యక్తి చెప్పారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్ లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్‌ఓసి) వద్ద కాల్పుల విరమణ ఒప్పందాన్ని నిరవధికంగా ఉల్లంఘిస్తూనే ఉన్నదని, అరేబియా సముద్రంలో నౌకాదళ విన్యాసాలు, నౌకాదళ హెచ్చరికలు పిచ్చిపిచ్చిగా జారీ చేస్తున్నదని వారు చెప్పారు. అయితే ఉగ్రదాడిలో పాల్గొన్న పాత్రధారులు, సూత్రదారులు, ప్రణాళికలు రచించిన వారిని ఎవ్వరినీ వదలబోమని, కఠినంగా శిక్షించి న్యాయం చేస్తామని భారత్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. మంగళవారం జరిగిన ఉన్నత స్థాయి రక్షణ శాఖ అధికారుల సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ సమర్థవంతంగా, సమయస్ఫూర్తితో 'ఆపరేషన్ నిర్వహించేందుకు పూర్తి స్వేచ్ఛను మీకు ఇస్తున్నాం' అని ప్రధాని అభయం ఇచ్చారని ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి.

## 450 కి.మీ దూరం ప్రయాణించే పాక్ అబ్దాలీ క్షిపణి పరీక్ష విజయవంతం

**ఇస్లామాబాద్ :** భారత్–పాకిస్థాన్ మధ్య రోజు రోజుకూ ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో శనివారంనాడు పాకిస్థాన్ అబ్దాలీ క్షిపణి ప్రయోగం చేసింది. భూతం నుండి భూతంపైకి 450 కి.మీ దూరం ప్రయాణించగల అబ్దాలీ క్షిపణి వ్యవస్థను తాము విజయవంతంగా ప్రయోగించినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. గడచిన పది రోజులుగా పాకిస్థాన్ తన క్షిపణి వ్యవస్థలను పరీక్షించడం ప్రారంభించిది. సైన్యాన్ని అప్రమత్తం చేసింది. గగనతల వ్యవస్థలను రాత్రివేళ కనిపెట్టుకుని ఉండేందుకు నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నది. తమ ఆయుధ వ్యవస్థలు ప్రపచంలోని వివిధ ప్రాంతాలలో ఉన్నాయని, సమయానికి వాటిని రప్పిస్తామని కూడా పాకిస్థాన్ ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రకటన చేసింది. తన సిబ్బందిని యుద్ధానికి సిద్ధం చేయడంలో భాగంగా కీలకమైన సన్నాహాలు చేస్తున్నది. వీటిలోభాగంగా ముఖ్యంగా క్షిపణులను విజయవంతంగా పరీక్షిస్తున్నది. ''ఇండస్ విన్యాసాలు'లో భాగంగా క్షిపణి పరీక్షలు చేస్తున్నట్లు పాకిస్థాన్ సైన్యం ప్రకటించింది. కమాండర్ ఆర్మీ స్ట్రేటజిక్ ఫోర్సస్ కమాండ్ ఈ శిక్షణ ప్రారంభించారు. వ్యూహాత్మక ప్రణాళికకు చెందిన సీనియర్ అధికారులు, పాకిస్థాన్ వ్యూహాత్మకసంస్థకు చెందిన ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు వీటిని పర్యవేక్షిస్తున్నారు. ఆచరణాత్మకంగా దాడులు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్న ఆత్మవిశ్వాసాన్ని వారు ప్రకటించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పురపాలికలలో 'ఎర్లీబర్డ్'కు విశేష స్పందన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎర్లీబర్డ్ (5 శాతం రాయితీ) పథకంపై ఆస్తి పన్ను చెల్లింపుదారుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఏప్రిల్ 2025 మాసంలో భారీగా రికార్డుస్థాయిలో ఆస్తిపన్నువసూళ్లు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎర్లీబర్డ్‌స్కీమ్' అనగా 2025–26 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నును ఏప్రి ల్ 2025 మాసంలో చెల్లించినవారికీ పన్ను మొత్తంపై కల్పించే 5 శాతం రాయితీని ప్రజలు విశేషంగా స్పందించి, స్వచ్ఛందంగా వారి ఆస్తి పన్నులు చెల్లింపులు చేశారని రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు తెలిపారు. అన్ని పురపాలక సంస్థలు, పురపాలక సంఘాలతో పాటు జిహెచ్‌ఎంసిలో భారీగా రికార్డుస్థాయిలో ఆస్తిపన్ను వసూలు చేశారు.

మొత్తం ఆస్తి పన్ను డిమాండ్ : రూ 2264.84 కోట్లు
మొత్తము వసూళ్లు : రూ 400.36 కోట్లు
గత సంవత్సరం వసూళ్లు : రూ 317. కోట్లు (14.80 శాతం )
ప్రస్తుత వసూళ్లశాతం : 17.68 శాతం
గత ఆర్థిక సంవత్సరం వసూళ్ళతో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 82.88 కోట్లుఎక్కువ వసూలు చేశారు.

## ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు :మంత్రి పొన్నం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బంజారాహిల్స్ ఏసిబి కార్యాలయం ముందు 12 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు కబ్జా చేశారు. ఈ విషయాన్ని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, వెంటనే విచారణ జరుపాలని ఆర్‌డిఓ, ఎంఆర్‌ఓను ఆదేశించారు. సర్వే నంబర్ 102/1 హెచ్‌ఎకె /1 లో 12 ఎకరాల ప్రభు త్వ భూమిగా నిర్ధారణ కావడంతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెంటనే ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని, ఆ భూముల్లో అక్రమ కట్టడాలను కూల్చివేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఆర్‌డిఓ, ఎంఆర్‌ఓలు కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి కలెక్టర్ అనుదీప్ దురశెట్టిలతో కలిసి పరిశీలించారు. 12 ఎకరాల ప్రభుత్వ స్థలం చుట్టూ పెన్సింగ్ వేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ భూమి కాపాడిన కలెక్టర్, ఆర్‌డిఓ, ఎంఆర్‌ఓలను మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురైతే అధికారులకు చెప్పాలన్నారు. ఈ భూమిని ప్రజలకు ఉపయోగపడే విధంగా సిఎం దృష్టికి తీసుకువెళ్లి, మంచి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇదే స్ఫూర్తితో ఇతర అధికారులు పని చేయాలని, ప్రభుత్వ స్థలాలను కబ్జాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

## తక్షణమే ఆపరేషన్ కగార్ ఆపాలి



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** తక్షణమే ఆపరేషన్ కగార్ ఆపాలి, బేషరతు చర్చలు ప్రారంభించాలని డిహెచ్ పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. వరంగల్ శివనగర్, తమ్మెర భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ నక్సలిజాన్ని అంతం చేస్తానన్న కేంద్ర ప్రభుత్వం, పేదరికాన్ని ఎందుకు అంతం చేయలేకపోతుందని, మావోయిస్టులతో బేషరతుగా చర్చలు జరిపి, తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2025లో ఇప్పటివరకు మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీలు కలిపి సుమారు 400 మంది ప్రాణాలు కోల్పోయారని, దేశ చట్టాలు, సాయుధ ఘర్షణలకు సంబంధించిన నియమాలను పక్కన పెట్టి, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మావోయిస్టులను భౌతికంగా నిర్మూలించేందుకు సాయుధ బలగాలను వినియోగిస్తోంది. కర్రెగుట్ట కొండలను పారా మిలిటరీ బలగాలతో చుట్టివేయటం, ఆదివాసీల హక్కులను పూర్తిగా పట్టించుకోకపోవటం అభీష్టకరమైంది కాదన్నారు. సిపిఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ తమ శాంతియుత చర్చల సన్నద్ధతను ఇప్పటికే ప్రకటించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇకపోతే, మావోయిస్టులు ఒకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సంఘీ ఎలేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను రవి పాల్గొన్నారు.

## 20న ఇందిరా పార్క్ వద్ద ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల మహాధర్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా తెలిపారు. ఎన్‌హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 20వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ మహాధర్నాలో తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాల పనిచేస్తున్న ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఆల్ క్యాడర్స్ ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ధూప దీప నైవేద్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ధూప దీప నైవేద్య పథకాన్ని తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన దేవాలయాలకు వర్తింపజేస్తారు.ఈ పథకం కింద ఎన్నికయిన ఆలయాలకు నెలకు రూ.4 వేలు ధూప దీప నైవద్యం కోసం, రూ.6 వేలు అర్చకునికి గౌరవ భృతి చెల్లిస్తారు. ఈ పథకం కోసం దరఖాస్తుదారులు పూర్తి చేసిన అప్లికేషన్లను పాత జిల్లా సహాయ కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీ లోగా సమర్పించాలి. దరఖాస్తులను www.endowments.ts. nic.in వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోగలరు.

# దేశ చరిత్రలో సన్నబియ్యం పథకం చరిత్రాత్మక నిర్ణయం

**హైదరాబాద్ జిల్లాలో 2రోజుల్లోనే 30 శాతం సన్న బియ్యం పంపిణీ**

**రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ చరిత్రలో సన్న బియ్యం పథకం ఒక చరిత్రత్మకంగా నిలిచిపోతుందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం, పౌర సరఫరాల శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి , సివిల్ సప్లై కమిషనర్ డి.ఎస్. చౌహన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీలో ఎక్కడ కూడా రాజీపడవద్దు అన్నారు. ప్రభుత్వం బియ్యం పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సివిల్ సప్లై అధికారులందరూ అన్ని కేంద్రాలలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, ఇక్కడ కూడా సమస్యలు ఉత్పన్నం కాకుండా సాఫీగా సాగే విధంగా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సిబ్బంది కొరత ఉన్నందున పోస్టులను భర్తీ చేయటం జరుగుతుందన్నారు. జిల్లాలో 653 రేషన్ షాప్‌లలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం అందాలన్నారు. జిల్లాలోని 14,500 మెట్రిక్ టన్నులకు పైగా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 2 రోజుల్లోనే 30 శాతానికి పైగా సన్నబియాన్ని అందించామన్నారు. హైదరాబాద్ జిల్లాలో సరిపడా ప్రభుత్వ గోదాములను లేకపోవడంతో ప్రభుత్వ స్థలాల్లో గోదాములు ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలని సివిల్ సప్లై అధికారులను మంత్రి ఆదేశించారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టుందని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్ మాట్లాడుతూ సన్న బియ్యం పథకం పేదలకు వరమన్నారు. దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం సంతోషదాయకమన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో 653 రేషన్ షాప్‌లలో 6లక్షల 39 వేల మంది రేషన్ కార్డు హోల్డర్స్ ఉన్నారని, ఇప్పటివరకు 30 శాతం పైగా సన్న బియ్యం పంపిణీ చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్నగోదాములతో పాటు మరి కొన్ని గోదాములు అవసరం ఉన్నదని, ప్రభుత్వ భూములలో గోదాములు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని రేషన్ షాప్‌లలో అధికారులు సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ ముకుంద రెడ్డి, జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ చంద్ర కాంత్, జిల్లా సివిల్ సప్లై అధికారి రమేష్, ఆర్‌డిఓలు రామకృష్ణ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

**ధనవంతుడు, పేద తేడా లేకుండా సన్న బియ్యం..**

ధనవంతుడు పేదవాడు అనే తేడా లేకుండా సన్న బియ్యం తినాలని తెలంగాణ ప్రభుత్వం ఉగాది పండగ నుండి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ ఆదర్శ బస్తీలో శనివారం పౌరసరఫరాల దుకాణం 602లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. అనంతరం మంత్రి నారాయణగూడ గాంధీ కుటీర్ వద్ద సన్న



బియ్యం లబ్ధిదారుని ఇంట్లో స్థానిక ఎంఎల్‌ఏ దానం నాగేందర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి , కార్పొరేటర్లు విజయ రెడ్డి, మహ లక్ష్మి , అధికారులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఎన్నికల కోడ్ వల్ల సన్న బియ్యం పంపిణీ చేయలేక పోయినామని అన్నారు. ఈ నెల 1వ తేదీ నుండి హైదరాబాద్ జిల్లా లోని 653 రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించామన్నారు. సన్న బియ్యం కార్యక్రమంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఈ బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామని, గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వలేదు, రేషన్ కార్డుల్లో మార్పులు చేయలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కుల గణన సర్వే, ప్రజా వాణి దరఖాస్తులు, ఎంఆర్‌ఓ కార్యాలయాల నుండి వచ్చిన దరఖాస్తుల ద్వారా రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ జరుగుతుందన్నారు. బయట సన్న బియ్యం మార్కెట్‌లో 60 రూపాయలకు కిలో బియ్యం ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 500కి గ్యాస్, సన్న వడ్లకు వరికి 500 బోనస్, 65 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని మంత్రి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.

## ధాన్యం పండించడంలో ఉమ్మడి రాష్ట్రంలోని రికార్డును అధిగమించాం

**సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి:** దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని, సన్న బియ్యం పంపిణీతో 84 శాతం నిరుపేదలకు ఆకలి తీరుతోందని, ధాన్యం పండించడంలో ఉమ్మడి రాష్ట్రంలోని రికార్డును అధిగమించామని, రాష్ట్రంలో రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ కొనసాగుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి సాగునీటిపారుదల, పౌర సరఫరాల శాఖలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందన్నారు. భద్రకాళి చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ పనులు ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల క్రమబద్ధీకరణపై సిఎంతో మాట్లాడుతా

**సిఎస్ రామకృష్ణారావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో మాట్లాడుతానని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు అన్నారు. తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధి బృందం శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావును కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. సిఎస్ గా కొత్తగా బాధ్యతలు తీసుకున్న రామకృష్ణరావుకు ఈ సందర్భంగా పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక రంగంలో గత 23 సంవత్సరాల నుండి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని వారందరి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ పై ముఖ్యమంత్రితో మాట్లాడతానని సిఎస్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, చాలా కాలం నుంచి పనిచేస్తున్న ఉద్యోగస్తులకు ప్రమోషన్ కల్పించాలని వాడు కోరినట్లు సబ్ రాజమౌళి తెలిపారు. కలిసిన వారిలో రమేష్, చిత్తరంజన్ మనోజ్ తదితరులు ఉన్నారు.

## ఉపాధి హామీ పనిదినాలు తగ్గిడంచడం శోచనీయం

**'రైతుబీమా' ప్రీమియంను చెల్లించండి: మాజీ మంత్రి హరీశ్‌రావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి మంజూరైనా ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్(నరేగా) పని దినాలను కేంద్ర ప్రభుత్వం సగానికి తగ్గించడం శోచనీయమని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. 202425 ఆర్థిక సంవత్సరంలో 12.22 కోట్ల ఉపాధి హామీ పనిదినాలు మంజూరు చేయగా, ఈ సంవత్సరం కేవలం 6.5 కోట్ల పనిదినాలకే పరిమితం చేశారని మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి 42 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినా, తెలంగాణకు సాధించింది ఏమీ లేదని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్, బిజెపికి చెరో 8 మంది ఎంపిలు ఉన్నప్పటికీ ఎలాంటి ప్రయోజనంలేదని, వారు తెలంగాణకు జరిగే నష్టంపై నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నరేగా పని దినాలు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న నాలుగు వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ ప్రారంభించిన 'రైతుబీమా' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడం దుర్మార్గమన్నారు. ఫిబ్రవరి నెలలోనే చెల్లించాల్సిన రూ.775 కోట్ల ప్రీమియం మూడు నెలలుగా ప్రభుత్వం చెల్లించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, రైతు కుటుంబాలకు శాపంగా మారుతున్నదని, వివిధ కారణాలతో గడిచిన మూడు నెలల్లో సుమారు వందకు పైగా రైతులు చనిపోయినట్లు తెలుస్తోందని, ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో ఆయా కుటుంబాలకు రైతు బీమా సాయం అందకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కుటుంబాలకు ప్రభుత్వమే రూ. 5 లక్షలు చెల్లించాలని, ఎల్‌ఐసికి పెండింగ్‌లో ఉన్న ప్రీమియంను తక్షణమే చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## భారతదేశంలో మొదటి 'గోల్డ్ మెల్టింగ్ ఎటిఎం'




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బంగారు లావాదేవీలలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. భారతదేశంలో మొదటి 'గోల్డ్ మెల్టింగ్ ఎటిఎంను బేగంపేటలో త్వరలో ప్రారంభించబడునుంది. ఈ సందర్భంగా గోల్డ్‌సిక్కా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ ఏస్ వై తరుజ్ మాట్లాడుతూ ఈ ఎటిఎం ద్వారా బంగారాన్ని కొనడం, అమ్మడం, మార్చడం, లీజుకు ఇవ్వడం, డిజిటైజ్ చేయడం చేయవచ్చన్నారు. బంగారు రుణాలు మినహా అన్ని సేవలు ఇది అందిస్తుందని చెప్పారు. ఇందులో మనం ఆభరణాలు కూడా కొనుగోలు చేయవచ్చన్నారు. ఇది పూర్తిగా ఆటోమేటెడ్ టెలర్ మెషిన్ అన్నారు. ఎటువంటి మానవ జోక్యం ఉండదన్నారు. ఇది ప్రపంచంలో మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత గోల్ మెల్టింగ్ ఎటిఎం అన్నారు. ప్రపంచంలో మొదటి 'గోల్ రియల్టైమ్ ఎటి ఎంతో ఎంతో ఆదరణ పొందిందన్నారు. భారతదేశంలోని చాలా రాష్ట్రాలలోనూ, విదేశాలలోనూ ఉన్నాయన్నారు. దుబాయ్, కైరో, రష్యా, టాంజానియా వంటి దేశాలలో అందుబాటులో కలవన్నారు. ఇకపై బంగారం కేవలం ఆభరణంగా కాకుండా, అది ఒక అసెట్‌గా మారుతుందన్నారు. భవిష్యత్తులో ఇది కరెన్సీగా పరిగణించే అవకాశం ఉందన్నారు.

## పంచాయతీ కార్యదర్శులపై 'సర్కార్ నజర్'

**'యాప్' ద్వారా గ్రామ పనుల పర్యవేక్షణ**

**ఉదయం, సాయంత్రమే 'ఉపాధి' పనులు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామాలలోని పలు సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు పాత్రను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షిస్తోంది. పారిశుధ్యనిర్వహణతో పాటు పలు సమస్యలను పరిష్కరించడంతో పాటు రోజూ వారు కేటాయిస్తున్న సమయంపైన ఆరా తీస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 98 శాతం పంచాయతీ కార్యదర్శులు ఉదయం 9 గంటల వరకు విధులకు హాజరవుతున్నట్టు గుర్తించింది. 'పంచాయతీ సెక్రటరీ యాప్' ద్వారా కార్యదర్శులకు నిర్ధేశించిన లక్ష్యాలపై కూడా ఆరా తీస్తోంది. ఎవరెవరు, ఎప్పుడెప్పుడు గ్రామ పంచాయతీలకు చేరుకుంటున్నారు? , ఎలాంటి పనులు చేయిస్తున్నారు?ఎలాంటి వివరాలన్ని పంచాయతీ సెక్రటరీ యాప్‌లో నమోదవుతున్న వివరాలను ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం సేకరిస్తోంది. 'యాప్' ద్వారా మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి డి.ఎస్ లోకేష్ కుమార్, డైరెక్టర్ జి.సృజన ప్రణాళికబద్ధంగా కసరత్తు చేస్తున్నారు. పారిశుద్య పనులు, ఇతర పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటూ ఫోటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. సరిగా పనులు జరగని గ్రామ పంచాయతీలను గుర్తించి సంబంధిత డిఎల్‌పిఒ, డిపిఒలకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. తద్వారా గ్రామ పంచాయతీల్లో సమస్యలు కొలిక్కివస్తున్నాయని అధికార యంత్రాంగం చెబుతున్నది.

**ఉదయం.. సాయంత్రమే 'ఉపాధి పనులు '**

వడగాలుల నేపథ్యంలో మధ్యాహ్న సమయంలో ఉపాధి హామీకూలీలతో పనులు చేయించొద్దని, సాయంత్రం సమయంలో చేయించాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశించింది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ భారిన పడకుండా, వారిని ఎండ నుంచి రక్షించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపింది. ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాలకు సమీపంలో కూలీలు సేదతీరేందుకు వీలుగా ఎండ తగలకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, తాగునీటిని అందుబాటులో ఉంచాలని డిఆర్‌డిఒలకు డైరెక్టర్ సృజన ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం పూట పనులు చేయించ రాదని, ఉదయం, సాయంత్రం 4 తర్వాతే ఉపాధి పనులు చేయించాలని స్పష్టం చేశారు. ప్రతి రోజు 10 లక్షల మంది ఉపాధి కూలీలకు పని కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 9.45 లక్షల మందికి ప్రతిరోజు ఉపాధి లభిస్తోంది. ప్రతి గ్రామ పంచాయతీ(జిపి)లో సగటున 75 మంది కూలీలకు ఉపాధి హామీ పని లభిస్తోంది. ఈ సంఖ్యను 100కి పెంచేలా కూలీలను మోబలైజేషన్ చేయడంతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో విధిగా ఉపాధి హామీ పనులు చేపట్టేలా సంబంధిత డిఆర్‌డిఎలు చర్యలు తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు.

## గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా తెలంగాణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు, సాంకేతికత, సామర్థ్యం కలిగిన వైద్యులు, ఉన్నత నాణ్యతైన చికిత్సలను అందిస్తూ ఇప్పటికే తెలంగాణ అంతర్జాతీయ రోగులను ఆకర్షిస్తోండగా... మిస్ వరల్డ్ పోటీలతో ప్రపంచ వైద్య పర్యాటక పటంలో తెలంగాణ ప్రముఖ కేంద్రంగా మారనుంది. సిఎం రేవంత్ రెడ్డి మార్గదర్శకాల మేరకు 120 దేశాల ప్రతినిధులు హాజరయ్యే.... 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ ఈవెంట్‌లో మెడికల్ టూరిజంను ప్రముఖంగా ప్రమోట్ చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

ఈసిఎం సూచనలతో తెలంగాణలో తక్కువ ఖర్చుతో అందిస్తున్న అత్యాధునిక వైద్య సేవలను, మెడికల్ టూరిజంలో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని తెలియజేసేలా మిస్ వరల్ కాంటెస్టెంట్‌లకు ఈ నెల 16 వ తేదీన హైదరాబాద్‌లోని ఎఐజి హాస్పిటల్‌లో నిర్వహించే మెడికల్ టూరిజం ఈవెంట్ ను ప్రత్యేకంగా అధికారులు నిర్వహిస్తున్నారు.

**మెడికల్ హెల్త్ టూరిస్ట్‌లను ఆకర్షిస్తున్న అంశాలు ఇవే**

తక్కువ ఖర్చుతో సమర్థవంతమైన చికిత్సలు, అత్యంత నైపుణ్యం కలిగిన వైద్యులు, నిపుణులు, కనీస నిరీక్షణ సమయాలు, ఇంగ్లీష్ మాట్లాడే సిబ్బంది, కమ్యూనికేషన్ సౌలభ్యం, ప్రభుత్వ మద్దతు, వైద్య వీసా (ఇవీసా), స్నేహపూర్వక వాతావరణం, కనెక్టివిటీ, రాష్ట్ర ప్రభుత్వ మద్దతు ఫలితంగా అమెరికా, రష్యా, బ్రిటన్, ఆఫ్రికా, మధ్య ప్రాచ్యం నుండి రోగులు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. దీనివల్ల తెలంగాణలో మెడికల్ టూరిజం శరవేగంగా అభివృద్ధి చెందుతుంది.

**రెండు రెట్లు పెరిగిన విదేశీ హెల్త్ టూరిస్టులు**

2014 సంవత్సరంలో 75 వేల 171 మంది విదేశీ విదేశీ హెల్త్ టూరిస్టులు వైద్య సేవలు పొందేందుకు హైదరాబాద్ కి రాగా... 2024 సంవత్సరం వరకూ దశాబ్ద కాలంలో 1 లక్షా 55 వేల 313 మంది విదేశీయులు వచ్చారు. అదే సమయంలో 2024 సంవత్సరంలో 8 కోట్ల 82 లక్షల 39 వేల 675 మంది రోగులు దేశంలోనీ వివిధ రాష్ట్రాల నుంచి వైద్య సేవల కోసం తెలంగాణ కు వచ్చారు. ఇప్పటికే మెడికల్ టూరిజంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉండగా, మిస్ వరల్ ఈవెంట్ నిర్వహణతో మెడికల్ టూరిజంలో తెలంగాణను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది.

## ముజఫర్‌నగర్‌లో 'అత్యవసర కిసాన్ పంచాయత్'

**బికెయు జాతీయ అధ్యక్షుడు నరేశ్ టికాయత్ ప్రకటన**

**ముజఫర్‌నగర్ :** పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా జరిగిన నిరసన ర్యాలీలో ఒకవర్గం ప్రజలు రైతునాయకుడు రాకేశ్ టికాయత్ పాల్గొనడాన్ని వ్యతిరేకించిన తర్వాత భారతీయ కిసాన్ యూనియన్ (బికెయు) శనివారం ముజఫర్‌నగర్‌లో 'అత్యవసర కిసాన్ పంచాయత్‌కి' పిలుపునిచ్చింది. ఈ విషయంలో కేసు నమోదు అయిన తర్వాత ముజఫర్‌నగర్ పోలీసులు ఒక వ్యక్తిని విచారించేందుకు కస్టడీలోకి తీసుకున్నారని అధికారులు చెప్పారు. రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్ డి) ఎమ్మెల్యే రాజ్‌పాల్ బాల్యాన్ కూడా శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై గట్టి చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై చర్చించడానికి ముజఫర్ నగర్‌లోని జిఐసి గ్రౌండ్ వద్ద 'అత్యవసర కిసాన్ పంచాయత్'ను నిర్వహించనున్నట్లు బికెయు జాతీయ అధ్యక్షుడు నరేష్ టికాయత్ ప్రకటించారు. రైతుల ఉద్యమాన్ని బలహీనపరిచేందుకే ఒక రాజకీయ పార్టీ కుట్రపన్నిందని, దీనిలో భాగంగా 'ఆక్రోశ్ ర్యాలీ' వద్ద ఈ ఉదంతం చోటుచేసుకున్నదని ఆయన ఆరోపించారు. శుక్రవారం పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా మితవాద గ్రూపుల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న రాకేష్ టికాయత్‌పై దాడిచేసి, అక్కడ నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. ఆ ఘర్షణలో ఆయన తలపాగా పడిపోయినట్లు సంఘటనకు సంబంధించి చిత్రీకరించిన వీడియోలలో కనిపించింది.'ఈ సంఘటన అప్పటికప్పుడు జరిగింది కాదు. ఇది రాజకీ ఉద్దేశంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం జరిగింది' అని నరేష్ టికాయత్ చెప్పారు. మధ్యాహ్నం ముజఫర్ నగర్, సిసౌలీ పంచాయత్ షెడ్యూల్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలోని అన్ని ప్రాంతాల నుంచి రైతులు అక్కడికి చేరుకున్నారు. రాజకీయ విధ్వంసం కోసం జరిగిన దాడి అని రాకేశ్ టికాయత్ ఆ మోసాన్ని ఖండించాడు. రైతుల గొంతుకను అణిచివేసేందుకు ఒక ప్రత్యేక రాజకీయ పార్టీ చేసిన కుట్ర ఇది. కొంత మంది యువకులను పంపి ఉద్దేశపూర్వకంగా ర్యాలీకి ఆటంకం కలిగించారని ఆయన విలేకరులకు చెప్పారు. తనకు వ్యతిరేకంగా చేసిన నినాదాలు వారు మద్యం మత్తులో చేసినవి అని ఆయన ఆరోపించారు.ఇటీవల బికెయు ఆధ్వర్యంలో కశ్మీర్‌లోయలోని పహల్గామ్ ఉగ్రదాడిలో 26మందిని అత్యంత కిరాతకంగా ఉగ్రవాదులు కాల్చిచంపడాన్ని వ్యతిరేకిస్తూ బికెయు ఆధ్వర్యంలో 'ఒక ట్రాక్టర్ మార్చ్'ను నిర్వహించనున్నట్లు టికాయత్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మార్చ్ తేదీని త్వరలోనే నిర్ణయిస్తామని ఆయన ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉగ్రవాదులపై చర్య తీసుకోవాలని టికాయత్ అభ్యర్థించారు.

## పుడమి పాఠశాలలో ఉన్నత ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల కేంద్రంలోని పుడమి ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉన్నత ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు పుడమి పాఠశాల డైరెక్టరు సంజీవ్, చైర్మేన్ కుమార్‌రెడ్డి అదేశాల మేరకు విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఉస్మాన్, వైస్ ప్రిన్సిపాల్ శోభారాణి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రణవి 600 మార్కులకుగాను 565 మార్కులు సాధించారు. చందనకు 558, యశికకు 548, బృందావని 534 మార్కులు సాధించారు. పదవ తరగతిలో ఉన్నత ఫలితాలు సాధించడానికి కృషి చేసిన విద్యార్థులకు, పాఠశాల ఉపాధ్యాయులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిండ్రులు తదితరులు పాల్గోన్నారు.

## హస్తినాపురం డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** హస్తినాపురం డివిజన్ అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని శనివారం జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్‌ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా హస్తినాపురం కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బానోతు సుజాత నాయక్ వి నతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాత నాయక్ మాట్లాడుతూ డివిజన్‌లో వివిధ కాలనీల అంతర్గత రోడ్ల నిర్మాణాలకు నిధు ల కొరత ఉందని, తక్షణమే నిధులు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ మేరకు కమిషనర్ సానుకులంగా స్పందించినట్లు కార్పొరేటర్ సుజాత నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## శిలాఫలకం ధ్వంసం చేసిన బిజెపి నాయకులను ఆరెస్టు చేయాలి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** ప్రభుత్వం శిలాఫలకం ధ్వసం చేసిన బిజెపి కార్పొరేటర్ లచ్చిరెడ్డి, బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, చంపాపెట్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్ చేయాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా డిమాండ్ చేశారు. శనివారం వనస్థలిపురం పోలీస్ సిఐ శ్రీనివాస్, వనస్థలిపురం ఎసిపి కాశిరెడ్డిని కలిసి ప్రభుత్వం అభివృద్ధి కోసం 1.95కోట్ల నిధులతో లైబ్రరీ భవనం శంకుస్థాపన చేసిన శిలాఫలకంను ధ్వంసం చేసిన బిజెపి నాయకులను ఆరెస్టు చేసి నాన్‌బెయిలబుల్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వినతి పత్రం అందజేసి, నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు లగ్గొని శ్రీధర్ గౌడ్, రవి ముదిరాజ్, మల్లేష్ గౌడ్, మువ్వ సతీష్ చౌదరి, మునగాల రాఘవేందర్ రావు, మనోజ్‌కుమార్, గంగం శివశంకర్, సుధాకర్ యాదవ్, పొగుల రాంబాబు, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** నీట్ పరీక్షలు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి నీట్ 2025 పరీక్షకు సంబంధించిన ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో టెలీకా న్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 4న (ఆదివారం) నిర్వహించే నీట్ పరీక్షకు రంగారెడ్డి జిల్లాలో 19 కేంద్రాలను గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు.6 వేల 964 మంది అభ్యర్థులు హా జరు కానున్నారని చెప్పారు.నీట్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సా యంత్రం 5 గంటల వరకు జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.పరీక్ష కేంద్రా ల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు 144 సెక్షన్ విధించనున్నట్లు జిల్లా కలెక్టర్ నారాయణ రంగారెడ్డి స్పష్టం చేశారు. పరీక్షా సమయంలో నిరంతర వి ద్యుత్తు ఉండేలా చూడాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సిసి టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రంలోకి అడ్మిట్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తప్పిస్తే ఎలాంటి వస్తువులు కూడా తీసుకురాకూడదని కలెక్టర్ సూచించారు. నీట్ పరీక్షకు వచ్చే అభ్యర్థులకు సౌకర్యార్థంగా ఉండే వి ధంగా సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి అధికారులకు జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సూచించారు.

## జాతీయ అవార్డు అందుకోవడం అభినందనీయం : సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** జిల్లాలోని మాల్ గ్రామపంచాయతీ జాతీయ స్థాయి ఉత్తమ అవార్డును అందుకోవడం అభినందనీయం అని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. ఆత్మ నిర్భర్ పంచాయతీ అవార్డును రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ గ్రామపంచాయతీకి మొదటి స్థానం వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రతిమా సింగ్‌లను మర్యాద పూర్వకంగా జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, డివిజనల్ పంచాయతీ అధికారి, ఇబ్రహీంపట్నం డివిజన్ ,మండల పరిషత్ అభివృద్ధి అధికారి,యాచారం మండల పంచాయతీ అధికారి, కార్యదర్శి, మాల్ గ్రామ పంచాయతీ కలవడం జరిగింది. అవార్డు క్రింద మాల్ గ్రామపంచాయతీకి కోటి రూపాయలను కేంద్ర ప్రభుత్వము ఇవ్వనున్నది. ఈ సందర్భంగా కలెక్టర్ ఎంపిడిఒ,ఎంపిఒ పంచాయితీ కార్యదర్శిలను అభినందించారు.

## అర్హులైన వారందరికీ రాజీవ్ యువ వికాస్ వచ్చేలా చూడాలి



**ప్రజాపక్షం/యాచారం :** అర్హులైన నిరుద్యోగులందరికి రాజీవ్ యువవికాస్ కింద బుణాలు అందే విధంగా బ్యాంక్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం యాచారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యయంలో రాజీవ్ యువ వికాస్ పై బ్యాంకర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ బ్యాంకర్లు అర్హులైన నిరుద్యోగులను గుర్తించాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం లక్షాలకు అనుగుణంగా అర్హులైన వారిని గ్రామ స్థాయిలో గుర్తించాలని అన్నారు. నిరుపేద కుంటుంబానికి చేందిన పేద వారిని గుర్తించాలన్నారు. ప్రభుత్వ సంక్షమ పథకాలు అర్హులైన వారికి అందే విధంగా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ విషయాన్ని అందరు అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అర్హులైన వారిని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ శ్రీలత, సూపరిండేంట్ శైలజా, కార్యదర్శులు, బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గోన్నారు. అంతకు ముందు కొత్తపల్లి గ్రామంలోని వన నర్సరీని, కొత్తపల్లి గ్రామం నుండి కొత్తపల్లి తండాకు వెళ్ళే రోడ్డును ఎంపిడిఓ పరిశీలించారు. ఎండాకాలం కావడం వల్ల నర్సరీలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కొత్తపల్లి గ్రామ రోడ్డును పూర్తి చేసే విధంగా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు : లక్ష్మణ్

**ప్రజాపక్షం/షాబాద్ :** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వేసవి శిక్ష ణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల విద్య అధికారి లక్ష్మ ణ్ శనివారం ఒ ప్రకటనలో తెలిపారు. షాబాద్ మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో ఈ నెల 5నుండి 19 వరకు, ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు శిక్ష ణ తరగతులు జరుగుతున్నట్లు తెలిపారు. షాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరూ ఈ అవకాశం వినియోగించుకోవాలని వివరించారు. ఈ శిక్ష ణ తరగతులో ముఖ్యంగా క్రీడలు, యోగ, డ్రాయింగ్ అనేక అవిషయాలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లి తండ్రులు పిల్లలను పాఠశాలకు పంపించాలని కోరారు.

# జిహెచ్‌ఎంసి సిబ్బందిపై దాడి

- విధులు బహిష్కరించి నిరసన తెలిపిన ఉద్యోగులు
- ఇరు పక్షాలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు
- కార్పొరేటర్‌పై కేసు నమోదు చేసిన అబిడ్స్ పోలీసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి గోషామహల్ సర్కిల్ 14 టౌన్ ప్లానింగ్ అధికారులు, జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌ల వివాదం చోటు చేసుకుంది. ఇరువురు ఒకరిపై ఒకరు వాగ్వివాదానికి దిగి పరస్పరం ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేశారని జిహెచ్‌ఎంసి ఉద్యోగులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో కార్పొరేటర్‌పై కేసు నమోదు చేశారు. కార్పొరేటర్ అనుచరులు ఇచ్చిన ఫిర్యాదుపై న్యాయ స్థానం నివేదిక ప్రకారం నడుచుకుంటామని పోలీసులు తెలిపారు. అబిడ్స్ కట్టెల మండిలో 60 గజాల స్థలంలో ఓ బిజెపి కార్యకర్త ఇల్లు నిర్మాణాం చేపడుతున్నారు. ఇంటి పక్కల వారు కొంతమంది జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నిర్మాణంపై ఇరు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఇళ్ల నిర్మాణంపై బిజెపి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, మరికొంత మంది శుక్రవారం సాయంత్రం అబిడ్స్ జిహెచ్‌ఎంసి కార్యాలయానికి విచ్చేసి టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారి నరేష్‌తో వాగ్వివాదానికి దిగారు. పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న ఆక్రమ కట్టడాలపై మున్సిపల్ అధికారులకు, రాకేష్ జైస్వాల్‌ల మధ్య వివాదం చోటు చేసుకుంది. టౌన్‌ప్లానింగ్ ఏసిపి మంజులా సింగ్ ముందే ఈ సంఘటన చోటు చేసుకుంది. సెక్షన్ ఆఫీసర్ నరేష్, మున్సి ఆరీఫ్‌పై కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ వాగ్వివాదం చేయడంతో వివాదం పెద్దగా మారింది. శుక్రవారం రాత్రి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌పై దాడిచేసిన మున్సిపల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజ్‌కుమార్ అనే వ్యక్తి అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### జిహెచ్‌ఎంసి కమిషనర్ సీరియస్

జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఎవరైన దాడి చేస్తే సహించేది లేదని కఠినంగా వ్యవహరిస్తామని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఉద్యోగ సంఘాల నాయకులు, పలువురు ఉద్యోగులు కమిషనర్‌ను కలిసి అధికారులపై జరిగిన దాడిని వివరించారు. వెంటనే కమిషనర్ కర్ణన్ పోలీసు ఉన్నతాధికారులతో, అబిడ్స్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయేల్ మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయాల్లో కాని అధికారులపై దాడులు చేస్తే కఠినంగా వ్యవహరించాలని కమిషనర్ పోలీసులకు సూచించారు.

### పని చేయని సిసి కెమెరాలు..

జిహెచ్‌ఎంసి ఆబిడ్స్ కార్యాలయంలో ఏసిపి కార్యాలయంలో ఉన్న సిసి కెమెరా, బయట ఉన్న మరో సిసి కెమెరా పని చేయక పోవడంతో పోలీసులు విస్తుపోయారు. జరిగిన దాడి, సంఘటనను సిసి కెమెరాల్లో చూద్దామంటే సిసి కెమెరాలు పనిచేయడంలేదని పోలీసులు తెలిపారు.

### కార్యాలయానికి తాళం ఉద్యోగుల ఆందోళన..

జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ జిహెచ్‌ఎంసి14వ సర్కిల్ ఉద్యోగులంతా సర్కిల్ కార్యాలయానికి తాళం వేసి ఆందోళన చేపట్టారు. శనివారం 14వ సర్కిల్ సిబ్బందికి సంఘీభావంగా 15, 16 సర్కిళ్ల సిబ్బంది. అంబర్‌పేట, ముషీరాబాద్ ఉద్యోగులు, ఇతర అధికారులంతా ఈ నిరసన కార్యక్రమానికి సంఘీభావం ప్రకటించారు. తమ విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. సెక్షన్ ఆఫీసర్ నరేష్, మున్షిలపై దాడిచేసిన కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. టౌన్ ప్లానింగ్ ఏసిపి మంజుల సింగ్, బిఎంఈయు యూనియన్ నాయకులు అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వారి ఫిర్యాదు మేరకు అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయేల్ కార్పొరేటర్ రాకేష్ జైస్వా కేసు న మోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మున్సిపల్ అధికారులపై రాజ్ కుమార్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదును కోర్టుకు పంపామని, కోర్టు తీర్పు ప్రకారం నడుచుకుంట్టామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

## నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థపై.. కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

పురపాలక శాఖ కార్యదర్శి డాక్టర్ కె.ఇలంబర్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న మూడు నెలలు, సంవత్సరంలో జలమండలి చేపట్టే వివిధ ప్రాజెక్టులు, తాగునీరు, సీవరేజ్ నిర్వహణపై కార్యాచరణ రూపొందించాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి డాక్టర్ కె.ఇలంబర్తి జలమండలి అధికారులకు సూచించారు. అలాగే జలమండలి వేసవి కార్యాచరణపై చర్చించారు. నగరంలో ట్యాంకర్ బుకింగ్, డెలివరీల సరళి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జలమండలిలో పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు, మంచినీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ నిర్వహణపై రానున్న మూడు సంవత్సరాలను లక్ష్యంగా చేసుకుని చేపట్టాల్సిన కార్యాచరణపై ఇలంబర్తి సమీక్ష నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన ఈ సమీక్షా సమావేశానికి ఎం.డి. అశోక్ రెడ్డితో పాటు, ఈ.డి. మయాంక్ మిట్టల్, డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.డి. అశోక్ రెడ్డి జలమండలిలో పురోగతిలో ఉన్న వివిధ ప్రాజెక్టులు, బోర్డులోని వివిధ విభాగాలు వాటి పనితీరు, నగరానికి నీటి సరఫరా, ఎస్‌టిపిలు, మురుగు శుద్ధి నిర్వహణతో పాటు భవిష్యత్తు ప్రణాళికలు, ప్రాజెక్టుల గురించి వివరించారు. అలాగే జలమండలిలో చేపట్టిన వివిధ సంస్కరణలు, రెవెన్యూ, ఐటీ, ట్యాంకర్ బుకింగ్ డెలివరీ, మెట్రో కస్టమర్ కేర్, స్కాడా సిస్టం, పని చేసే ప్రాంతాల్లో కార్మికుల కోసం జలమండలి చేపట్టే రక్షణ చర్యలతో పాటు ఇప్పటి దాకా చేపట్టిన ప్రాజెక్టులు కృష్ణా, గోదావరి, హడ్కో రిజర్వాయర్లు, ఓఆర్ఆర్ ఫేజ్ 1, 2 ప్రాజెక్టులు, మురుగు శుద్ధి కోసం చేసే ఎస్‌టిపిల ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్లు సుదర్శన్, శ్రీధర్, ఫైనాన్స్ డైరెక్టర్ పద్మావతి, పర్సనల్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, సిజిఎంలు తదితరులు పాల్గొన్నారు.

## నెలాఖరులో శిల్పాలేఔట్ పనులు పూర్తి

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి. కర్ణన్



**ప్రజాపక్షం/ హైదరాబాద్ / శేరిలింగంపలి :** గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు చేపట్టే శిల్ప లేఔట్ రెండో దశ పనులను మే నెల చివరి వరకు పూర్తి చేయాలని జిహెచ్‌ఎం సి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావుతో కలిసి కమిషనర్ మల్కం చెరువు, గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు చేపట్టే శిల్పా లేఔట్ రెండో దశ పనులను పరిశీలించారు. మల్కం చెరువు వద్ద పారిశుద్ధ్యం, కుక్కల బెడదపై వాకర్స్ ఫిర్యాదు చేయడంతో వెంటనే నిర్వాహకులతో మాట్లాడి వాకర్స్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటి డ్రెయిన్ చెరువులోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖాజాగూడ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా హెచ్‌సిటీ ద్వారా చేపట్టే ఫ్లైఓవర్, అండర్ పాస్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు మూడు వరుసల బై డైరెక్షన్ శిల్పా లేఔట్ ఫ్లైఓవర్ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ ఫ్లైఓవర్‌తో చేరాల్సిన గమ్యస్థానానికి ఎన్ని నిమిషాల్లో వెళ్తారని కమిషనర్ అధికారులను ఆడుగగా, ఓఆర్ఆర్ నుండి కొండాపూర్‌కు, కొండాపూర్ నుండి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు హైటెక్ సిటీకి వెళ్లేందుకు సులభతరం అవుతుందని ప్రాజెక్టు ఇంజనీర్లు కమిషనర్ కు వివరించారు. ఫ్లైఓవర్ పూర్తవ్వడానికి ఎంత కాలం పడుతుందని ఇంజనీరింగ్ అధికారులను అడుగగా ఫ్లైఓవర్ పైన బిటి, ఎల్ఇడి లైట్ల పనులు కొనసాగుతున్నాయని, సర్వీస్ రోడ్డు పనులు సుమారు 5 ఆస్తుల భూసేకరణ ప్రక్రియ పూర్తయితే 15 రోజుల్లో పూర్తవుతుందని ఇంజనీర్లు తెలపడంతో ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అక్కడే ఉన్న జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. కమిషనర్ వెంట జోనల్ ఎస్.ఈ శంకర్ నాయక్, డిసి ప్రశాంతి, ప్రాజెక్టు ఈఈ నమ్యా నాయక్, డిప్యూటీ ఈఈ హరీష్, యుబిడి డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

## మీడియా పట్ల విశ్వాసం సన్నగిల్లడంపై విశ్లేషణ

జర్నలిస్టులకు మేలు జరిగేది టియుడబ్ల్యుజెతోనే

పనిచేసేప్రతీ జర్నలిస్ట్‌కు అక్రిడిటేషన్

రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** రాష్ట్రంలోనే అతి పెద్ద జర్నలిస్టుల సంఘంగా తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యుజె) నిరంతరం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని టియుడబ్ల్యుజె (ఐజెయు)రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ అన్నారు. జర్నలిస్టుల పక్షపాతిగా నిలబడి, వారి సంక్షేమం కోసం నిస్వార్థంగా పోరాడే శక్తి కేవలం తమ సంఘానికే ఉందని, గత 65 యేండ్ల నుండి జర్నలిస్టులకు మేలు చేస్తుండడం వల్లే ఈ సంఘాన్ని విశ్వసిస్తున్నారని చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా టియుడబ్ల్యుజె (ఐజెయు) మొదటి కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎండి సలీమ్ పాషా అధ్యక్షతన ఎల్‌బినగర్‌లో జరిగింది. సమావేశంలో టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డితో కలిసి విరహత్ అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విరహత్ అలీ మాట్లాడుతూ రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లాలో యూనియన్ అత్యధిక సభ్యత్వంతో అవతరించి ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులు పొందుతున్న సౌకర్యాలన్నీ ఉమ్మడి రాష్ట్రంలో తమ సంఘం సాధించి పెట్టినవే అని, గత పదేళ్ల కాలంలో జర్నలిస్టులకు ఆశించిన ప్రయోజనాలేమి లేవని విరాహత్ విచారం వ్యక్తం చేశారు. ఓ వైపు మీడియా సంస్థలకు బాసటగా నిలిచి, మీడియా స్వేచ్ఛను పరిరక్షిస్తూనే, మరోవైపు జర్నలిస్టుల గొంతుకగా నిలబడి,వారి హక్కు ల సాధనకై నిరంతరం పోరాటాలు చేస్తున్నామని విరహత్ అలీ తెలిపారు. నేడు ప్రజల్లో మీడియా పట్ల విశ్వాసం సన్నగిల్లిపోవడానికి కారణాలను విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీనిపై తమ సంఘం ప్రత్యేక దృష్టి సారించినట్లు విరహత్ అలీ స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కార్డులు మరోసారి పొడిగింపు ఉండదని, జూన్ నెలలో ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. కోర్టు కేసుల వల్ల కొంత సమయం పట్టిందని కమిటీ వేసి ప్రభుత్వానికి రిపోర్టు ఇచ్చినట్లు త్వరలో జిల్లా, రాష్ట్రస్థాయి అక్రిడిటేషన్ కమిటీలు వేయనున్నట్లు విరహత్ అలీ పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన జర్నలిజాన్ని తమ సంఘం ప్రోత్సహిస్తుందని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం త్వరలో జిల్లా ఇంచార్జ్ మంత్రి, అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా మాట్లాడుతూ జిల్లాలో గత పదేళ్లుగా 5 లక్షల ప్రత్యేక భీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ మాట్లాడుతూ త్వరలో ఎల్‌బినగర్‌లో జర్నలిస్టులకు మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.ఈ సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు శ్రీశైలం, రాష్ట్ర కౌన్సి ల్ సభ్యులు రాధ కిషన్,మాజీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, భాస్కర్, దుపమ్ ప్రసాద్, శశి పాల్, మధు కుమార్, షకీల్,ప్రణ య్ ముదిరాజ్, సత్యనారాయణ,నరసింహా రావు, సురేందర్, సుభాష్ రెడ్డి,శేఖర్,ఆంజనేయులు, కృష్ణ, కరుణాకర్, పాండు యాదవ్,రఘు యాదవ్ ,దర్శనం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎఐవైఎఫ్ 66వ వ్యవస్థాపక దినోత్సవం



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** అఖిల భారత యువజన సమైఖ్య(ఎఐవైఎఫ్) 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని హయత్‌నగర్ మండల కేంద్రంలో సిపిఐ పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ యేవత దేశ సమగ్రత పరిరక్షణకు, మతతత్వ విద్వేషాల నిర్మూలనకు నడుం బిగించాలని ఆమె పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం యువత నిబద్ధతతో పనిచేయాలని ఆమె సూచించారు.యువత తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ, వారిని తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇది దేశ భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల అధ్యక్షులు వీరన్న, కార్యదర్శి మర్రి శోభన్, సరిత, సుజా త, వెంకట్ గంగరాజు, పరశురాం, యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

## పేస్ ఐఐటి మెడికల్‌లో 100% విజయం



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** జెఇఇ, నీట్ మెడికల్ ఎన్‌ట్రన్స్ 2025లో పేస్ ఐఐటి అండ్ మెడికల్ చందానగర్ బ్రాంచి వందకు వంద శాతం విజయం సాధించడం ఏంతో గోప్ప విషయమని పెస్ ఐఐటి అండ్ మెడికల్ డైరెక్టర్ శంకర్ కస్తూరి తెలిపారు. శనివారం చందానగర్ బ్రాంచి పెస్ ఐఐటి మెడికల్ సంస్థలో విజయం సాధించిన విద్యార్థులకు షీల్డులను అందించి సత్కారించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెస్ ఐఐటి మెడికల్ విద్యాసంస్థల డైరెక్టర్‌లు శంకర్ కస్తూరి, హరిత కస్తూరి, చరితలు విచ్చేసి విద్యార్థులకు షిల్డులను అందించి సత్కారించారు. అనంతరం వారు మాట్లాడుతూ చక్కని నిశ్చుతులైన అనుభవం గల సీనియర్ ఉపాధ్యాయుల ద్వార విద్యార్థులకు విద్యను అందిస్తున్నన్నామని తెలిపారు. 25సంవత్సరాలలో ఏన్నో బ్రాంచిలను నిర్వహిస్తున్నామని విద్యార్థులకు ఫిసిక్స్, కెమిస్ట్రీ, బాయోలజీ సబ్జెక్టలలో ఉపాధ్యాయులు సమగ్రమైన కాన్సెప్ట్స్‌తో పాఠ్యాంశలను అందిస్తూ చక్కని పలితాలు సాధిస్తున్నామన్నారు. తమ తరువాతి లక్ష్యం 2026లో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచి మెదటి ర్యాంకులు సాధించడమేనని తెలిపారు.

## పది ఫలితాల్లో రాక్‌వుడ్స్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా కర్మన్‌ఘాట్‌లోని రాక్‌వుడ్స్ స్కూల్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను రాక్‌వుడ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ రామనాయుడు, సిఇఒ సుబ్రహ్మణ్యం రంగినేనిలు శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులకు మెమొంటోలో అందజేసి ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్తు లక్ష్యాలపై దిశ నిర్దేశం చేశారు.భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే ఆశీర్వచనాలు అందించారు.కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను సబ్బండ కార్మిక శ్రేణులు స్వచ్ఛందంగా పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి, మున్సిపల్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రమావత్ సక్రు నాయక్‌లు పిలుపునిచ్చారు. శనివారం హయత్ నగర్ జిహెచ్‌ఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య కలిసి దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన నోటీస్‌ను ఇవ్వ డం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు కనీస వేతనాల చట్ట కింద నెలకు 26వేల రూపాయలు జీతం చెల్లించాలని, ప్రతినెల ఐదవ తారీకు లోపు జీతాలు చెల్లించాలని, పర్మినెంట్ ఉద్యోగులకు వర్తించే అన్ని సౌకర్యాలను కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ, ఎఐటియుసి ఎల్‌బి నగర్ నియోజకవర్గ అధ్యక్షులు బోయపల్లి రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య ఆఫీసర్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బొడ్డు శ్రీధర్



**ప్రజాపక్షం/గండిపేట:** ఆర్యవైశ్య ఆఫీసర్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా గుడ్డు శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. శనివారం మణికొం డ మున్సిపల్ పరిధిలోని అల్కాపూర్ సెలబ్రేషన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య ఆఫీసర్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీ క్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత , మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ,పిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్,వ్యాపారవేత గందె సుధాకర్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డ బొడ్డు శ్రీధర్‌ను అభినందించారు. మణికొండలో వాసవి మాత అమ్మవారి గుడి కట్టడానికి తమ వంతు సహకారం అందిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అ ధ్యక్షుడు సీతారాం దూళిపాల, అవపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ , అవపా రాష్ట్ర కార్యవర్గం మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## ఉపాధి హక్కుల సాధనకు నిరంతర పోరు

### ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి సదాశివ



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** యువతకు విద్య, వైద్య, ఉపాధి హక్కుల సాధనకై నిరంతర పోరు సల్పించాలని ఆఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మండల కార్యదర్శి సంపంగి సదాశివ పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ రాజీవ్ గృహకల్పలో యువజన సంఘ జెండాను సదాశివ ఎగురవేశారు.

## ధాన్యం సేకరణకు చర్యలు : అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వరి ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 129 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రైతులు కష్టపడి పండించిన పంట వర్షాల వల్ల ధాన్యం తడిసిపోకుండా కావాలసిన తాడిపత్రిలు ,సంచులను అందుబాటులో ఉంచుకోవాలని అయన తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యంన్ని వెంటనే రైస్ మిల్లర్లకు చేరవేయాలని తెలిపారు. ధాన్యాన్ని సేకరించేందుకు హమాలీలను పెంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు, మేనేజర్ కృష్ణ, తదితరులు పాల్గోన్నారు.



## ఆర్‌యుబి నిర్మాణ పనులకోసం పరిశీలన

**ప్రజాపక్షం/అల్వాల్ :** మల్కాజ్గిరి నియోజకవర్గంలోని వివిధ ఆర్‌యుబి రైల్వే నిర్మాణం పనులు కోసం రైల్వే ఉన్నతాధికారులు జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ అధికారుల సమన్వయంతో కలిసి రైల్వే సమస్యల పరిష్కారానికి కృషిచేసిన మల్కాజిగిరి నియోజకవర్గం శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి మచ్చ బొల్లారం డివిజన్ జనప్రియ వద్దగల అదనపు ఆర్‌యుబి నిర్మాణం కొరకు పరిశీలించి మంజూరైన పనులను జూలైలో ప్రారంభిస్తామని రైల్వే అధికారులు తెలిపారు. అదేవిధంగా బొల్లారం రైల్వే బజార్ వద్ద గల కొత్త బస్తి సమీపంలో రైల్వే టన్నెల్ నీరు వెళ్లే మార్గం ఇరుకుగా ఉండడంతో వర్షాకాలంలో నీటి ప్రవాహం ఎక్కువ ఉండడంతో లోతట్టు ప్రదేశంలో గల ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానిక పేద ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైల్వే టెర్మినల్ మార్గాన్ని వెడల్పు చేయాల్సిందిగా రైల్వే ఉన్నతాధికారులకు ఇక్కడి పరిస్థితిని వివరించగా అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఎడిఆర్‌ఎం రెహమాన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అనిరుధ్ పవర్, శశాంక్ నామ్దేవ్, అరుణ్ శర్మ, కమర్షియల్ ఇన్స్పెక్టర్‌లు సురేష్, పవన్, నాగలింగబాబు, బిఆర్ఎస్ నాయకులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** విద్య, వైద్య, ఉపాధి హక్కుల సాధనకై నిరంతర పోరు సల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) మాజీ రాష్ట్ర నాయకులు సోమరాజు పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎఐవైఎఫ్ మేడిపల్లి మండల సమితి ఆధ్వర్యంలో శనివారం భగత్ సింగ్ నగర్‌లో యువజన సంఘం జెండాను సోమరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు సోమరాజు, ఎఐవైఎఫ్ మేడిపల్లి మండల కార్యదర్శి నాగరాజులు మాట్లాడుతూ మన దేశ భవిష్యత్ ను తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమైనదన్నారు. యువతరంలో ప్రగతిశీల, అభ్యుదయ భావాలను, దేశభక్తి, లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలను, నైతిక విలువలను, మానవత్వాన్ని పాదుకొల్పడానికి అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) నిరంతరం కృషి చేస్తుందన్నారు. దేశం కోసం ప్రాణార్పణ చేసిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్, సుభాష్ చంద్రబోస్ లాంటి అమరవీరుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని స్వాతంత్ర్యోద్యమంలో, యువకులను సమీకరించి వీరోచితమైన పోరాటలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్తారి, ఖాదర్, పృధ్వి, నాగచైతన్య, ఎషూ, అఖిలేష్, ప్రశాంత్, వంశి, దుగ్గు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

**కాప్రాలో :** విద్య, వైద్య, ఉపాధి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడేందుకు యువత సిద్దంగా ఉండాలని ఏఐవైఎఫ్ పిలుపిచ్చింది. ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శనివారం ఈసిఐఎల్‌లో యువజన సంఘ పతాకాన్ని ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కన్వీనర్ యోగిత ఎగురవేసారు. అనంతరం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సల్మాన్ బేగ్, టి.సత్యప్రసాద్‌లు మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు




యువ త పాత్ర కీలకమైందని, యువతలో ప్రగతిశీల అభ్యుదయ భావాలు, దేశభక్తి, లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలు, నైతక విలువలు, మానవత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు గిరిబాబు, సాయి, స్వప్న, హారిక, ఫరా ఫాతిమా, మధు,సతీష్ కుమార్, మహేష్‌బాబు, ఎండి హాజిమ్, సోయల్ తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు వరంలా ముఖ్యమంత్రి సహాయనిధి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** పేదలకు వరంలా ముఖ్యమంత్రి సహాయనిధి అందుతుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలు డివిజన్‌లు, బస్తీలకు చెందిన ఏడుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మూడు లక్షల అరవై మూడు వేల చెక్కులను హన్మంత రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. నిరుపేదల ఆరోగ్యం బాగుపడాలని ముఖ్యమంత్రి సహాయ నిధులను భారీగా విడుదల చేస్తున్నారని తెలిపారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని అన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ నిధులను పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని గుండాల్ గ్రామానికి చెందిన కామన్ పల్లి అంజిలయ్యకు సీఎం రిలీప్ ఫండ్ చెక్కును పరిగి మార్కెట్ కమీటి డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సేద ప్రజలను కష్ట కాలంలో ముఖ్యమంత్రి సహాయనీధి వరం వలే



అదుకుంటుందన్నారు. పార్టీలకు అతీతంగా అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది .దరఖాస్తు చేసుకున్నా ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయం అందజేయడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రరెడ్డి , గోపాల్‌రెడ్డి , అంజిలయ్య.శ్రీను ,వెంకటయ్య ,దస్తయ్య, రామయ్య, రాములు , తదితరులు పాల్గోన్నారు.

# 'నీట్' కేంద్రాలకు సూచిక బోర్డులు

### కలెక్టర్ గౌతం సూచన

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** జిల్లాలో ఏర్పాటైన నీట్ పరీక్షా కేంద్రాలు అభ్యర్థులకు సులభంగా తెల్సుకొనే వీలుగా ఆయా మార్గాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ గౌతం సూచించారు. శనివారం కూకట్ పల్లిలోని జెన్‌టియు కాలేజిలో ఏర్పాటైన పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థులకు అవసరమైన మంచి నీరు, వైద్యం, మరుగుదొడ్లు, పార్కింగ్ లాంటి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థుల ప్రవేశ మార్గాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తూ వారి హాల్ టికెట్లను పరిశీలించాలన్నారు. జెఎన్‌టియు వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, ఆర్డీ శ్యాం ప్రకాష్, పోలీసు అధికారులు, పరీక్షా కేంద్రాలకు డ్యూటీ మేజిస్ట్రేట్‌లుగా నియమిం చిన కూకట్ పల్లి, దుండిగల్, మూడుచింతలపల్లి, ఘట్‌కేసర్, మల్కాజిగిరి తహసీల్దార్లు కలెక్టర్ వెంట ఉన్నారు.

**5 నుండి గ్రామ రెవెన్యూ సదస్సులు**

భూభారతి చట్టం అమలు చేయటంలో మేడ్చల్ జిల్లాలో కీసర మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్ మండలంగా ఎంపిక చేసామని జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలు చేయటంలో భాగంగా ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించే దిశగా ప్రభుత్వ ఆదేశాలతో ఈ మండలంలోని గ్రామాల్లో ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.30 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీదారుల నుండి భూ సంబంధిత సమస్యల విషయమై ధరఖాస్తులు తీసుకొని సత్వర పరిష్కారం చేస్తారన్నారు. ఈ నెల 5న, నర్సంపల్లి, ధర్మారం, 6న తిమ్మాయిపల్లి, యాద్గారిపల్లి, ఈస్ట్ అండ్ వెస్ట్ యాద్గార్‌పల్లి, 7న చీర్యాల్, కీసర, 8న హరిదాస్పల్లి, కీసర దాయార, 9న అహ్మద్‌గూడ, నాగారం, బోగారం, 12న కుందన్‌పల్లి, రాంపల్లి, 13న గోదుమకుంట గ్రామాల్లో నిర్వహించే ఈ రెవెన్యూ సదస్సుల్లో ఆయా గ్రామస్తులు వినియోగించుకోవాలని కలెక్టర్ గౌతం కోరారు

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

### 5 నుండి 16 వరకు రైతు అవగాహనా సదస్సులు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ఈ నెల 5 నుండి 16 వరకు ఆయా గ్రామాల్లోనే వ్యవసాయ సంబంధిత శాస్త్రవేత్తలు రైతు అవగాహనా సదస్సుల్లో అవసరమైన సూచనలు, సలహాలిస్తారని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ తెలిపా రు. ఆచార్య జయశంకర్ తెలంగాణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అన్న పేరిట జిల్లావ్యాప్తంగా ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రామాల్లోని రైతు వేదిక/గ్రామ పంచాయతీల్లో ఈ అవగాహనా సదస్సులుంటాయన్నారు. ఈ సదస్సు ల్లో పాల్గొనేందుకు ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వ ఆధార పథకాల లబ్దికోసం తమ భూ పట్టా, పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ ఉన్న మొబైల్ ఫోన్, మీ సేవలో కానీ వ్యవసాయ శాఖాధకారి జారీ చేసిన రైతు నమోదు చేసుకోవాల ని సూచించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా సాగుకు తమ పొలాలు సిద్ధంచేసి సమాయత్తం చేసేందుకు అధిక దిగుబడులు వచ్చే విధంగా తగు సూచనలిస్తారన్నారు

## ప్రజలకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పనులు

### గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ సృజన



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టాలని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ సృజన అధికారులకు సూచించారు. శనివారం నవాబ్‌పేట్ మండలాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో కమీషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖిగా మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కింద ఎన్ని రోజులు పని చేస్తున్నారని, రోజుకు 307 రూపాయల చొప్పున చెల్లిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కింద పొలాలకు కట్టలు వేసుకోవడమే కాకుండా చెక్ డ్యామ్‌ల నిర్మాణాలను పెద్దమొత్తంలో చేపట్టాలని ఆమె అధికారులు సూచించారు.

ఆదాయ వనరులు కల్పించే పంటలు సాగుచేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని ఆమె సూచించారు. ఉద్యానవ న పంటలతో పాటు మునగ, జామ, మామిడి, సీతాఫల్ పంటలను సాగు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని ఆమె అధికారులు సూచించారు.

పంచాయతి రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ పర్యటన భాగంగా అవెన్యూ ప్లాంటేషన్, కాంపోస్ట్ షెడ్, ఫాం పాండ్ నిర్మాణ పనులు పరిశీలించారు. నవాబ్ పెట్ మండలంలో ఉపాధి హామీ కింద నిధులతో చేపట్టిన పౌల్ట్రీ ఫాంను కమిషనర్ ప్రారంభించారు. కమిషనర్ పర్యటనలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, డిఆర్డిఓ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, పంచాయత్ రాజ్ ఉమేష్, ఎంపిడిఒలు విజయ లక్ష్మి, అనురాధ, ఎంపిఓ విజయ్ కుమార్,ఏపిఓ లక్ష్మి దేవి,ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షకు పటిష్టమైన బందోబస్తు : ఎస్‌పి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** ఆదివారం జరగనున్న నీట్ పరీక్షకు ఎలాంటి అవాంతరాలు లేకుండా నీట్ పరీక్షకు ఎలాంటి అవారంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన భాద్రతా ఏర్పాట్లు చేపట్టలని సంబంధిత అధికారులను అదేశించిన జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి ,ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కేంద్రాంలో 5పరీక్షా కేంద్రాలను గుర్తించామని వీటిలో 1193 మంది అభ్యర్థులు ,పరీక్షకు హజరయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుండి సాయత్రం 5గంటల వరకు జరుగుతుంది అని తెలిపారు. జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు పరీక్ష కేంద్రాల వద్ద 144 అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ని జిరాక్స్ కేంద్రాలను మూసివేయలని అదేశాలు ఇవ్వడం జరిగింది అని తెలిపారు.

## శ్రద్ధా డి-అడిక్షన్ సెంటర్ సీజ్ చేసిన డిఎంహెచ్ఓ

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మేడిపల్లి సమీపంలోని మల్లికార్జున నగర్ ప్రాంతంలో అనుమతులు, అర్హతలు లేకుండా మధుకుమార్ కొర్లపాటి నిర్వహిస్తున్న శ్రద్దా డి అడిక్షన్ సెంటర్, రీహాబిలిటేషన్ సెంటర్‌ను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు శనివారం సీజ్ చేసారు. సెంటర్‌లో ఉంటున్న ఇటీవల నల్గొండ జిల్లాకు చెందిన పాండు నాయక్(33) మృతి చెందిన ఉదంతంపై జిల్లా మహిళా అభివృద్ధి, బాలల సంక్షేమ శాఖాధికారులతో పాటు డిఎంహెచ్ ఒ రిహాబిలిటేషన్ సెంటర్‌ను తనిఖీ చేసారు. నిర్వాహకుడికి అవసరమైన



ఎలాంటి వైద్య అర్హతలు లేవని అధికారులు తనిఖీల్లో గుర్తించారు. తమ రిహాబిలిటేషన్ సెంటర్‌లో నైపుణ్యత కల్గిన వైద్య అధికారులు ఉన్నారంటూ ప్రచారం చేస్తూ నిర్వాహకులు ఒక్కొక్కరి నుండి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ 17 మందిని అనధికారికంగా వైద్య సేవలందిస్తున్నారని తెల్సుకొన్న జిల్లా అధికారులు వారిని సెంటర్ నుండి వారి తల్లిదండ్రులు, సంరక్షకులకు తిరిగి అప్పగించారు.

అర్హతలు లేకుండా వైద్య సేవలందిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని డిఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరి హెచ్చరించారు. కీసర డివిజన్ ఉప జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. సత్యవతి, జిల్లా మహిళా అభివృద్ధి, బాలల సంక్షేమ శాఖ సిడిపిఒ స్వాతి, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరెడ్డి, సత్యమ్మ తదితరులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

## స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు వినతి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జర్నలిస్టు కాలనీలో స్పీడ్ బ్రేకర్‌లని ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని అదుపుచేయాలని జర్నలిస్ట్ కాలనీ సంక్షే మ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ పవన్ కుమార్‌కి లాలయ్య వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లాలయ్య మాట్లాడుతూ



నిజాంపేట్ ప్రధాన రహదారి నుండి జర్నలిస్ట్ కాలనీ మీదుగా బాచుపల్లి గండిమైసమ్మ రహదారి వైపు రాకపోకలు విపరీతంగా పెరిగాయని, అదే విధంగా తెలుగు యూనివర్సిటీ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలలు, కార్పొరేట్ పాఠశాలలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, గేటెడ్ కమ్యునిటీలు తదితర కాలనీలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. ఈ రహదారిలో వాహనాల రాకపోకలు అధికంగా పెరగడంతోపాటు వేగానికి అదుపు లేకుండా పోయిందని అన్నారు. ఈ రహదారిలో తక్షణమే స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేసి వాహనాల వేగానికి కళ్లెం వేయాలని కోరారు.



## దయానందనగర్ రైల్వే స్టేషన్‌ను ఆర్‌కె నగర్ రైల్వే స్టేషన్‌గా పేరు మార్చాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** దయానందనగర్ రైల్వే స్టేషన్‌ను స్థానికుల కోరిక మేరకు ఆర్‌కె నగర్ రైల్వే స్టేషన్‌గా పేరు మార్చాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి రైల్వే అధికారులను కోరారు. రైల్వే అధికారులతో కల్సి శనివారం దయానందనగర్ రైల్వే స్టేషన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ రైల్వే స్టేషన్‌లో ప్రయాణీకులు బయటకు వెళ్లేందుకు మరో మార్గాన్నిఏర్పాటు చేయాలని కోరారు. నేషన ల్ హైస్కూల్‌లో ఇటీవలి పదో తరగతి పరీక్షల్లో ప్రథమ శ్రేణితో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు అనిరుద్ పవర్, శశాంక్, నామాష్, అరుణ్ శర్మ, సురేష్, పవన్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ , ఆర్‌కె నగర్ కాలనీకి చెందిన రాఘవేంద్ర, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


# భూ భారతి చట్టంతో భూ వివాదాలు పరిష్కారం

### కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం/నవాబుపేట:** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో భూ వివాదాలు శాశ్వత పరిష్కారం అవుతాయని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం నవాబుపేట్ మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన భూ భారతి చట్టంపై రైతులకు అవగాహనా కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో భూ వివాదాలు శాశ్వత పరిష్కారం అవుతాయని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ధరణితో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేయాలన్న కృత నిశ్చయంతో నిపుణులచే 17 రాష్ట్రాల్లో అధ్యయనం జరిపించిన మీద సమగ్ర అంశాలను పొందుపరుస్తూ రైతు ప్రయోజనాలే ధ్యేయంగా ఆర్ఓఆర్ చట్టాన్ని రూపొందించారని తెలిపారు. ఈ చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. ధరణి స్థానంలో కొత్తగా భూభారతి (భూమి హక్కుల చట్టం) తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డులలో తప్పులను సవరణ చేసుకోవచ్చని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని సూచించారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ, పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై లేదా జారీ చేసిన పాసు పుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీవో కు అప్పీలు చేసుకోవచ్చని, ఆర్డీఓ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని సూచించారు. కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు కూడా అప్పీలు చేసుకోవచ్చని అన్నారు. అప్పీలు చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ తరహా తోడ్పాటు దేశంలోనే మరెక్కడా లేదని అన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికార వికేంద్రీకరణకు ప్రాధాన్యతనిస్తూ తహసీల్దార్, ఆర్డీఓలకు మ్యుటేషన్ చేసే అధికారాలను ప్రభుత్వం కల్పించిందని అన్నారు. భూముల కొనుగోలు, దానం, తనఖా, బదిలీ, భాగ పంపకాలకు సంబంధించి స్లాట్ బుక్ చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే, అస్సైన్, పీ.ఓ.టీ, ప్రభుత్వ భూములు కావని నిర్ధారించుకున్న మీదట గడువు లోపు రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వారసత్వ వీలునామా కింద కూడా మ్యుటేషన్ చేసే అధికారాలను తహసీల్దార్లకు కల్పించారని అన్నారు. అయితే క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపిన మీదట వారసత్వ వీలునామా రిజిస్ట్రేషన్ చేస్తారని సూచించారు. భూ వివాదాల సత్వర పరిష్కారం కోసం భూభారతి ద్వారా ఇదివరకటి తరహాలోనే రెవెన్యూ కోర్టులను పునరుద్ధరించారని తెలిపారు.

భూములకు సంబంధించిన సమగ్ర వివరాలు, హద్దులతో పట్టా పాస్ బుక్కులకు మ్యాప్ లను జత చేస్తారని అన్నారు. లైసెన్స్ సర్వేయర్ తో సర్వే చేయించి సమర్పించే మ్యాప్ లను సర్వేయర్ పరిశీలించి, పట్టా పాస్ పుస్తకం లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమం లో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డిఓ వాసు చంద్ర ఎమ్మెల్యే కాలే యాదయ్య,ఎమ్మార్వో జయరాం, సింగిల్ విండో చేర్మెన్ పోలీస్ రామ్ రెడ్డి, ఏఎంసి చేర్మెన్ గీతాసింగ్ నాయక్, గుడిమల్కాపూర్ మార్కెట్ డైరెక్టర్ రావు గారి వెంకట్ రెడ్డి, ఎఎంసి డైరెక్టర్‌లు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



'ప్రజాపక్షం' అసిస్టెంట్ ఎడిటర్ బిట్రగుంట లక్ష్మి నారాయణ కుమారుడు శ్రీహరి విశ్వమిత్ర – ఐశ్వర్య గౌరిల వివాహ మహోత్సవం శనివారం హైదరాబాద్‌లో జరిగిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన సిబ్బంది

## కలిసికట్టుగా సమస్యలు పరిష్కరించుకోవాలి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకోవాలని బిఆర్‌ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేక్ సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లి, నిజాంపేట్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో కాలనీ వాసులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ విచ్చేసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఇప్పటికే దుందిగల్, బహద్దూర్ పల్లిలోని సముదాయాల్లోమౌలిక వసతులను కల్పించడంతో పాటు ఆర్టీసి బస్సు సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ ప్రాజెక్టు డైరెక్టర్ రవిందర్, వాటర్ వర్క్స్ డిజిఎం చంద్రమోహన్, టిడబ్ల్యూఎస్ ఈఈ రవిందర్, డీఈలు మారుతి, నర్సయ్య, ఏఈలు దుర్గాప్రసాద్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

క్రీడలు

# శ్రేయస్ అయ్యర్‌కు రూ. 12 లక్షల ఫైన్



ఐపిఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్‌పై జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు రూ.12 లక్షల జరిమానా విధించారు. మంగళవారం (ఏప్రిల్ 30) చెన్నైలోని ఎం.ఏ.చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు నిర్దేశిత సమయంలో తమ ఓవర్ల కోటాను పూర్తి చేయలేకపోవడం ఇదే తొలిసారి. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం, శ్రేయస్ అయ్యర్‌కు రూ.12 లక్షల జరిమానా విధించారు. ఈ మ్యాచ్‌లో యుజ్వేంద్ర చాహల్ హ్యాట్రిక్ తీసినప్పటికీ, శ్రేయస్ అయ్యర్, ప్రభ్‌సిమ్రన్ సింగ్‌లు అర్ధ సెంచరీలతో విజయంలో కీలక పాత్ర పోషించారు. వారి అద్భుత ప్రదర్శనతో పంజాబ్ కింగ్స్ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఈ ఓటమితో ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ రేస్ నుంచి తప్పుకుంది. శ్రేయస్, ప్రభ్‌సిమ్రన్ సింగ్ జాగ్రత్తగా ఆడుతూ జట్టును విజయతీరాలకు చేర్చారు. అయితే, ఈ మ్యాచ్‌లో పంజాబ్ బౌలర్ల నిదానంగా ఓవర్లు వేయడంపై ఐపీఎల్ అధికారుల దృష్టి పడింది. నియమాల ప్రకారం నిర్ణీత సమయానికి ఓవర్లను పూర్తి చేయకపోతే దాన్ని నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఇది మొదటిసారి కావడంతో శ్రేయస్ అయ్యర్‌కు కేవలం జరిమానాతో సరిపెట్టారు. అయితే, భవిష్యత్తులో ఇలాంటివి మళ్లీ జరిగితే మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటారు.

# ఐపిఎల్ 2025లో టాప్-3 సూపర్ క్యాచ్‌లు

ఐపిఎల్ 2025 సీజన్ అత్యంత ఉత్కంఠభరితంగా ముందుకు సాగుతోంది. ఇప్పటివరకు 51 మ్యాచ్‌లు పూర్తి కాగా, కొన్ని బౌలింగ్‌తో, మరికొన్ని బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాయి. అయితే ప్రేక్షకుల గుండెలను గెలిచింది మాత్రం ఫీల్డర్ల అద్భుత క్యాచ్‌లే. ఈ ఏడాది మూడు అద్భుతమైన క్యాచ్‌లు అభిమానుల మదిలో ఎప్పటికీ నిలిచిపోతాయి. రషీద్ ఖాన్ ట్రావిస్ హెడ్‌ను అవుట్ చేయడం, కమిందు మెండిస్ డెవాల్డ్ బ్రెవిస్‌ను అద్భుతంగా పెవిలియన్‌కు పంపడం, దుష్మంత సమీరా అనుకూల్ రాయ్‌ను అవుట్ చేయడం.. ఇవన్నీ ఐపిఎల్ 2025లో సూపర్ క్యాచ్ లు గా నిలిచాయి. తుది దశకు చేరుకున్న ఈ సీజన్‌లో చాలా మ్యాచ్‌లు థ్రిల్లింగ్ గా సాగాయి. బ్యాట్స్‌మెన్ పరుగులు సునామీ రేపగా, బౌలర్లు నిప్పులు వర్షంతో పాటు స్పిన్ మాయాజాలంతో అదరగొట్టారు. ఇక







ఫీల్డింగ్ లో కూడా అనేక అద్భుతాలు కనిపించాయి. మ్యాచ్ కొన్ని అద్భుతమైన క్యాచ్ లు మ్యాచ్ ఫలితాన్నే మార్చేశాయి.

1. రషీద్ ఖాన్ – ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేయడం
సన్ రైజర్స్ హైదరాబాద్–గుజరాత్ టైటన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో మ్యాచ్‌ను మలుపు తిప్పే క్యాచ్‌ను అందుకున్నాడు జీటీ ప్లేయర్ రషీద్ ఖాన్. ఎస్ఆర్‌హెచ్ స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ షార్ట్ బాల్‌ను లాంగ్ ఆన్ వైపు సిక్స్ కొట్టాలని యత్నించాడు. అయితే బాల్ సరైన ఫోర్స్‌లో వెళ్లలేదు. దీంతో బౌండరీ లైన్ వద్ ఫీల్డర్ రషీద్ ఖాన్ చిరుతలా పరిగెత్తి, గాల్లోకి ఎగిరి అందరినీ ఆశ్చర్యపరిచే విధంగా క్యాచ్ పట్టేశాడు. ఈ క్యాచ్‌ను చాలా మంది సీజన్ బెస్ట్‌గా పేర్కొంటున్నారు.
2. కమిందు మెండిస్– బ్రెవిస్‌ను ఔట్ చేసిన క్యాచ్
చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ ప్లేయర్ కమిందు మెండిస్.. డెవాల్డ్ బ్రెవిస్‌ను అద్భుతమైన క్యాచ్‌తో ఔట్ చేశాడు. హర్షల్ పాటేల్ బౌలింగ్‌లో బ్రెవిస్ సిక్స్ కొట్టే ప్రయత్నంలో బౌండరీ దాటి వెళ్లే బాల్‌ను కమిందు గాల్లోకి ఎగిరి సూపర్ మ్యాన్ లా క్యాచ్ పట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఇది మజికల్ మూమెంట్స్‌లో ఒకటిగా మారింది.
3. దుష్మంత సమీరా–అనుకూల్ రాయ్ ని ఔట్ చేసిన క్యాచ్
ఢిల్లీ క్యాపిటల్స్‌కోల్ కతా నైట్ రైడర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో దుష్మంత సమీరా అద్భుతమైన మ్యాచ్‌తో అనుకూల్ రాయ్‌ని అవుట్ చేశాడు. అనుకూల్ రాయ్ బాల్‌ను లెగ్ సైడ్‌గా ఫ్లిక్ చేయగా, అది బౌండరీ దాటేలా కనిపించింది. కానీ సమీరా తన ఎడమవైపుగా పులిలా దూకి బాల్‌ను పట్టేశాడు. దీంతో ఒక్కసారిగా అందరూ షాక్ అయి వెంటనే అరవడం మొదలెట్టారు.

# విరాట్-అనుష్క తాగే నీరు ఏవియన్ లీటరుకు రూ.4 వేలా!






టీమిండియా క్రికెటర్ విరాట్ కోహ్లి, బాలీవుడ్ హీరోయిన్ అనుష్క శర్మ ఫిట్‌నెస్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. పరుగుల మిషన్ టీమిండియా ప్లేయర్ విరాట్ కోహ్లి, తన అద్భుతమైన బ్యాటింగ్‌తో ప్రపంచాన్ని ఆకర్షించారు. 36 ఏళ్లలో కూడా దూకుడుగా ఆడుతున్న తన అభిమానులను ఎంటర్‌టైనమ్ చేస్తారు. ఆయన ఫిట్‌నెస్ రహస్యం ఏమిటి? క్రికెటర్ విరాట్, అనుష్క ఏ నీళ్లు తాగుతారో చూద్దాం. వారు ఏవియన్ నేచురల్ స్ప్రింగ్ వాటర్ తాగుతారట. ఏవియన్ నేచురల్ స్ప్రింగ్ వాటర్ ఫ్రాన్స్‌లోని జెనీవా సరస్సు దగ్గర నుండి వస్తుంది. ఇందులో అధిక మొత్తంలో ఖనిజ లవణాలు ఉంటాయి. ఏవియన్ లీటరు కు 4000 రూపాయలు. అమెజాన్‌లో ఒక లీటర్ బాటిల్ 600 రూపాయలు. ఈ నీటిలో సహజసిద్ధమైన బ్లాక్ ఆల్కలీన్ ఉంటాయి. ఇవి శరీరాన్ని ఎల్లప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉండేలా చేస్తుంది.

# కొత్త ప్రేయసితో శిఖర్ ధావన్

ఐర్లాండ్‌కు చెందిన సోఫీ షైన్‌తో తనకున్న సంబంధంపై శిఖర్ ధావన్ క్లారిటీ ఇచ్చాడు. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ మై లవ్ అంటూ ఎమోజీతో వీరిద్దరూ కలిసి ఉన్న ఫోటోను పంచుకున్నాడు. మాజీ భార్య ఆయేషా ముఖర్జీ నుండి విడాకులు తీసుకున్న రెండు సంవత్సరాల తరువాత భారత స్టార్ బ్యాటర్ శిఖర్ ధావన్ ఐర్లాండ కు చెందిన సోఫీ షైన్‌తో డేటింగ్‌లో ఉన్నారనే వార్తలపై క్లారిటీ ఇచ్చాడు. ఇటీవల సోషల్ మీడియా పోస్ట్‌లో శిఖర్ ధావన్ సోఫీ షైన్‌తో తన సంబంధాన్ని ధృవీకరించాడు. దీంతో అన్ని ఊహాగానాలకు తెరపడింది. ధావన్, షైన్ చాలా కాలంగా ఒకరితో ఒకరు డేటింగ్ చేస్తున్నారు. ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా మై లవ్ అంటూ ఎమోజీ సింబల్‌తో శిఖర్ ధావన్ వీరిద్దరూ కలిసి ఉన్న ఫోటోను ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేశాడు. ఈ పోస్టుకు సోఫీతో పాటు చాహల్ కూడా లైక్ కొట్టారు. దీంతో ఈ జోడీకి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## సోఫీ షైన్ ఎవరు?

సోఫీ షైన్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 1.34 లక్షల ఫాలోవర్లు ఉన్నారు. లింక్డ్ ఇన్ ప్రొఫైల్ ప్రకారం ఆమె 2018 నుండి నార్తర్న్ ట్రస్ట్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ప్రొడక్ట్ కన్సల్టేషన్‌లో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆమె యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుదాబిలోని కంపెనీలో పనిచేస్తుంది. ఆమె ఐర్లాండ్‌లోని లిమెరిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి మార్కెటింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీని పూర్తి చేశారు. కాజిల్‌రాయ్ కాలేజీలో కూడా చదువుకుంది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ధావన్, షైన్ స్టాండ్స్‌లో కలిసి కనిపించారు. దీంతో అప్పటి నుంచి వీరు వైరల్ గా మారారు. కాగా, శిఖర్ ధావన్ 2012లో ఆస్ట్రేలియాలో నివసిస్తున్న ఆయేషాను వివాహం చేసుకున్నాడు. 2023 అక్టోబర్‌లో ఢిల్లీ హైకోర్టు ఈ స్టార్ భారత క్రికెటర్ ధావన్‌ఆయేషాకు విడాకులు మంజూరు చేసింది. ఈ జంటకు



2024లో కుమారుడు జోరావర్ జన్మించాడు. ధావన్ ఆగస్టు 2024లో అన్ని రకాల ప్రొఫెషనల్ క్రికెట్ నుండి రిటైర్మెంట్ ప్రకటించాడు. అతను చివరిసారిగా 2024లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో ఆడాడు. భారతదేశం తరపున చివరిగా డిసెంబర్ 2022లో బంగ్లాదేశ్‌తో జరిగిన ఒడిఐలో ఆడాడు.

# కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలి

ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** కనీస వేతనం కార్మికులకు నెలకు రూ.26వేలు ఇవ్వాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సామిల్ అండ్ డింబర్ డిపో ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కాసర్ల గోవర్ధన్ సమ్మె నోటీసును ఓరుగల్లు సామిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పాల్గొని మాట్లాడుతూ ఎంతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తూ, 29 కార్మిక చట్టాలను రద్దుకు చేసి, నాలుగు లేబర్ కోడ్స్‌గా బడా బూర్జువా పెట్టుబడి దారి యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తుందన్నారు. ఇప్పటికే సామిల్ కార్మికులు చాలి చాలని వేతనాలతో దుర్భరమైన జీవితాలు గడుతున్నారన్నారు. అతి తక్కువ వేతనాలు తీసుకొని పనిచేస్తూ వారికి బోనసు సర్వీస్, ఈఎస్ఐ, పిఎఫ్, పని భద్రత లాంటి సౌకర్యాలు వర్తించడం లేదన్నారు. బిజెపి ప్రభుత్వం తీసుకున్న కార్మిక వ్యతిరేక విధానాలు అమలు అయితే సామిల్ కార్మికులకు అన్యాయమే జరుగుతుందన్నారు. కావున చట్టాలను రక్షించుకోవాలంటే మే 20 న దేశవ్యాప్తంగా జరుగే సార్వత్రిక సమ్మెలో సామిల్ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దామేర కృష్ణ, సామిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తురాసి రాజు, ముకుందం సీనియర్ కార్మికుడు బక్కయ్య, మధు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రజా పోరాటాలకు సన్నద్ధం

మే 26, 27 తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభ : సిపిఐ సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ప్రజా పోరాటాలకు సిపిఐ శ్రేణులు సన్నద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో హన్మకొండ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కొట్టెపాక రవి అధ్యక్షత వహించగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలక పార్టీలు విఫలం అయ్యాయని, హామీల అమలు కోసం ప్రజలను సమీకరించి పోరాడాలన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం అయిందని, దేశాన్ని కార్పొరేట్‌లకు తాకట్టు పెట్టి దివాళా తీయించిందన్నారు. మోడీ నమ్మిన బంటు ఆదానీకి ప్రభుత్వ రంగ సంస్థలను దోచి పెట్టారని, ఆదానీ కుంభకోణంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విపక్ష పార్టీల నాయకులపై సిబిఐ, ఇడిలను ప్రయోగిస్తున్న మోడీ ప్రభుత్వం ఆదానీపై ఎందుకు ప్రయోగించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంపై మోడీ ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ అని, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి, ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని అన్యాయం చేసారని అన్నారు. సిపిఐ హన్మకొండ జిల్లా మహాసభ మే 26,27 తేదీలలో హసన్‌పర్తిలో జరగబోతున్నాయని, ఈ మహాసభలకు ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, బాషాబోయిన సంతోష్, జక్కు రాజు గౌడ్, మునిగాల భిక్షపతి,మాలోతు శంకర్, నేదునూరి రాజమౌళి, బత్తిని సదానందం, ఏదునూరి వెంకటరాజం, వేల్పుల సారంగపాణి,మెట్టు శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ పిలుపు

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యపరచాలని, ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో సిపిఐ నాలుగవ మహాసభల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిపిఐ 4వ మహసభలను విజయవంతం చేయాలని, ఈ నెల 25న జరగనున్న మహాసభలకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన 2025, 26 ఆర్థిక బడ్జెట్ కార్పొరేట్లకు ఊతమిచ్చేలా, ప్రజలకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. కార్పొరేట్లకు పన్ను రాయితీలు, బడా వ్యాపారులకు రాయితీలు కొనసాగిస్తూనే, ఆరోగ్యం, విద్య, గ్రామీణ ఉపాధి, ఉపాధి హామీ పథకం, సంక్షేమ పథకాలకు నిధులు తగ్గించారని ఆరోపించారు. నిరుద్యోగం, పెరుగుతున్న ధరలు, వ్యవసాయ సమస్యలను బడ్జెట్‌లో పట్టించుకోలేదని అన్నారు. ఇది కార్మిక, రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర పూర్తయినా ఎన్నికల హామీలన్నీ నెరవేర్చలేదని మండిపడ్డారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా పథకాల అమలులో రైతులు అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు, గ్యాస్ సిలెండర్ రాయితీ, ఉచిత విద్యుత్ వంటి కొన్ని పథకాలు సానుకూల ఫలితాలనిచ్చాయని, సన్నబియ్యం పథకం మంచి పేరు తెచ్చిందన్నారు. మిగిలిన హామీలు అమలు చేయకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. బిఆర్ఎస్ అప్పుల వల్ల ఆర్థిక సంక్షోభం ఉన్నా, దానిని అధిగమించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. దేశంలో 2026 నాటికి నక్సల్స్‌ను లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన మారణహోమాన్ని సృష్టిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఎన్‌కౌంటర్లు, హత్యలు చేస్తున్నారని, బస్తర్, బీజాపూర్, కంకర్ ప్రాంతాలలో ఎన్‌కౌంటర్లు పెరిగాయని, నక్సల్స్ శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. తెలంగాణలో శాంతి కమిటీ వేయాలని కోరినా ప్రభుత్వం స్పందించలేదని, బస్తర్‌లో ఆదివాసీలకు అండగా నిలుస్తున్న సిపిఐపై కక్షతోనే మనీష్ కుంజాంపై ఇడి దాడి చేశారని ఆరోపించారు. ఎన్‌కౌంటర్ల ద్వారా నక్సల్స్‌ను చంపే విధానాన్ని ఖండిస్తూ ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, నక్సల్స్‌ను చర్చలకు ఆహ్వానించాలని, నక్సల్స్ కూడా ఆయుధాలు విడిచి ప్రజాస్వామ్యంలో పాల్గొనాలని సిపిఐ పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా మహాసభకు ముందు మండల శాఖల మహాసభలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆత్మకూరి చిరంజీవి, తాళ్లపల్లి దివాకర్ పాల్గొన్నారు.





# డిగ్రీ పరీక్షలు వాయిదా పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం?

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ధ్వజం





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిఫ్ బకాయిల విడుదల చేయకపోగా డిగ్రీ కళాశాలలు పరీక్షలు నిర్వహించలేక వాయిదా పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం విద్యార్థుల జీవితాలతో చెలగాటమేనని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. ప్రభుత్వానికి కమీషన్లు రావనే ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదా? అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై రేవంత్‌రెడ్డి మాటలకు పొంతన లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే డిగ్రీ పరీక్షలకు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులను ఏకం చేసి రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. శనివారం కరీంనగర్ నగరంలోని స్థానిక బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో నిర్వహించిన సమావేశంలో మణికంఠరెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల లేకపోవడం మూలంగా డిగ్రీ కళాశాల యాజమాన్యాలు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించడం లేదని, రాష్ట్రంలోని కాకతీయ, పాలమూరు, తెలంగాణ, మహాత్మా గాంధీ, శాతవాహన యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ కళాశాలలకు ఫీజు బకాయిలు విడుదల లేక కళాశాలల నిర్వహణ జరగడం లేదన్నారు. అప్పులు తెచ్చి కళాశాలలు నిర్వహిస్తున్న కళాశాలలు ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేది లేదని ప్రకటించాయని పేర్కొన్నారు. ఫీజు బకాయిల విడుదలపై ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా డిగ్రీ మూడో సంవత్సరం ఆరవ సెమిస్టర్ పరీక్ష రాసే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఆ సెమిస్టర్ విద్యార్థులు పరీక్షలు రాసి పాసై పోటీ పరీక్షలు రాయడానికి పిజి సెట్, ఇతర సెట్లు రాయడానికి వీలుంటుందన్నారు. ఇప్పటికే సెట్ల తేదీలు వచ్చాయని, కానీ పరీక్షలు సరైన సమయంలో జరగకపోతే ఆ విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఫీజు బకాయిలను ఒకసారి సెటిల్మెంట్‌గా విడుదల చేస్తామని, మరో సారి ప్రతి నెల కొంత మొత్తం విడుదల చేస్తామని ప్రకటనలకే పరిమితం అవుతున్నారే తప్ప విడుదల చేయడం లేదన్నారు. విద్యాశాఖ తన వద్ద పెట్టుకున్న సిఎం రేవంత్‌రెడ్డి వెంటనే డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి ఫీజు బకాయిలు విడుదల చేసి పరీక్షల నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్ రెడ్డి, వినయ్, శ్రావణ్, రాజేష్, శివ తదితరులున్నారు.

# నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం

మతోన్మాద శక్తుల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ ఆరోపించారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక రావి నారాయణరెడ్డి భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ 66వ ఆవిర్భ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ పతాక ఆవిష్కరణ చేసి అనంతరం మాట్లాడుతు నిరుద్యోగుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను యువత తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పహల్గామ్ ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఉగ్రవాదులు చేసిన దాడిని మన దేశం మీద దాడిగా కాకుండా మన లౌకిక తత్వం మీద,మన ఐక్యత మీద, మన ప్రజాస్వామ్య విలువల మీద దాడిగా చూడాలన్నారు. ఈ దాడిపై మతతత్వాన్ని రగిలించి మనషుల మధ్య ఉన్న సామరస్యాన్ని ధ్వంసం చేయాలని చూస్తున్న శక్తులపై యువత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దాడి చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. యువత ప్రతి రంగంలో ముందుండాలని కోరారు. ప్రపంచ దేశాల కంటే భారత దేశంలో ఉన్న యువత సంఖ్య పెద్దదని, అలాంటి యువతీ యువకుల భవిష్యత్ కోసం ప్రభుత్వాలు ఏమి పట్టించుకోవడంలేదని తెలిపారు. నిరుద్యోగ సమస్య లేకుండా చూడాలని కోరారు. నిరుద్యోగ యువత కు ప్రభుంత్వ ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చాలని తెలిపారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృ తి కల్పించాలని కోరారు. లేదంటే భవిష్యత్తులో అ ఖిల భారత యువ జన సమైక్య ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువజన సమస్యల పైన ఆందోళన పో రాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలి పా రు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సో తుకు ప్రవీణ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, ఎఐవైఫ్ జిల్లా నాయకులు కొమ్మెర రమేష్ చారి, కూనూరి భగత్, బొల్లపల్లి తిరుపతి, జంపా ల పవన్, అభిలాష్ సాయి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లాలి: జిల్లా ఎస్‌పి




**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** పలు సందర్భాలలో కేసులు నమోదు అయిన 73 ద్వి చక్ర వాహనాలు జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రానికి తరలించడం జరిగిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనీ వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో సంబంధిత వాహన యజమానులు ఎవరైనా ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్ లో వాహన డాక్యుమెంట్లు చూపించుకుని తమ యొక్క వాహనాలను తీసుకొని వెళ్లగలరని అన్నారు. లేని యెడల 6 నెలల కాల వ్యవధిలో ప్రభుత్వ నిబంధనలు అనుసరించి బహిరంగ వేలం వేయబడును అని తెలిపారు. ఈ వాహనా ల పూర్తి వివరాలను జిల్లా అధికారిక ఫేస్ బుక్,ట్విట్టర్ లో పొందుపర్చినట్లు తెలిపారు. పూర్తి వివరాలు కొరకు సంప్రదించాల్సిన సంబంధిత అధికారులు మోటర్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ సూరప్ప నాయుడు ఫోన్ నంబర్ 8712670170కు ఫోన్ చేయాలని సూచించారు.



## కాంటాలు వేగం పెంచాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

**ప్రజాపక్షం/మోతె:** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు సూచించారు. శనివారం మోతె మండలంలోని ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించే మోతె, హుస్సేన్‌బాద్, మామిళ్లగూడెం కొనుగోలు కేంద్రాలను, పిఎసిఎస్ ఆధ్వర్యంలో నామవరం స్టేజీ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యంలో తాలు, గడ్డి లేకుండా శుభ్రంగా ఉంటేనే మిల్లర్లు పెండింగ్ పెట్టకుండా దిగుమతి చేసుకుంటారని తెలిపారు. అకాల వర్షాలు కురుస్తున్నందువల్ల ధాన్యంను కాంటాలు వేగంగా వేసి లారీల ద్వారా ధాన్యం ఎగుమతి చేయగానే ట్యాబ్ ఎంట్రీ బిల్లులు ట్యాగ్ వెంటనే చేయాలని సూచించారు. మోతె నుండి 3580 క్వింటాళ్లు, హుస్సేన్‌బాద్ నుండి 3230 క్వింటాళ్లు, నామవరం స్టేజీ నుండి 9800 క్వింటాళ్ల ధాన్యం మిల్లులకు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపియం వెంకయ్య, పిఎసిఎస్ సిఈవో అనంతరెడ్డి, సెంటర్ ఇంఛార్జీలు రామకృష్ణ, శ్రీనయ్య, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద మూడంచల భద్రత : ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు జరగనున్న నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద మూడు అంచెల పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు సూర్యాపేట జిల్లా ఎస్సీ నర్సింహా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నాలుగు పరీక్ష కేంద్రాలలో జరిగే కళాశాలల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు, పరీక్ష కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ర్యాలీలు, సభలు, సమావేశాలు, డిజె లు నిషేదం, జీరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ మూసివేయాలని అన్నారు. అభ్యర్థులు ఇంటి నుండి ముందుగా బయలుదేరి, హడావుడి ఒత్తిడితో ప్రయాణం చేయవద్దని కోరారు. అభ్యర్థులంతా అడ్మిట్‌కార్డు నందు చూపించిన నియమనిబంధనలు పాటించాలని కోరారు.

## జూనియర్ సివిల్ జడ్జిగా గిరిజన యువతి సుష్మ



**ప్రజాపక్షం/చివ్వెంల:** తెలంగాణ హైకోర్టు 2024/25లో నిర్వహించిన జడ్జిల నియామక పరీక్షల్లో మండలంలోని రాజుతండాకు చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు ధారావత్ భాస్కర్‌సంధ్య దంపతుల కుమార్తె సుష్మా జూనియర్ సివిల్ జడ్జిగా నియామకమైంది. సూర్యాపేట పట్టణంలోని సాహితీ స్కూల్‌లో నర్సరీ నుండి ఐదవ తరగతి వరకు చదివిన ఆమె, అనంతరం ఆరు నుండి 8వ తరగతి వరకు బేబిమూన్ స్కూల్, 9 నుండి10 తరగతి వరకు వికాస్ స్కూల్‌లో విద్యను అభ్యసించారు. ఇంటర్మీడియట్‌ను హైద్రాబాద్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో చదివిన ఆమె, ఎల్ఎల్‌బి పెండెకంటి లా కళాశాలలో పూర్తి చేశారు. ఎల్ఎల్ఎం ఉస్మానియా యూనివర్సిటిలో చదివిన ఆమె 2024/25లో తెలంగాణ హై కోర్టు ఇచ్చిన నోటిఫికేషన్‌ను జూనియర్ సివిల్ జడ్జిగా నియామకమయ్యారు.

**తండ్రి కలను నేరవేర్చిన కన్నకూతురు...**

జూనియర్ సివిల్ జడ్జిగా నియామకమైన ధారావత్ సుష్మా ప్రజాపక్షంతో మాట్లాడుతూ తనతండ్రి భాస్కర్ కలను నేరవేర్చినట్లు చెప్పారు. సూర్యాపేట మున్సిఫ్ కోర్టులో చాలకాలం న్యాయవాదుల వద్ద ఆయన మున్సీగా పనిచేశారు. తనపిల్లలను జడ్జిగా చూడాలనే ఆలోచన అతనిలో మొదలైంది. ఆయనకు కూతురు సుష్మాతో పాటు కుమారుడు నిఖిల్ ఉండగా ఇద్దరిని ఎల్ఎల్‌బి చదివించారు. దురదృష్టవశాత్తు తన కుమారుడు నిఖిల్ రెండున్నర ఏళ్ల క్రితం అనుమానస్పందగా మృతి చెందాడు. తన కూతురిని జడ్జిగా చూడాలని పట్టుదలతో న్యాయ విద్యను చదివించారు. దీంతో ఆమె తనతండ్రి చిరకాల వాంచ తీరేలా న్యాయవిద్యలో రాణించి జూనియర్ సివిల్ జడ్జిగా ఎన్నికయ్యారు. సుష్మా జూనియర్ సివిల్ జడ్జిగా ఎన్నిక కావడం పట్ల సూర్యాపేట ప్రాంత ప్రజలతో పాటు గిరిజనులు ఆమెను వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు.

## చదువుతో పాటు క్రీడలలో రాణించాలి



**ప్రజాపక్షం/మోటకొండూరు** : యువత చదువుతో పాటు క్రీడలలో ముందుండి సన్మార్గంలో పయనించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎస్వోటి అడిషనల్ డిజిపి నంద్యాల నర్సింహ్మా రెడ్డి అన్నారు. ఆయన శనివారం మోటకొండూరు మండల కేంద్రంలో చామల పౌండేషన్ వ్యవస్థాపకులు చామల భాను చందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిఎల్ క్రికెట్ ప్రీమియర్ లిగ్ టోర్నమెంట్ 2025 ముగింపు కార్యక్ర మంలో పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో 22 టీములకు గాను ఫైనల్ కు చేరిన టీమ్‌లు మాటూర్, మోటకొండూర్‌లు చేరుకోగా మోటకొండూరు విజయం సాధించింది మొదటి బహుమతి మోటకొండూరు రూ.31000, రెండవ బహుమతి మాటూరు రూ.21000 నగదు బహుమతి ప్రదానం చేశారు. పౌండేషన్ సభ్యులు అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహ్మా రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చామల ఫౌండేషన్ వ్యవస్థాపకులు చామల భాను చందర్ రెడ్డి, ఉదయ్ చందర్ రెడ్డి, ఎస్సై నాగుల ఉపేందర్ యాదవ్, ప్రముఖ న్యాయవాది సామ రాజేందర్ రెడ్డి, చామల సురేష్ రెడ్డి, క్రీడల ఆర్గనైజర్‌లు కర్రె ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మోటర్‌సైకిల్ దహనం.. వ్యక్తులపై చర్యలు

**ప్రజాపక్షం/చింతపల్లి** : మండల పరిధిలోని కిష్టరాయినిపల్లి గ్రామానికి చెందిన మోర శ్రీరాములు పల్సర్ బైక్‌ను దహనం చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ యాదయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాములు వృత్తి రీత్య డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శ్రీరాములు వ్యక్తిగత పనులు ముగించుకొని శుక్రవారం రాత్రి తన బైక్‌ను కిష్టరాయినిపల్లి గ్రామపంచాయతీ ముందు ఉంచాడు. అర్ధరాత్రి శ్రీరాములు తండ్రి బహిర్భూమికి వెళ్లగా మంటల్లో కాలుతున్న బైక్‌ను చూసి కుమారుడిని లేపడంతో వారు మంటలను ఆర్పివేశారు. తన బైక్‌ను అకారణంగా కాల్చివేసిన వక్తులపై చర్యలు తీసుకోవాలని శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ యాదయ్య తెలిపారు.

# ఉపాధి హామీ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలి

రోజువారి వేతనం రూ. 700 ఇవ్వాలి

పుల్లెంలలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన వ్యవసాయ కార్మిక సంఘం నేతలు



**ప్రజాపక్షం/చండూరు** : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నర్సింహ్మా ఆరోపించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా శనివారం చండూరు మండలం పుల్లెంల గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను వ్యవసాయ కార్మిక సంఘం నేతలతో కలిసి బొల్గూరి నర్సింహ్మా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీల సమస్యలు , ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలకు అందుతున్న సౌకర్యాలతో పాటు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహ్మా మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల దగ్గర కనీస అవసరాలు అయిన మంచినీరు , నీడ,మెడికల్ కిట్టు అందుబాటులో ఉంచకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం కూలీలకు పార, గడ్డపార ఉచితంగా ఇవ్వాలన్నారు. పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. మండు వేసవిలో కూలీలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తీవ్రమైన ఎండలు, వడగాల్పులకు వడదెబ్బకు గురికాకుండా ఉదయం 7గంటల నుంచి 10గటల వరకు మాత్రమే పని వేళలు ఉండే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి కూలీకి సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి రోజు వారి వేతనం 700రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేరుకపోయిన ఫీల్డ్ అసిస్టెంట్‌ల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమండ్ చేశారు. రేషన్ కార్డు లేని ఉపాధి హామీ కూలీలకు వెంటనే నూతన రేషన్ కార్డులు మంజూరు చేయాలని, జాబ్ కార్డుకు అప్లై చేసుకున్న వారికి వెంటనే జాబ్ కార్డు ఇచ్చి పని కల్పించాలని డిమాండ్ చేశారు. జాబ్ కార్డు నిమిత్తం లేకుండా ఆత్మీయ భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్లు లేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ప్రభుత్వమే ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజక వర్గం అధ్యక్షకార్యదర్శులు ఎండి జానిమియా, చెదుబుద్ధి ఊషయ్య, చండూరు మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షకార్యదర్శులు బాతరాజు సైదులు, సంజీవ, గండు సత్తయ్య, దుబ్బాక వెంకన్న, పాక లింగయ్య , మొగుదాల బిక్షపతి, కనకమ్మ, అంజమ్మ, పద్మ లక్ష్మమ్మ పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్ దత్త విద్యార్థి భరత్ ఇంటికి వెళ్లి భరోసా

పది ఫలితాల్లో 73% మార్కులు సాధించడంతో సన్మానించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : తాను దత్తత తీసుకున్న 10వ తరగతి విద్యార్థి కుటుంబానికి యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు భరోసానించారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణ పురం మండలం శేరిగూడెం గ్రామానికి చెందిన భరత్ చంద్ర చారి ఇంటికి జిల్లా కలెక్టర్ స్వయంగా వెళ్లారు. పదవ తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన తెల్లవారుజామునే విద్యార్థి ఇంటి తలుపు తట్టే కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ శేరిగూడం గ్రామానికి చెందిన భరత్ చంద్ర చారి ఇంటికి వెళ్లిన విషయం తెలిసింది. ఆ సమయంలో భరత్ చంద్ర చారి కుటుంబ పరిస్థితిని చూసి చలించిన జిల్లా కలెక్టర్ పదవ తరగతి పూర్తయ్యే వరకు తాను సాయం అందిస్తానని బాగా చదివి మంచి మార్కులు సాధించాలని ప్రోత్సహించారు. అందులో భాగంగా ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో భరత్ చంద్ర చారి 73 శాతం మార్కులు సాధించడంతో స్వయంగా జిల్లా కలెక్టర్ ఇంటికి వచ్చి భరత్ చంద్ర, ఆయన తల్లి విజయలక్ష్మి లను సన్మానించారు. ఈ సందర్భంగా నెలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందించారు.

**ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి..**

అనంతరం గుడిమల్కాపురం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారిణి అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు జరగాలని సూచించారు. ఆయన వెంట చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఎస్సై జగన్,ఆర్ఐ కట్ట పాండు, ఏఈఓ శశి బిందు, పంచాయతీ కార్యదర్శి సుభాష్ తదితరులు ఉన్నారు

# నీట్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** నేడు ఆదివారం నిర్వహించనున్న నీట్ (నేషనల్ ఎలిజిబులిటికం ఎంట్రన్స్ టెస్టు) అండర్ గ్రాద్యుయేషన్ 2025 ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. శనివారం నీట్ పరీక్ష కేంద్రాలైన దురాజ్‌పల్లిలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, ఇమాంపేటలోని తెలంగాణ మోడల్ స్కూల్. జూనియర్ కళాశాల, టిజిఎస్‌డబ్ల్యూ ఆర్ స్కూల్ ఇమాంపేట, సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశ పరీక్ష ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4 పరీక్ష కేంద్రాలలో 890 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. నీట్ ప్రవేశ పరీక్ష ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి ఐదు గంటల వరకు జరుగుతుందని, అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకుంటున్నందున ఉదయం 11 గంటలకు కచ్చితంగా పరీక్ష కేంద్రాల గేట్లను మూసి వేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డులో ఉన్న సూచనలు తప్పకుండా పాటించాలని, అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి వెళ్లేటప్పుడు అడ్మిట్ కార్డుతో పాటు గుర్తింపుకోసం ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్‌కార్డు ఏదో గుర్తింపుకార్డు తీసుకరావాలని, రీసెంట్ పాస్‌ఫోటో తీసుకరావాలని తెలిపారు. ఆభరణాలు, ఫుల్ హ్యాండ్ షర్ట్స్, బూట్లు ఉంటే పరీక్ష కేంద్రంలోకి అనుమతిలేదని, జామెట్రిక్ బాక్సులు, మొబైల్ ఫోన్లు , బ్లూటూత్, రిస్ట్ వాచ్, పెన్ను, వాటర్ బాటిల్స్, ఎగ్జామ్ ప్యాడ్స్‌కు అనుమతిలేదని, అభ్యర్థులకి పెన్ను పరీక్ష కేంద్రాలలో ఇవ్వడం జరుగుతుందన్నారు. అధికారులు అందరు సమన్వయం చేసుకుంటూ నీట్ ప్రవేశ పరీక్ష సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. పరీక్ష సమయంలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా విద్యుత్ అధికారులు ఏర్పాట్లు చేశారని, తాగునీరు, హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద జీరాక్స్ సెంటర్లు మూసివేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ నాగేశ్వరరావు, ఆర్డీవో వేణుమాదవరావు, తహసిల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణయ్య, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జయలత, సెంటర్ సూపరిండెంట్లు రమేష్, పద్మ, వినోద, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం




**ప్రజాపక్షం/తుంగతుర్తి:** భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో జై బాపు జై బీమ్ సంవిధాన్ ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. భారత రాజ్యాంగ కల్పించిన హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని విమర్శించారు. కేంద్రంలో అమిత్‌షా మాట్లాడిన మాటలకు నిరసనగా రాహుల్‌గాంధీ పిలుపు మేరకు జై బాపు, జై బీమ్ సంవిధాన్ కార్యక్రమాన్ని దేశమంతా చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామ గ్రామన నిరసనలు వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, గోవర్ధన్, మాచర్ల అనిల్‌కుమార్, పూసపల్లి బిక్షం, మారోజు అంజయ్య, కొమరవెల్లి, గణేష్, పరుశురాములు, సృజన్, కొండరాజు, రవి, రాకేష్, చిరంజీవి, మల్లేష్, నాగరాజు, మల్లేష్, రాంబాబు, మధు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి

మర్రిగూడ మండల కార్యదర్శి బిక్షం రెడ్డి



**ప్రజాపక్షం/మర్రిగూడ:** సిపిఐ బలోపేతం చేస్తూ నూతన నిర్మాణం చేయాలని,ప్రజల సమస్యల పైన అనునిత్యం ప్రజల కోసం పని చేయాలని మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి, సహాయ కార్యదర్శి బూడిద సురేష్ లుకోరారు.సిపిఐ ఖుదాభక్ష్ పల్లి గ్రామ శాఖ సమావేశానికి ముఖ్య అతిధిగా వారు పాల్గొని మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరివిముక్తి కోసం తెలంగాణలో జరిగిన నైజాం రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించారని వారి ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త పునరుకితం కావాలని అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.అనంతరం నూతన గ్రామ శాఖ కార్యదర్శిగా మేతరి యాదయ్య, సహాయ కార్యదర్శి యట యాదగిరిని ఎన్ను కోవడం జరిగింది.ఈసమావేశంలో మాజీ ఎంపిటీసీ శిరగోని బలరాం, పున్నం లక్ష్మయ్య, రాపోతు ముతయ్య, ఎఐఎస్ఎఫ్ ఇస్కిళ్ల మహేందర్, ఎఐవైఎఫ్ మండల సహాయ కార్య దర్శి పొట్ట అశోక్, ఐతగోని కృష్ణయ్య,పొట్ట యాదగిరి, శ్రీనివాస్, శేఖర్, రామలింగం, వెంకటేష్, శంకర్, కుమార్, రాము, పవన్ పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలు

2087 మంది అభ్యర్థులు

నీట్‌పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** నీట్ ప్రవేశ పరీక్షకు అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.శనివారం ఆమె జిల్లా కేంద్రం, అలాగే మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్‌తో కలిసి తనిఖీ చేశారు. ముందుగా జిల్లా కేంద్రంలోని రామగిరి లో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ సౌకర్యాలను, బందోబస్తు ఏర్పాట్లను తనిఖీ చేశారు. అనంతరం ఎంజి యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.కాగా నీట్ అండర్ గ్రాద్యుయేట్ 2025 ప్రవేశ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 7 కేంద్రాలు జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో 4 పరీక్ష కేంద్రాలు, ఎన్జీ కళాశాలలో ఒకటి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఒకటి, కేంద్రీయ విద్యాలయలో మరొక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. మొత్తం 2087 మంది అభ్యర్థులు నీట్ ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహణలో భాగంగా పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లను ఆమె తనిఖి చేయడమే కాక పరీక్ష కేంద్రాల సూపరింటిండెంట్లు,నోడల్ అధికారి, సంబంధిత శాఖల అధికారులకు మరోసారి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ రాజ్ కుమార్, అడిషనల్ ఎఎస్‌పి రమేష్, ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి, డిఎస్‌పి శివరాం రెడ్డి ,నీట్ నోడల్ ఆఫీసర్ ,కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ,తదితరులు ఉన్నారు.

## ప్రపంచమంతా మెచ్చేలా మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు పోచంపల్లి ఆతిథ్యం

స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ప్రపంచమంతా మెచ్చేలా మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు పోచంపల్లి చేనేత ఇక్కత్ పరిశ్రమ కార్మికుల తమ విభిన్న కళాకృతుల వస్త్ర ప్రపంచాలతో ఆతిథ్యం అందించనున్నట్లు స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్, ఈవెంట్ ఇంచార్జ్ లక్ష్మి తెలిపారు. త్వరలో హైదరాబాదులో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న 72వ ఎడిషన్ మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొనే అందాల యువతులు తెలంగాణ రాష్ట్ర పర్యాటక కేంద్రాల సందర్శనలో భాగంగా మే 15న పోచంపల్లి ఇక్కత్ చేనేత పరిశ్రమ బ్రాండ్ ఇమేజ్, చేనేత కార్మికుల వారసత్వ కళా సంపద ప్రపంచానికి ఎలుగెత్తి చాటేలా ప్రమోట్ చేసేందుకు రానున్న నేపథ్యంలో పట్టణంలోని టూరిజం పార్కులో జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఆమె పరిశీలించారు. ప్రపంచ సుందరీమణుల సందర్శన క్రమాన్ని అధికారులకు వివరించారు. పోటీలలో పాల్గొనే 25 మంది ప్రపంచ సుందరిమణులు టూరిజం పార్కును సందర్శించినప్పుడు సీక్వెన్స్, కేటాయించిన సమయంలోనే సుందరిమణులకు ఎలా చేనేత తయారీ క్రమాన్ని ఎలా వివరించాలానే అంశాలను వివరించారు. ఎంట్రెన్స్ గేట్ వద్ద నుంచి మొదలుకొని పార్కులోని మ్యూజియంలో దశలవారీగా చేనేత వస్త్రాల తయారీలో నూలు వడకడం నుంచి మొదలుకొని చీర తయారయ్యే వరకు ప్రతి దశను సమయం ప్రకారంగా వారికి డెమోన్‌స్ట్రేషన్ ఇలా ఇవ్వాలనేది అధికారులకు ప్రణాళికను సూచించారు. మెహందీ స్టాలు, ప్రొజెక్టర్ హాలు, చేనేత తయారీలో ప్రతి దశను కంటెస్టెంట్లకు వివరించేందుకు స్పష్టంగా ఆంగ్లం వచ్చే స్థానిక చేనేత కళాకారిణి నియమించి ఎలా ఎక్స్ప్లెయిన్ చేయాలో శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. జనరల్ మేనేజర్ ఉపేందర్ రెడ్డి, ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఏడి శ్రీనివాస్, ఇన్చార్జి తహసిల్దార్ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకటరెడ్డి, విద్యుత్ శాఖ అధికారి వివిధ శాఖల అధికారులు ఆమె వెంట ఉన్నారు.

## వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తం

జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందువల్ల ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. వేసవిలో ప్రజలు ఎండ తీవ్రతో వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ వివరించారు. ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎండల్లో బయట తిరగకుండా జాగ్రత్త వహించాలని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప బయటకు రాకూడదని,మద్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల మద్యతో ఎట్టి పరిస్థితుల్లో ఇండ్ల నుండి బయటకు రావోద్దని సూచించారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బలు, ఇతర సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులలో తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని, వడదెబ్బ తగిలిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎక్కువగా ప్రచారం చేయాలని అదేశించారు. ఎండలలో ఆల్కహల్, టీ, కాఫీ, స్వీట్స్, చల్లని డ్రింక్స్ తీసుకోవద్దని, చెప్పులు లేకుండా బయటకు నడవవద్దని తెలిపారు. చిన్నారులు, వృద్దులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతిరోజు సరిపడా నీరు త్రాగాలని, వదులుగా ఉన్న దుస్తులను ధరించాలని, బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపి, ద్విచక్రవాహనాలపై సుదూర ప్రయాణాలు చేయకూడదని, సూర్యుని కిరణాలు శరీరంపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వేసవిలో పలు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## విద్యార్థులకు సన్మానం

**ప్రజాపక్షం / పెబ్బేరు :** భారతీయ జనతా పార్టీ పెబ్బేరు పట్టణ అధ్యక్షుడు కావలి క్రాంతికుమార్ నాయకత్వంలో పెబ్బేరు పట్టణంలో గల ఒకటిరెండు వార్డులలో ఎస్ఎస్సి ఫలితాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, శంకర్ అకాడమీలో ఫలితాలుసాధించిన విద్యార్థులకు, అకాడమీ వ్యవస్థాపకుడు జయశంకర్‌కు సన్మానం నిర్వహించారు. రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు పురుషోత్తంరెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గౌని, హేమారెడ్డి, జిల్లా ఓబిసి మోర్చ , ఉపాధ్యక్షులు రామకృష్ణ, జిల్లా దళిత



మోర్చా నాయకులు ఎర్రం రమేష్ , అంబేద్కర్ పూలే సేవాదళ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు వర్సీటీకి నాణ్యమైన విద్యుత్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని పాలమూరు యూనివర్సిటీ కి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం అందిస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాలమూరు యూనివర్సిటీ ఆవరణలో 286.54 లక్షల రూపాయలతో నిర్మించనున్న 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ కు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలమూరు యూనివర్సిటీ ప్రాంగణంలో ఇక్కడ చుట్టుపక్కల ఎన్నో విద్యాసంస్థలు రానున్నాయని, పాలమూరు యూనివర్సిటీ తో పాటు నూతనంగా రాబోయే విద్యాసంస్థలకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ అందించేందుకు ఇక్కడ సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని, రానున్న, 6 నుంచి 8 నెలల లోపు ఈ సబ్ స్టేషన్ అందుబాటులోకి రానుందని, ఈ సబ్ స్టేషన్ అందుబాటులోకి వస్తే చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు సైతం నాణ్యమైన విద్యుత్ అందించడం జరుగుతుంది అని ఆయన చెప్పారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, ఎస్ఈ పివి రమేష్, డిఇ లక్ష్మణ్ పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్, పిజి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, నాయకులు ధర్మాపూర్ నర్సింహారెడ్డి, గోవింద్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఎన్ బాలయ్య, ప్రవీణ్ కుమార్, పులిజాల రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్‌పి పోరాటం వల్లే కులగణన



**ప్రజాపక్షం/మక్తల్ః** నేడు బిసిల ఓట్ల కోసం బిజెపి, కాంగ్రెస్ డ్రామాలు ఆడుతున్నాయని బిఎస్‌పి నారాయణపేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ అన్నారు. నలబై ఏండ్ల బిఎస్‌పి పోరాటం వల్లే నేడు బీసీ కులగణనకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదన్నారు. శనివారం మక్తల్ పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు బీసీ రిజర్వేషన్ల కోసం కుల గణన కోసం బీఎస్పీ పోరాటానికి తలొగ్గి నాటి ప్రభుత్వం మండల్ కమిషన్ వేస్తే బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా బీజేపి మండల్ ఉద్యమాన్ని చేసిందని గుర్తు చేశారు. బీజేపీ మొదటి నుండి బీసీ, రిజర్వేషన్లకు, కుల గణనకు వ్యతిరేకమన్నారు. బీఎస్పీ జిల్లా కార్యదర్శి బండారి చంద్ర శేఖర్, మక్తల్ అసెంబ్లీ ఇంచార్జ్ పాలెం వెంకటయ్య, అసెంబ్లీ అధ్యక్షులు గువ్వల తిరుపతి, సోషల్ మీడియా ఇంచార్జ్ అశోక్, మక్తల్, మండల అధ్యక్షులు పరుశురాం, కృష్ణ మండల అధ్యక్షులు మల్లికార్జున్, బీఎస్పీ నాయకులు ఎర్ర కృష్ణ, వెంకటయ్య, ముదిరాజ్, నర్సింహులు, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తం



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద షిటీమ్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ నేరాలు, బస్సులలో ప్రయాణించేటప్పుడు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. షి టీమ్ పోలీసులు బాలరాజు మాట్లాడుతూ. ప్రజలు సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలను గురికారాదని లాటరీ తగింలిందని, తక్కువ వడ్డీకి లోన్ ఇస్తామని, ఎవరైనా ఓటీపీలు అడిగితే చెప్పరాదన్నారు. బస్సులలో ప్రయాణం చేసేటప్పుడు ప్రజలు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. షిటీమ్ పోలీసులు జ్యోతి, కవిత, ప్రజలు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎస్ రైస్ పట్టివేత

**ప్రజాపక్షం/నారాయణపేట్/నర్వః** నర్వ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎరుకలి వెంకటేష్, పి.రాజు అనే వ్యక్తులు అర్ధరాత్రి అక్రమంగా ఆటోలో 10 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ తీసుకువెళ్తుండగా కల్వా ల్ శివారులో టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నర్వ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కుర్మయ్య తెలిపారు. నర్వ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా పిడిఎస్ రైస్‌ను నిల్వ ఉంచినా, రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కఠోర సాధనతోనే ఏదైనా సాధించొచ్చు

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** విలువైన సమయాన్ని వృధా చేయకుండా కఠోర సాధనపై దృష్టి సారిస్తే మీరు అనుకున్నది సాధించవచ్చని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పేర్కొన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని మదర్స్ ల్యాప్ హై స్కూల్ విద్యార్థులు పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా శనివారం విద్యార్థులను ఎస్పీ రావుల గిరిధర్ సన్మానించి అభినందించారు. ఈ పాఠశాలకు చెందిన కె. సింధుశ్రీ 600 మార్కులకు 574 మార్కులు సాధించి వనపర్తి జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. కృష్ణారెడ్డి 538 , అమృత 534 మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. 14 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ స్వామి వివేకానంద లాంటి మహాత్ములను ఆదర్శంగా తీసుకొని చదువుతో పాటు సేవా భావం కలిగి ఉండాలని సూచించారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలని, చదువుతో పాటు క్రమ శిక్షణ కలిగి ఉండి తల్లిదండ్రులను, పెద్దలను , గురువులను గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మదర్స్ ల్యాప్ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ ఎండి. అబ్దుల్ ముబీన్ పాల్గొన్నారు.



# భూ సమస్యలు పరిష్కారం

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం / పాన్‌గల్ :** గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం భూ భారతి పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం పాన్‌గల్ మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుకు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మాట్లాడారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ధరణితో చాలా మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, భూ సమస్యలు పరిష్కారం కాక సతమతమయ్యారని అన్నారు. భూ సమస్యల పరిష్కారం



కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ ఉన్న భూ చట్టాలను అధ్యయనం చేసి వాటిలోని మంచి అంశాలను, రెవెన్యూ అధికారులు, న్యాయకోవిదులు, రైతులతో చర్చించి ధరణిలో ఉన్న సమస్యలు అన్నింటికి పరిష్కారం చూపే భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన 64 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి జూపల్లి అందజేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి , అధనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు యాదయ్య, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, డిఆర్డిఓ ఉమాదేవి, డిఏఓ గోవింద నాయక్ ,జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ , తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవిందరావు, మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీవెంకటేష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ రవికుమార్‌పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి

**ప్రజాపక్షం/నారాయణపేట్ః** నారాయణపేట్ జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేసి డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని ఆర్డీఓ రామచంద్ర నాయక్ అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో మాదకద్రవ్యాల నిషేధం (యాంటి నార్కొటిక్) పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డిఓ మాట్లాడారు. జిల్లాలో గంజాయి సాగు జరకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని జూనియర్ డిగ్రీ, కళాశాలలో యాంటి డ్రగ్ కమిటీల ద్వారా మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలలోనూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. డి.ఎస్,పి నల్లపు లింగయ్య మాట్లాడుతూ జిల్లాలోని జూనియర్, డిగ్రీ కళాశాలలో యాంటి డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలోని అన్ని ప్రాంతాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించింది. టీజీ యాంటీ నార్కోటిక్ నారాయణపేట పేరిట ఒక వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేసి ప్రతి నెల జరిగే యాంటి నార్కోటిక్ మీటింగ్ లలో నమోదు చేసిన మినిట్స్ ను ఇన్ టైం లో అప్ లోడ్ చేయాలని కోరారు. సమావేశాల్లో చర్చించిన అంశాలుచ డ్రగ్స్ నిషేధానికి శాఖల వారీగా తీసుకున్న చర్యలను గ్రూప్ లో షేర్ చేయాలని సూచించారు.

# మహిళా సాధికారతకు కృషి చేద్దాం



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా మహిళా సాధికారత కేంద్రం సింగారం దగ్గర ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన న్యాయమూర్తి , లీగల్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు లీగల్ సర్వీసెస్ సంస్థ వింధ్య నాయక్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. జిల్లా లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో మహిళా సాధికారతకై కృషి చేద్దాం అన్నారు. భారతీయ న్యాయ సంహిత, మహిళా చట్టాలను పూర్తి స్థాయిలో అమలు పరుచుటకు అన్ని మహిళా సంస్థలకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ వింధ్య నాయక్, అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ మహిళా కేంద్రీకృత చట్టాలు, మహిళా కేంద్రీకృత నిబంధనల పై నేరాలుగా పరిగణించబడే చర్యలు, చట్ట విరుద్ధమైన లోపాలు, ప్రాథమిక హక్కులు, శిక్షలు, సాధారణ మినహాయింపులు, ప్రేరేపణ, నేరపూరిత కుట్ర ప్రయత్నం, స్త్రీ, పిల్లల పై నేరాలు, కిడ్నాప్, దొపిడీ, వాహన దొంగతనం , సైబర్ నేరాలు, కాంట్రాక్ట్ హత్యలు,వంటి ఏదైనా కొనసాగుతున్న చట్టవిరుద్ధ కార్యకలాపాలు, అత్యాచారం , లైగింక వేధింపులు, వేధించడం, స్త్రీ నమ్రతను అవమానించడం వంటి ఐపిసి సెక్షన్స్, బిఎన్ఎస్ కొత్త నిబంధనలను వివరించడం జరిగింది. బిఎన్‌యస్ లో, 20 కొత్త నేరాలను చేర్చారు, రద్దు చేయబడిన ఐపీసీ లోని 19 నిబంధనలను తొలగించారు. 33 నేరాలకు జైలు శిక్షను పెంచారు, 83 నేరాలకు జరిమానాలను పెంచారు. 23 నేరాలకు తప్పనిసరి కనీస శిక్షను ప్రవేశపెట్టారు. ఆరు నేరాలకు సమాజ సేవ శిక్షను ప్రవేశపెట్టారు. న్యాయ మూర్తి వింధ్య నాయక్ అన్నారు. దానిలో భాగంగా ఈ కార్యక్రమం బాలల సంక్షేమ మండలి చైర్మన అశోక్ శ్యామల చిల్డ్రన్స్ చట్టాలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ బిఎన్‌యస్ ఆక్ట్, ఛీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మి పతి గౌడ్, ఫ్రీ లీగల్ ఎయిడ్ , టోల్ ఫ్రీ 15100 గురించి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నాగేశ్వరి ఉమెన్స్ చట్టాలు, సీనియర్ న్యాయవాది నందు నామాజి, బాల్యవివాహాలుతగిన చట్టాలు, బాలల సంక్షేమ మండలి మెంబర్ సూపర్వైజర్స్, చిల్డ్రన్ హోమ్ సూపరిండెంట్ శ్వేత, డీసీపీవో తిరుపతయ్య, మహిళా సాధికారత కేంద్రం కోఆరన్డినేటర్ నర్సింహులు, జెండర్ స్పెషలిస్టులు అనిత, నరసింహ, చెన్నప్ప షీటీమ్, సఖి సెంటర్ అడ్మిన్ క్రాంతిరేఖ, భరోసా కోఆర్డినేటర్ ప్రమీల, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ నర్సిములు, సాయి, సంధ్య, ఆయా విభాగాల టీమ్ సభ్యులు , పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ పేదల పాలిట వరం

### జిల్లా ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షుడు వెంకటేష్



**ప్రజాపక్షం / వీపనగండ్ల:** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఆపద్బాంధవు లాంటిదని వనపర్తి జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు డా. ఇంద్రకంటి వెంకటేష్ అన్నారు. మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందిన నలుగురికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ పథకం చెక్కులను లబ్దిదారులైన ముద్దంగుల కురుమయ్యకు 38వేలు, కత్తి రాజేశ్వరికి రూ. 33,500, సంగన మోని శ్రీరాంకు రూ. 22,500, అల్లే నారాయణకు రూ. 32వేల విలువ చేసే చెక్కులను ఇంటింటికి వెళ్లి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా డా. ఇంద్రకంటి వెంకటేష్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన పేద ప్రజలకు ఒక ప్రతి ఒక్కరికి అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ పార్టీప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రంలో గ్రామ మాజీ సర్పంచ్ మౌలాలి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెన్నారెడ్డి, ధనంజయుడు, మీసాల మోహన్ , వడ్డేనాగరాజు, శ్యాంసుందర్ రెడ్డి, మీసాల కురుమయ్య, తెలుగు వేమన్న, తెలుగు లక్ష్మయ్య, వడ్డే కుర్మయ్య, కురుమయ్య, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు పి. మోహన్ నాయుడు, రాజు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ప్రతినిధిః** రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని మన్యం కొండలో నూతన 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌కోసం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతోపాటు, లోఓల్టేజ్ సమస్య లేకుండా విద్యుత్‌ను నిరంతరం అందించేందుకు కృషి చేస్తామనిస్పష్టం చేశారు. రైతుల సమస్యల్ని గత ప్రభుత్వం విస్మరించిందనిఆరోపించారు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని, దేశానికి అన్నం పెట్టే రైతన్నకు అండగా ఉండేందుకే ఏక కాలంలో రెండు లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేసి 25 లక్షల రైతు కుటుంబాలకు రుణ



విముక్తి చేశామని ఆయన గుర్తు చేశారు. మన్యం కొండ దేవాలయ అభివృద్ధి కి ఈ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, దినదినాభివృద్ధి చెందుతున్న మన్యంకొండ దేవాలయ అభివృద్ధి చేయటకు 130కోట్లరూపాయలతో నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేశామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లతో పాటు రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామనితెలిపారు.అంతకుముందు మహబూబ్‌నగర్ మండలం లోని రైతులు ఎమ్మె ల్యేకి స్వాగతం పలికారు. ఎడ్ల బండి పైన వేదిక వరకు గ్రంథాలయసంస్థ చైర్మన్, ముడా చైర్మన్ రైతులతో కలిసి వచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ ఆనంద్ గౌడ్, ఎస్ఈపివి సుందర్ రావు, నాయకులు మల్లు అనిల్ రెడ్డి, అనిల్, సుధాకర్‌రెడ్డి,రామచంద్రయ్య,శ్రీనివాస్ యాదవ్, గోవింద్ యాదవ్, ధర్మాపూర్‌నర్సింహరెడ్డి, ఎన్. బాలయ్య, పోతన్‌పల్లి మోహన్‌రెడ్డి, కె.మహేందర్ గౌడ్, ప్రవీణ్ కుమార్, పులిజాల రవికిరణ్, కురుమూర్తి, తదితరులు ఉన్నారు.

## తెలంగాణ కులగణన దేశం అనుసరిస్తోంది



**ప్రజాపక్షం / కొత్తకోట:** తెలంగాణ చేసింది దేశం అనుసరిస్తోందని, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి సూచన మేరకు కులగణనపై కేంద్రం తీసుకున్నా నిర్ణయం తెలంగాణ ప్రభుత్వ విజయంగా రాహుల్ గాంధీ ఘనత గా భావించి శనివారం కొత్తకోట పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే , సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు పోతుల శ్రీనివాస్ , కొత్తకోట మండల అధ్యక్షులు నాగరపు బీచుపల్లి మాట్లాడుతూ రాహుల్ గాంధీ స్పూర్తితోనే తెలంగాణ కులగణన సర్వేను ప్రారంభించారని, కుల గణన అవశ్యకతపై కాంగ్రెస్ పార్టీదేశ వ్యాప్తంగా పోరాటం చేసిందని, తెలంగాణ చేసింది. దేశం అనుసరిస్తోందనే విషయం మరోసారి స్పష్టమైందని ,రాహుల్ గాంధీ ప్రతిపక్షంలో ఉన్నప్పటికి కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయగలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలు రానీయొద్దు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** వేసవి కాలంలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా చూసుకోవాలని మున్సిపల్ కమీషనర్ మహ్మద్‌షేక్ సిబ్బందికి సూచించారు. పట్టణ ప్రజలకు వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులులేకుండా , మంచి నీటిని వృథాకాకుండా చూడాలని నీటి సరఫరా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కడైనా పైపులైన్లు మరమ్మత్తులకు గురైతే వెంటనే మరమ్మతులు చేయాలని ఆయన సూచించారు.

## ఘనంగా ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ప్రతినిధిః** అఖిలభారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని లక్ష్మణాచారిభవనంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బిజ్జ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొట్ట మొదటి యువజన సమాఖ్య ఏర్పడి యువకుల హక్కులకోసం ప్రతి సమస్యను పరిష్కరించడంలో ముందుండి పోరాడిందన్నారు. సిపిఐ



రాష్ట్ర సమితి నాయకులు కేశవులుగౌడ్,ఎఐవైఎఫ్‌నాయకులు ఉమ్మ డి జిల్లా మాజీ ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఈర్లభూపేష్‌బాబు, ఎఐవైఎఫ్ నాయకులు శివశంకర్, వెంకటస్వామి, గొర్ల సత్యం, కపిలవాయిగోపిచారి, కొత్తరామస్వామి, ఆంజనేయులు, బాలపీరు, రాముడు, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.


## గుండెపోటుతో విఆర్ఎ మృతి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లిలో విఆర్ఎ బాలస్వామి మృతిచెందాడని స్థానికులు తెలిపారు. తెలకపల్లి తహసీల్దార్ కార్యాలయంలో విఆర్ఎగా విధులు నిర్వహిస్తున్న బాలస్వామి(70) శనివారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందాడని చెప్పారు. 30 ఏళ్లుగా తన విధులను నిజాయితీగా నిర్వర్తిస్తూ ప్రజలకు అంకితభావంతో సేవలు అందించారన్నారు. గ్రామంలో మంచిపేరు సంపాదించుకున్నారని అన్నారు. ఆయన మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

# అకాల వర్షానికి తడిసిన ధాన్యం కొంటాం

### వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** ఆకస్మికంగా ఈదురు గాలులు భారీ వర్షం వల్లవనపర్తివ్యవసాయ మార్కెట్ యార్డు లో తడిసిపోయిన రైతుల ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఎలాంటి ఆందోళన చెందవాల్సిన అవసరం లేదని వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వనపర్తి ఎమ్మె ల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, జిల్లా జాయింట్ కలెక్టర్ తో పాటు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని ఆకాల వర్షానికి రైతులు నష్టపోతున్నారని ఈ విషయం ప్రభుత్వం గమనించి తడిసిన ధాన్యం కొనుగోలు చేయడమే కాక రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీనిచ్చారు. మార్కెట్ యార్డులో గుంతలు గుంతలు. ఎక్కడ చూసినా



వర్షపు నీరు ప్రవహించకుండా నిలిచిపోతుందని గత పాలకుల అసమర్థత వల్లనే ఈ దుస్థితి నెలకొనదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతం మర్చిపోయి ప్రతిపక్ష పార్టీల నాయకులు రైతులను మభ్య పెట్టడానికి మోసం చేయడానికి మార్కెట్ యార్డ్ పైన ప్రభుత్వంపైన తప్పుడు నిందను మోపుతున్నారని ఆయన అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో విచ్చలవిడిగా రైస్ మిల్లులు లేకున్నా కూడా ధాన్యాన్ని ఇచ్చినట్లు 50వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆయన టీఆర్ఎస్ ప్రభుత్వం రైస్ మిల్లుల ప్రభుత్వంగా నడిఇచిందని ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అక్రమాలకుపాల్పడ్డ రైస్ మిల్ యాజమానులను రైస్ మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్ట రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 15వేల ఓట్ల రూపాయల నిధులను ధాన్యం విక్రయించినరైతులకు సకాలంలో డబ్బులు చెల్లించారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యానికి ప్రధాన కారణం టీఆర్ఎస్ పార్టీ అని ఆయన నొక్కి చెప్పారు. అనవసరమైన రాద్ధాంతం చేయడం రైతులను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని ఆయన హితవ్ పలికారు. ప్రజలు రైతులు ఎవరు కూడా ప్రతిపక్ష పార్టీల నాయకుల మాటలు నమ్మవద్దనికాంగ్రెస్ పార్టీరైతులకు ఎల్లవేళళా అండదండలు ఉంటాయని ఆయనహామీనిచ్చారు.

## పాలకుల వైఫల్యంతో యువశక్తి నిర్వీర్యం



**ప్రజాపక్షం /వనపర్తి టౌన్ :** దేశం , రాష్ట్రంలో పాలకుల వైఫల్యంతో విలువైన యువశక్తి నిర్వీర్యం అవుతోందని ఏఐవైఎఫ్ జిల్లా ఇంచార్జ్ రమేష్ అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కార్యాలయంలో ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవంను నిర్వహించారు.రమేష్ ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఇంచార్జ్ రమేష్ తో పాటు జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్ , ఎండి కుతుబ్ మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా యువకులు ఉన్నా వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించి దేశ అభివృదగ్గిలో భాగస్వాములను చేయటంలో పాలకులు విఫలమయ్యారన్నారు. బీజేపీ అధికారంలోకొచ్చి 11 ఏళ్లు అయిందన్నారు. తొలిసారి అధికారంలోకి రావడానికి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నరేంద్రమోడీ ఆశ చూపి నిరుద్యోగులతో ఓట్లు వేయించుకొని ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్ , ప్రధాన కార్యదర్శి కుతుబ్ , నేతలు మహబూబ్ , శ్రీకాంత్ ,చిన్న కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ



# షెపర్డ్ విధ్వంసం

చెన్నై సూపర్ కింగ్స్‌కు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీకి ఓపెనర్లు శుభారంభం అందించారు. చివరలో రమిరియో షెప్పర్డ్ అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. టాస్ గెలిచిన సీఎస్‌కే కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ బౌలింగ్ ఎంచుకున్నాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన జాకబ్ బెథెల్‌విరాట్ కోహ్లీ జోడీ అర్ధసెంచరీలతో చెలరేగింది. విరాట్ కోహ్లీ 33 బంతుల్లో ఐదు ఫోర్లు, ఐదు సిక్సర్ల సహాయంతో 62 పరుగులు చేశాడు. ఈ క్రమంలో విరాట్ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ 300 సిక్సర్ల మైలురాయిని అందుకున్నాడు. మరో ఓపెనర్ జాకబ్ 33 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 55 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. ఓపెనర్లు ఇద్దరు అవుట్ అయ్యాక స్కోర్ కాస్త నెమ్మదించింది. దేవ్‌దత్ పడిక్కల్(17), రజత్ పాటిదార్(11), జితే శర్మ(7) పరుగులు చేయగలిగారు. ఇక చివరలో రొమారియో షెపర్డ్ చెలరేగాడు. సిక్సర్లతో చెన్నై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. షెపర్డ్ విధ్వంసకర ఇన్నింగ్స్ కారణంగా ఆర్‌సీబీ భారీ స్కోర్ చేయగలిగింది. షెపర్డ్ 14 బంతుల్లో ఆరు సిక్సర్లు, నాలుగు ఫోర్ల సహాయంతో 53 పరుగులు చేశాడు. 378.57 స్ట్రయిక్ రేట్‌తో పరుగులు చేయడం విశేషం. ఐపీఎల్‌లో వేగంగా హాఫ్ సెంచరీ చేసిన బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. పాట్ కమ్మిన్స్, కేఎల్ రాహుల్ రికార్డును సమం చేశాడు. వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసిన బ్యాట్స్‌మన్‌గా రికార్డు యశస్వి జైస్వాల్ పేరిట ఉన్నది. జైస్వాల్ కేవలం 13 బంతుల్లోనే ఈ ఘనత సాధించాడు.

# ఆసియా కప్ కష్టమేనా?



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దేశమంతా ఆందోళన వ్యక్తమైంది. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. పాకిస్థాన్ కీలక పాత్ర పోషించిందనే విమర్శలు వచ్చాయి. క్రీడా సంబంధాలపైనా ఆ ఎఫెక్ట్ పడనుందని.. క్రికెట్ సహా ఇతర క్రీడల్లో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడకూడదని ఇప్పటికే నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. క్రికెట్‌లోనూ ఇరు జట్ల మధ్య సిరీస్‌లు జరగడం లేదు. ఐసీసీ టోర్నీల్లోనే తలపడుతున్నాయి. ఈ విషయంలో ఐసీసీ కూడా దృష్టిపెట్టాలని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వ్యాఖ్యానించారు. దీంతో ఆసియా కప్‌లోనూ భారత్ పాల్గొనడంపై ఇప్పుడు అనుమానాలు వెల్లువెత్తాయి. టోర్నీని వాయిదా వేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. "ఆసియా కప్ సాధారణంగా తటస్థ వేదిక పైనే నిర్వహిస్తున్నారు. ఈసారి ఇంకా షెడ్యూల్‌ను ప్రకటించలేదు. బంగ్లాదేశ్ సిరీస్ అనంతరం సెప్టెంబర్‌లో వేదికను నిర్ణయించే అవకాశం ఉంది. తాజా సమాచారం ప్రకారం ఆసియా కప్ వాయిదా పడే అవకాశం ఉంది. ప్రస్తుతం భారత్ పాక్‌ల మధ్య ఇప్పుడు సంబంధాలు సరిగ్గా లేవు. ఇలాంటి దశలో నిర్వహించే అవకాశాలు తక్కువే" అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

## బంగ్లా పర్యటన కూడా రద్దు!

ఆగస్టులో బంగ్లాదేశ్‌తో మూడు వన్డేలు, మూడు టీ20లను ఆడేందుకు భారత్ అక్కడికి వెళ్లాల్సిఉంది. అయితే, బంగ్లా పర్యటనకూ టీమ్‌ఇండియా వెళ్లే అవకాశం తక్కువేనని సమాచారం. "ఐసీసీ క్యాలెండర్ ఇయర్‌లో బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు చోటుంది. కానీ, దానిని కొనసాగించే ఛాన్స్‌లు కనిపించడం లేదు. భారత్‌కు సంబంధించిన రాష్ట్రాలపై బంగ్లా నేత చేసిన వ్యాఖ్యలే దీనికి కారణమని తెలుస్తోంది" అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

# రీల్

# విజయ్, రష్మిక హ్యాట్రిక్



ప్రస్తుతం మన టాలీవుడ్ నుంచి రానున్న భారీ చిత్రాల్లో దర్శకుడు గౌతమ్ తిన్ననూరి సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ కాంబినేషన్‌లో చేస్తున్న అవైటెడ్ చిత్రం కింగ్డమ్ కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ సినిమా తర్వాత మరో టాలెంటెడ్ దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కలయికలో సాలిడ్ ప్రాజెక్ట్‌ని విజయ్ చేయనున్నాడు. ఆల్రెడీ ట్యాక్సీవాలా చేసిన ఈ కాంబినేషన్ ఇప్పుడు మరో సినిమా చేసేందుకు సిద్ధం అయ్యారు. ఇక ఈ సినిమాపై కూడా మంచి అంచనాలు నెలకొనగా ఈ సినిమాలో హీరోయిన్‌గా నేషనల్ క్రష్ రష్మిక మందన్నా కన్ఫర్మ్ అయ్యింది. దర్శకుడు అలాగే నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నుంచి లేటెస్ట్ హింట్స్‌తో ఇది కన్ఫర్మ్ అయ్యింది. ఇక అధికారిక ప్రకటన ఒక్కటి మాత్రం బాకీ అని చెప్పాలి.

# చిరు, అనిల్ ప్రాజెక్ట్‌పై ఇంట్రెస్టింగ్ బజ్!



మెగా స్టార్ చిరంజీవి హీరోగా ఇపుడు చేస్తున్న విశ్వంభర కాకుండా మరో భారీ సినిమాల లైనప్ ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రాల్లో అనీల్ రావిపూడితో ప్లాన్ చేసిన సినిమా కూడా ఉన్న సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రం షూటింగ్ అతి త్వరలోనే మొదలు కానుండగా ఈ సినిమాపై లేటెస్ట్ ఇంట్రెస్టింగ్ బజ్ ఒకటి వినిపిస్తుంది. అయితే ఈ చిత్రంలో ఫీమేల్ లీడ్‌గా ఎవరు కనిపిస్తారు అని చాలా కాలం నుంచి ఓ టాక్ నడుస్తుంది. అయితే ఇపుడు నయనతార వరకు ఈ బజ్ రాగా ఆమెపై ఇపుడు మరో టాక్ వినిపిస్తుంది. నయన్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా కంటే ఒక పవర్ఫుల్ రోల్‌లో కనిపించే ఛాన్స్ ఉందట. మరి దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి భీమ్స్ సంగీతం అందిస్తుండగా షైన్ స్క్రీన్ వారు నిర్మాణం వహిస్తున్నారు.


# నా వ్యాఖ్యలకు చింతిస్తున్నా

## వివాదంపై విజయ్ క్లారిటీ



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న కింగ్డమ్ రిలీజ్‌కి వస్తుండగా ఈ మధ్యలో తాను స్టార్ హీరో సూర్య నటించిన రెట్రో సినిమా ప్రీరిలీజ్‌కి పాల్గొనడం జరిగింది. అయితే ఈ ఈవెంట్‌లో పహల్గమ్ దుర్ఘటనపై విజయ్ చేసిన ఎమోషనల్ కామెంట్స్ కొన్ని వివాదాలకి దారి తీశాయి. అయితే ఈ వివాదంపై విజయ్ ఇపుడు క్లారిటీ ఇచ్చాడు. తాను ఎక్కడా కూడా ఏ కుల ప్రస్తావన కూడా తీసుకు రాలేదని క్లారిటీ ఇచ్చాడు. తాను చేసింది కేవలం ఒకప్పటి తెగలు వారి ఐకమత్యం కోసం అని తెలిపాడు. తాను మొత్తంగా చెప్పాలి అనుకున్నది కేవలం శాంతి, ఐకమత్యం కోసమే అని ఈ మాటల్లో తన వల్ల ఎవరైనా బాధించి ఉంటే అందుకు క్షమాపణలు తెలుపుతున్నాని అని విజయ్ ఓ ప్రెస్ నోట్ ద్వారా రివీల్ చేసాడు. దీంతో తన కామెంట్స్ వైరల్‌గా మారాయి. గిరిజనులను అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ తెలంగాణ ట్రైబల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది కిషన్‌రాజ్ చౌహాన్, ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

హైదరాబాద్‌లో ఈ నెల 7 ప్రారంభమయ్యే 72వ మిస్ వరల్డ్ పోటీల లోగోను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.







# స్పోర్ట్స్ అథారిటీకి ఫుట్ బాల్ ప్రోత్సాహక అవార్డు

ప్రజాపక్షం/హైదరాబాద్: అఖిల భారత ఫుట్ బాల్ సమాఖ్య (ఎఐఎఫ్‌ఎఫ్) వార్షిక అవార్డుల దినోత్సవం భువనేశ్వర్‌లో జరిగింది. 202425 సంవత్సరానికి తెలంగాణలోని హైదరాబాద్‌లో ఫుట్ బాల్‌ను ప్రోత్సహించడంలో, విశేష కృషి, సహకారం అందించినందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణను అఖిల భారత ఫుట్ బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) ఏఐఎఫ్‌ఎఫ్ వార్షిక అవార్డుల దినోత్సవం సందర్భంగా సత్కరించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలా దేవి ఐఎఫ్‌ఎస్ ఈ అవార్డును అందుకున్నారు. ఏఐఎఫ్ ఎఫ్ వార్షిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఏఐఎఫ్ ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్ చౌబే, ఒడిశా గౌరవ ఉపముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ఒడియా భాషా సాహిత్యం, సాంస్కృతిక శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, ఐఏఎస్, ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి భాస్కర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఐఏఎస్, ఒడిశా ప్రభుత్వ క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర సభ్యులు అవార్డుల ప్రదానోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సోనీ బాలాదేవి, ఐఎఫ్‌ఎస్ మాట్లాడుతూ తెలంగాణ ఫుట్ బాల్‌కు దక్కిన గౌరవం, రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని పెంపొందించడానికి తెలంగాణ క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఏఐఎఫ్‌ఎఫ్‌కు తెలంగాణ ప్రభుత్వం తరపున వీసీ అండ్ ఎండీ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కృతజ్ఞతలు తెలియజేశారు.

# 70.13 లక్షల మెట్రిక్ టన్నులు

(మొదటి పేజీ తరువాయి)

చేపడుతున్నారు. ఇప్పటీ వరకు దాదాపు 45 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యం కొనుగోలు సెంటర్లకు చేరగా, ఇందులో 30 లక్షల మెట్రిక్ టన్నుల దాదాపు (45 శాతం) వరకు కొనుగోలు పూర్తి అయినట్లు సమాచార. సన్న వరి కోతలు ఇప్పుడిప్పుడే పూర్తి అవుతుండడంతో మరింత పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు సెంటర్లకు చేరే అవకాశం ఉంది. కొనుగోలు సెంటర్ల అకస్మిక తనిఖీలు : పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ ధాన్యం కొనుగోలు ఊపందుకుకోవడంతో పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ జిల్లాల లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల అకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఇందు లోభాగంగా ఆయన శనివారంహనుమకొండ జిల్లాలోని పలు ధాన్యం సేకరణ కేంద్రాలను సందర్శించి, ధాన్యం కొనుగోలుసెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడిన ఆయన అక్కడ ఏర్పాట్లపై ఆరా తీశారు. కేంద్ర కార్యాలయం నుండి అందే వాతావరణ సూచనల ఆధారంగా ప్రతి కొనుగోలు కేంద్రంలో కొనుగోలు ప్రక్రియను సక్రమంగా కొనసాగించాలని ఆదేశించారు. ధాన్యం నాణ్యత కోసం ప్రతి కేంద్రంలో ప్యాడీ క్లీనర్లు ఉపయోగించాలనీ, ట్యాబ్ ఎంట్రీలు వేగంగా పూర్తి చేసి, రైతులకు చెల్లింపులు త్వరగా చేయాలని సూచించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు.

# 'మిస్‌వరల్డ్'కు విస్తృత ఏర్పాట్లు చేయండి: సిఎస్



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రతిష్ఠాత్మకమైన 'మిస్ వరల్డ్ ' కార్యక్రమానికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా విస్తృత స్థాయి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు అధికారులను ఆదేశించారు. మిస్‌వరల్డ్ ఏర్పాట్లకు సంబంధించి సమగ్ర నివేదికను అందించాలని సూచించారు.ఈ మిస్ వరల్డ్ 2025కు సంబంధించిన ఏర్పాట్లపై హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు శనివారం సీనియర్ పోలీసు అధికారులు, ఇతర శాఖల ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రపంచం నలుమూలల నుండి వచ్చే అతిథులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీసుశాఖను ఆదేశించారు. విమానాశ్రయం, హోటల్స్, అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించే వేదికల వద్ద గట్టి భద్రతను కల్పించాలన్నారు. పోటీదారుల కోసం సవివరమైన బుక్‌లెట్ సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను, కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దాలని జిహెచ్‌ఎంసి అధికారులను సిఎస్ ఆదేశించారు.డిజిపి జితేందర్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు ఈ టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

# 'ఆపరేషన్ కగార్' ఆపండి... ఆదివాసీ హక్కులను కాపాడండి

## ఆదివాసీ హక్కుల పోరాట సమితి




ప్రజాపక్షం/హైదరాబాద్: 'ఆపరేషన్ కగార్'ను వెంటనే నిలిపివేసి, నక్సలైట్లతో చర్చలు జరిపి, ఆదివాసీ హక్కులను కాపాడాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రాల వారీగా ఆదివాసీల జీవన ప్రాంతాలల్లో 'ఆపరేషన్ కగార్' పేరుతో అల్లకల్లోలాన్ని సృష్టించి, ఆదివాసీలను అడవుల నుంచి వంపించే కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర పోచయ్య, రాష్ట్ర అధ్యక్షులు కోట్నాక విజయ్, ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ మావోయిస్టులు ప్రతిపాదించిన శాంతిచర్చలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, వారితో చర్చలు జరిపి, అడవుల్లో ప్రశాంత వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేయాలన్నారు.చత్తీస్‌ఘడ్, బస్తర్ లాంటి ప్రాంతాల్లో ఆదివాసీలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతూ, బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 12 నుంచి 14వరకు ఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్‌లో జరిగిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) డిక్లరేషన్ను వివరించారు. ఎస్‌టి రిజర్వేషన్లు ఆదివాసీలకు అందకుండా చేస్తున్న లంబాడీ, బంజారా, సుగాలి, గోరు మాటీలను ఎస్‌టి జాబితాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం ఆదివాసీలకు కేటాయించిన ప్రత్యేక షెడ్యూల్, అధికరణాల ప్రకారం 29జిఒను చట్టం చేయాలని,2006 ఆటవీ హక్కుల చట్టాని అమలు చేసి, ఆదివాసీలకు ఆటవీ హక్కుల శాశ్వత పట్టాలు ఇవ్వాలని,ఆదివాసీల అసైన్డ్, లవాణీ పట్టాలను శాశ్వత పట్టాలుగా మార్చాలని వారు తెలిపారు. ఆదివాసీ వ్యాపార సంస్థ జిసిసికి ప్రత్యేక నిధులు కేటాయించి, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆదివాసీ ప్రాంతాలల్లో గిరిజనేతరులను అక్రమ వసలదారులుగానే పరిగణించి, వారికి స్థిర, చర ఆస్తులపైన ఎటువంటి హక్కులను కల్పించకుండా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం సాగుబోయిన పాపారావు, ఆరెం అరుణ్ కుమార్, కల్తీ వెంకన్న, గౌరివేణి ప్రవీన్‌కుమార్, గౌడెం గణేష్, గొగ్గల్ల కోటయ్య, ఎస్.రాజేందర్, డాకర్ల రమేష్, చందా రఘుపతి,లక్ష్మ ణావు, సూర్యభాను తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌కు చేరుకున్న మిస్ కెనడా

ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్‌లో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న వివిధ దేశాల సుందరీమణుల రాక ప్రారంభమయింది. ఈ మిస్ వరల్ పోటీల కంటెస్టర్లు ఈ నెల 6 వ తేదీ నుండి హైదరాబాద్ కు చేరుకుంటారు. మిస్ కెనడా మిస్ ఎమ్మా డీనా కాథరిన్ మోరిసన్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు శనివారం సాయంత్రం చేరుకున్నారు. శంషాబాద్ కు చేరుకున్న మిస్ కెనడా కు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాల ప్రకారం అధికారులు ఘన స్వాగతం పలికారు.










Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com